మీ నమ్మకమే మా తరగని సంపద
KAPIL GROUP
కపిల్ చిట్స్ 46 Years
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

ESTD: 1999
www.voodayam.com

# ఉదయం

మీ నమ్మకమే మా తరగని సంపద
KAPIL GROUP
కపిల్ చిట్స్ 46 Years
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

హైదరాబాద్ | 16-05-2026 శనివారం | సంపుటి : 27 | సంచిక : 74 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal
Follow us on

## ప్రధానికి అరుదైన గౌరవం

### మోదీ విమానానికి ఎస్కార్ట్.. ఫైటర్ జెట్‌తో యూఏఈ ప్రత్యేక స్వాగతం



**హైదరాబాద్, మే 15 (ఎఎంఎస్) :**

ప్రధాని నరేంద్రమోదీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు అరుదైన గౌరవం లభించింది. మోదీని యూఏఈ ప్రత్యేకంగా స్వాగతించింది. ఆయన ప్రయాణిస్తున్న విమానం శుక్రవారం మధ్యాహ్నం యూఏఈ గగనతలంలోకి ప్రవేశించగానే.. ఆ దేశ ఫైటర్ జెట్ ఎస్కార్ట్‌గా వచ్చింది. తమ వాయుసేన కోసం ప్రత్యేకంగా రూపొందించిన యుద్ధ విమానం ఎఫ్16 బ్లాక్ 60 'డెజర్ట్ ఫాల్కన్'ను పంపింది. అబుదాబిలో ప్రధాని విమానం ల్యాండ్ అయ్యేవరకు వెంటే వచ్చింది. ఐరోపా దేశాల పర్యటనకు బయల్దేరిన మోదీ మధ్యలో యూఏఈకి వెళ్లారు. కేవలం కొన్ని గంటలే అక్కడ ఉండనున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో అంతర్జాతీయంగా ఇంధన సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో ఆయన పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

**యూఏఈపై ఇరాన్ దాడి సరికాదు: మోదీ**

యూఏఈపై ఇరాన్ దాడిని ప్రధాని మోదీ ఖండించారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం ప్రపంచం మొత్తంమీద ఉందని చెప్పారు. హర్మూజ్ విషయంలో అంతా అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి ఉండాలన్నారు. యూఏఈ పర్యటనకు వెళ్లిన ప్రధాని మోదీ సమక్షంలో భారత్ పలు కీలక ఒప్పందాలు చేసుకుంది. ఎల్‌పీజీ సరఫరా, పెట్రోలియం నిల్వలపై ఎంవోయూ కుదుర్చుకుంది. అంతేకాకుండా వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యం, నౌకల మరమ్మతు కేంద్రం ఏర్పాటు తదితర అంశాలకు సంబంధించిన ఎంవోయూలపై భారత అధికారులు సంతకాలు చేశారు.



## భోజ్‌శాల ఆలయం హిందువులదే

### మధ్యప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పు

**హైదరాబాద్, మే 15 (ఎఎంఎస్) :**

దశాబ్దాలుగా కొనసాగుతున్న మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలోని వివాదాస్పద భోజ్‌శాల/కమల్ మౌలా ఆలయ వివాదంలో అక్కడి హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ వివాదాస్పద స్థలం ఆలయానికే చెందుతుందని ఇందౌర్ ద్విసభ్య ధర్మాసనం హిందూ పిటిషనర్లకు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఈ ఆలయాన్ని పురావస్తుశాఖ అధీనంలోకి తీసుకోవాలని ఆదేశించింది. ఈ ఆలయంలో సరస్వతి విగ్రహం ఏర్పాటుచేసుకోవచ్చని కేంద్రానికి సూచించింది. ఈ ప్రదేశంలో ఎన్నోఏళ్ల పాటు దైవ ఆరాధన కొనసాగినట్లు భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ) చేసిన సర్వేలో తేలిందని ధర్మాసనం పేర్కొంది. పారమార రాజవంశానికి చెందిన రాజా భోజ్‌తో

మిగతా 2లో..

## కాంగ్రెస్‌ను కేంద్రంలో అధికారంలోకి తేవడమే లక్ష్యం

### గాంధీ కుటుంబానికి దేశంపై విశ్వాసం ఉందని వ్యాఖ్య

- ఏపీ సీఎం చంద్రబాబును ఇప్పటికి గౌరవిస్తా
- జనం స్విగ్గీ పాలిటిక్స్ కోరుకుంటున్నారు..
- దేశానికి కూడా సేవలందిస్తా..

సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, మే 15:**

గాంధీ కుటుంబానికి దేశంపై విశ్వాసం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తనకు చాలా చొరవ ఉందని పేర్కొన్నారు. తన గీత తాను దాటనని స్పష్టం చేశారు. ఈరోజు (శుక్రవారం) హైదరాబాద్ వేదికగా సీఎం మాట్లాడారు. టీడీపీలో పదేళ్లు పనిచేశానని.. సీఎం చంద్రబాబు ఇప్పటికి తనను గౌరవిస్తారని ప్రస్తావించారు. పార్టీని వదిలిపెట్టిన తర్వాత నాయకుల మధ్య మంచి సంబంధాలు ఉండటం చాలా అరుదని తెలిపారు.

**జనం స్విగ్గీ పాలిటిక్స్ కోరుకుంటున్నారు..**

పార్టీని వదిలిపెట్టే సమయంలో విజయవాడకు వెళ్లి చంద్రబాబుకు చెప్పి వచ్చానని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. కాంగ్రెస్‌ను దేశంలో అధికారంలోకి తేవాలని రాహుల్ గాంధీకి లక్ష్యం ఉందని.. కాని ప్రధాని కావాలన్న లక్ష్యం లేదని స్పష్టం చేశారు. వికారాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ప్రధాని పదవి తీసుకోవాలని తానే రాహుల్ గాంధీకి చెప్పి ఒప్పించానని ప్రస్తావించారు. ఇప్పుడు జనం స్విగ్గీ పాలిటిక్స్ కోరుకుంటున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి నుంచి ప్రధాని అభ్యర్థి రాహుల్ గాంధీనే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ముందు ప్రకటించి తర్వాత ఇండియా కూటమిని కూడా ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీ పేరును ఒప్పిస్తామని తెలిపారు.

**దేశానికి కూడా సేవలందిస్తా..**

ఇండియా కూటమి తరుపున ఒక పాలసీ డాక్యూమెంటును తీసుకువచ్చి ప్రజలను తీర్పు ఇవ్వమని కోరతామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 2024నుంచి 2034వరకు కాంగ్రెస్‌కు ప్రజలు అధికారం ఇస్తారని ధీమా వ్యక్తం చేశారు. 2034వరకు తాను తెలంగాణలోనే ఉంటానని.. ఇక్కడి ప్రజల కోసమే పనిచేస్తానని తెలిపారు. పదిశాతం జీడీపీని తెలంగాణ దేశానికి ఇచ్చేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రినని చెప్పుకొచ్చారు. 2034 తర్వాత తాను ముఖ్యమంత్రిగా ఉండనని.. తర్వాత తరానికి అవకాశం ఇస్తానని తెలిపారు. దేశానికి కూడా సేవలందిస్తా అని.. తన అనుభవాన్ని దేశం కోసం పంచుతానని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసిన తర్వాత.. ఆయన ఏ బాధ్యతలు అప్పగించిన తీసుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## నీట్‌పై ఆందోళన వద్దు

### వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో నీట్: ధర్మేంద్ర ప్రధాన్

**హైదరాబాద్, మే 15 (ఎఎంఎస్) :**

నీట్ పేపర్ లీక్ వ్యవహారం సంచలనం సృష్టించింది. దాంతో మే 3న నిర్వహించిన పరీక్షను రద్దు చేసి, మళ్లీ జూన్ 21న ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మీడియాతో మాట్లాడారు. వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని వెల్లడించారు.

''జూన్ 21న నీట్ రీఎగ్జామ్ తేదీ ఖరారైంది. నీట్ ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలపై విచారణకు ఆదేశించాం. ఇప్పటికే ఈ కేసును సీబీఐ విచారిస్తోంది. బాధ్యులపై

మిగతా 2లో..




## ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిరంతర ప్రక్రియ

- జూన్ 2న ఆదిలాబాద్ నుంచి రెండో విడత ప్రారంభం
- గూడులేని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు
- జాయింట్ సర్వే తో భూ సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం : మంత్రి శ్రీ పొంగులేటి




**హైదరాబాద్, మే 15 :**

పేద కుటుంబానికి సొంత ఇల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాదని, అది వారి ఆత్మ గౌరవానికి, భద్రమైన భవిష్యత్తుకు ప్రతీకని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంతరెడ్డి గారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల మంజూరును నిరంతరం కొనసాగించే ప్రక్రియగా చేపట్టిందన్నారు. గూడులేని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు సమకూర్చడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇవ్వని విధంగా ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయంతో (వంద శాతం సబ్సిడీతో) పేదల ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టి

మిగతా 2లో..

## 'హర్మూజ్'ను దాటిన రెండు భారత్ ఎల్‌పీజీ నౌకలు



**30 చైనా నౌకలకు అనుమతి**

హర్మూజ్ నుంచి చైనాకు చెందిన 30 నౌకలకు ఇరాన్ అనుమతినిచ్చింది. జలసంధి నిర్వహణ విధానాలకు అనుగుణంగా బుధవారం నుంచి చైనాకు చెందిన నౌకల సముద్రయానానికి అనుమతి మంజూరు చేసినట్టు ప్రకటించింది. మరోవైపు జలసంధి అన్ని రకాల వాణిజ్య నౌకల ప్రయాణం కోసం తెరిచే ఉంచామని, అయితే ఈ జలమార్గం గుండా పయనించే నౌకలు తమ నావికాదళానికి సహకారం అందించాల్సి ఉంటుందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ పేర్కొన్నారు.

**హైదరాబాద్, మే 15 (ఎఎంఎస్) :**

ఎల్‌పీజీ (వంట గ్యాసు)ని భారత్‌కు రవాణా చేస్తున్న రెండు ట్యాంకర్ నౌకలు సురక్షితంగా హర్మూజ్ జలసంధిని దాటాయని అధికారులు గురువారం వెల్లడించారు. దీంతో పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభమైన నాటి నుంచీ జలసంధిని దాటి భారత్‌కు చేరిన సరకు రవాణా నౌకల సంఖ్య 13కు చేరింది. ఎల్‌పీజీతో నిండిన ట్యాంకర్ నౌక సైమి బుధవారం జలసంధిని దాటగా, ఎన్‌వీ సన్‌షైన్ అనే మరో ట్యాంకర్ గురువారం సంక్షుభిత జలాలను దాటింది. పశ్చిమాసియాలో జరిగిన మరో ఘటనలో సోమాలియా నుంచి షార్జాకు వెళ్తున్న ''హాజీ అలీ'' అనే భారతీయ ధౌ నౌక ఒకటి ఒమాన్ సముద్ర జలాల్లో బుధవారం దాడికి గురై మునిగిపోయిందని కేంద్ర రేవులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ అదనపు కార్యదర్శి ముకేశ్ మంగల్ ప్రకటించారు. దాడికి బాధ్యులెవరన్నది ఆయన వెల్లడించలేదు. అయితే హాజీ అలీలో ప్రయాణిస్తున్న 14 మంది సిబ్బంది

మిగతా 2లో..

## మే 26న కేరళను తాకనున్న నైరుతి రుతుపవనాలు

### ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతోన్న ప్రజలకు చల్లని కబురు



**హైదరాబాద్, మే 15 :**

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతోన్న దేశ ప్రజలకు వాతావరణ విభాగం చల్లని కబురు వినిపించింది. దేశ వ్యవసాయ ఆధారిత ఆర్థికవ్యవస్థకు జీవనాడి అయిన నైరుతి రుతుపవనాలు మే 26న కేరళను తాకనున్నాయి. సాధారణంగా జూన్ 1 నాటికి రుతుపవనాలు పలకరిస్తుంటాయి. కానీ ఈసారి ఐదు రోజుల ముందే కేరళను తాకే అవకాశం ఉన్నట్లు ఐఎండీ శుక్రవారం వెల్లడించింది.

భారత ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వంలో నైరుతి రుతు పవనాలు కీలక పాత్ర పోషిస్తాయి. అయితే ఈసారి ఎల్‌నినో భయాలు ఉన్నాయి. తూర్పు, మధ్య పసిఫిక్ మహాసముద్రం ఉపరితల ఉష్ణోగ్రతల్లో మార్పుల నేపథ్యంలో ఎల్‌నినో ప్రారంభమైందని ఇప్పటికే ఇన్‌కాయిస్ ప్రకటించింది. ఈ ఏడాది ఏప్రిల్ వరకు తటస్థ పరిస్థితులు ఉండగా తాజాగా ఎల్‌నినోగా మారిందని వెల్లడించింది. ప్రస్తుత మే నుంచి 2027 జనవరి వరకు ఈ పరిస్థితులు కొనసాగుతాయని తెలిపింది. రుతుపవనాలు మొదటి దశలో అంటే జూన్ నుంచి జులై ప్రారంభంలో స్థిరమైన వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ సంస్థలు అంచనా వేశాయి. అయితే ఆగస్టు, సెప్టెంబర్‌లలో ఎల్‌నినో బలపడి, దేశవ్యాప్తంగా వర్షపాతంపై ప్రభావం చూపొచ్చని పేర్కొన్నాయి.

## కులాల అభివృద్ధే సంక్షేమం

- కుల కార్పొరేషన్లకు నిధులు, విధులు
- పెరిక సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, మే 15 :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కుల కార్పొరేషన్లకు త్వరలోనే నిధులు కేటాయిస్తామని, వారి విధుల విషయంలో కూడా స్పష్టత ఇస్తూ ఉత్తర్వులు జారీ చేస్తామని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ

మిగతా 2లో..

## కేసీఆర్ గొప్ప నాయకుడు



- కేసీఆర్ సీఎం అయ్యాక ప్రజలకు దూరమయ్యారు
- పరిపాలన కాలంలో కేసీఆర్ యంత్రంలా పని చేశారు
- అందుకే ఆయనకు ప్రజల భావోద్వేగాలు అర్థం కాలేదన్న కవిత

**హైదరాబాద్, మే 15 :**

ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ చాలా గొప్ప వ్యక్తి అని, అందులో ఎవరికీ అనుమానాలు లేవని తెలంగాణ రక్షణ

మిగతా 2లో..

## పేద ప్రజల ఆరోగ్యం కోసమే టిమ్స్ ఆసుపత్రులు



### కేటీఆర్

**హైదరాబాద్, మే 15 :**

నగర ప్రజలకు ప్రపంచ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో టిమ్స్ హాస్పిటల్స్ ఏర్పాటు చేశామని కేటీఆర్ అన్నారు. సనత్‌నగర్‌లోని టిమ్స్ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. గతంలో గాంధీ, ఉస్మానియా వంటి ప్రభుత్వ ఆసుపత్రులే ప్రధాన ఆధారమైతే, నేడు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకువచ్చిన అత్యాధునిక టిమ్స్

మిగతా 2లో..




"చమురు ధరలపై కేంద్రమంత్రి కిరణ్ రిజుజు ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'పశ్చిమాసియా పరిణామాలతో చమురు ధరలు పెరిగినా భారత్ మాత్రం ప్రజలపై భారం మోపలేదు. మిగతా దేశాలు పెట్రోల్, డీజిల్ ధరలను 20100 శాతం పెంచాయి. కానీ, భారత్‌లో మాత్రం పెట్రోల్‌పై 3.2 శాతం, డీజిల్‌పై 3.4 శాతం పెరిగింది. ప్రజలపై ఆర్థిక భారం పడకుండా, ద్రవ్యోల్బణం పెరగకుండా చమురు సంస్థలు ఇన్నాళ్లూ భారాన్ని మోశాయి. ఇది బాధ్యతతో కూడిన పరిపాలన. ఇది ప్రజలకు ప్రాధాన్యతనిచ్చే నాయకత్వం. నాయకత్వంలో, భారతదేశం ఆర్థిక స్థిరత్వాన్ని, ప్రజా సంక్షేమాన్ని సమతుల్యం చేస్తూనే ఉంది'"

- కిరణ్ రిజుజు, కేంద్రమంత్రి

## వేమన పద్యం

కర్మమధికమయిన గడచిపోవగరాదు
ధర్మరాజు తెచ్చి తగనిచోట రెండు గల
గంకుభట్టు చేసెగటగటా దైవంబు
విశ్వదాభిరామ వినురవేమ



# జీవుల మనుగడకు ఆధారం 'కాంతి' మాత్రమే !

విశ్వంలో కాంతి ఒక ప్రధాన భాగమే కాకుండా అత్యంత మౌళిక అంశంగా మారింది. అత్యంత సూక్ష్మ కణాల ధర్మాలను వర్ణించే క్వాంటం సైన్స్‌కు మూలాధారం కాంతి మాత్రమే. వేడి చేసిన వస్తువుల నుండి కాంతి కణాల లేదా ఫోటాన్ల ధర్మాల వరకు కాంతి శాస్త్రం వర్ణించబడుతుంది. ఫోటాన్స్ అంటే కాంతి సూక్ష్మ కణాలని అర్థం చేసుకోవాలి. కాంతికి పర్యాయపదంగా ఫోటాన్స్ నిలుస్తున్నాయి. కాంతి లేని భూగోళం శీతలం, బంజరు నేలల మయం. కాంతి ఎక్కడ ఉంటుందో అక్కడ జీవుల ఉనికి కనిపిస్తుంది. మానవాళి మనుగడకు కాంతితో అవిభాజ్య సంబంధం నెలకొని ఉన్నది. వైజ్ఞానిక శాస్త్ర అభివృద్ధి అంటే కాంతి దృగ్విషయాల శోధనలు మాత్రమే. కాంతి మాంద్యంగానే ప్రపంచ సూక్ష్మ విషయాలు అవగతం అవుతున్నాయి. 16 మే 1960 రోజున తొలిసారి బౌతికశాస్త్రజ్ఞుడైన ఇంజనీరు 'థియోడోర్ మైమాన్' కృషితో లేజర్ సర్జరీ జరిగింది. కాంతి పరిశోధనలతో ప్రత్యామ్నాయ శక్తి వనరులు, వైద్య రంగంలో ఒకచ్చితత్వంతో రోగ నిర్ధారణ లు, చికిత్స మార్గాలు, హైస్పీడ్ ఇంటర్నెట్ లాంటి అనేక ఆవిష్కరణలు నేటి ఆధునిక పౌర సమాజాన్ని అత్యంత ప్రభావితం చేస్తున్నాయి.

**కాంతి వైజ్ఞానికశాస్త్ర అనంత ప్రయోజనాలు:**
నేడు కాంతి ఆధార వైజ్ఞానికశాస్త్రం, టెక్నాలజీల పాత్ర అనన్య సామాన్యమైపోయింది. ఫోటోనిక్స్ ద్వారా నేడు ప్రపంచమంతటా అంతర్జాలం/ కమ్యూనికేషన్స్ నెట్‌వర్క్ సమన్వయ పరచబడింది. ఆప్టికల్ టెక్నాలజీలతో వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రిమోట్ సెన్సింగ్ వ్యవస్థలు సుస్థిర వ్యవసాయానికి బాటలు వేస్తున్నాయి. కాంతి వల్లనే భూమి కుగ్రామం అయిపోయింది. వాతావరణ మార్పుల అధ్యయనాలు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను అధిగమించడం లాంటివి సుసాధ్యం అవుతున్నాయి. సమ్మిళిత అభివృద్ధి, ఆహార భద్రత, ఆకలికి సమాధానం కూడా కాంతి శాస్త్రం ఇవ్వగలుగుతున్నది. అగ్రఫోటానిక్స్ వేదికగా సాగు పద్ధతుల్లో విప్లవాత్మక సకారాత్మక మార్పులు వస్తున్నాయి. శక్తిని ఆదా చేయడానికి ఎల్ఈడీ ప్రక్రియ అందుబాటులోకి వచ్చింది. టెలీకమ్యూనికేషన్ల రంగంలో విప్లవాత్మక మార్పులకు కాంతి పునాదులు వేస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది కంటి చూపు దోషాలను సవరించడానికి కాంతిఆధారిత భౌతిక శాస్త్రం దోహదపడుతున్నది. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమాటిక్స్ స్టెమ్ సమన్వయంతో సమ్మిళిత వైజ్ఞానికశాస్త్ర అభివృద్ధికి రాచ బాటలు పడుతున్నాయి. లింగ సమానకడక్వ సాధనకు మహిళలు, యువతులను కాంతి ఆధారిత పరిశోధనల వైపు మరల్చాలి. నేడు దాదాపు 28 శాతం మహిళలు పరిశోధనారంగాల్లో పని చేయడం జరుగుతోంది. శుద్ధ సురక్షిత తాగు నీటి లభ్యతకు ఫోటోనిక్స్ టెక్నాలజీలు ఉపయోగపడుతున్నాయి.

**అంతర్జాతీయ కాంతి దినోత్సవం-2026 ఇతివృత్తం:**
ప్రపంచ శాంతి, సుస్థిరాభివృద్ధికి బాటలు వేస్తున్న కాంతి ప్రక్రియలను, కాంచి ప్రాధాన్యాలను వివరించడానికి, మరింత ప్రయోజనకరంగా మార్చడానికి ప్రతి ఏట 16 మే రోజున "అంతర్జాతీయ కాంతి దినోత్సవం" లేదా "ఇంటర్నేషనల్ డే ఆఫ్ లైఫ్"ను పాటించడం ఆనవాయితీగా మారింది. 2026 అంతర్జాతీయ కాంతి దినోత్సవం" ఇతివృత్తంగా "ఉజ్వల సుస్థిర భవిష్యత్తుకు కాంతి (లైట్ ఫర్ ఏ సస్టేనబుల్ ఫ్యూచర్)" అనబడే అంశాన్ని తీసుకోని నిత్య జీవితంలో కాంతి ప్రాధాన్యాలను వివరించడంతో జరుగుతుంది. కాంతి అద్భుత ధర్మాలను లేదా కాంతిఆధారిత టెక్నాలజీలను సాధారణ మానవాళికి వివరించడం, కాంతి అంశంలో మరింత లోతైన పరిశోధనలను ప్రోత్సహించడం, కాంతితో కళలు/సంస్కృతి సంబంధాలను వర్ణించడం, కాంతి అనువర్తనాలను చర్చించడం, సుస్థిరాభివృద్ధిలో కాంతి సాంకేతికతను వాడుకోవడం లాంటి అంశాలతో పాటు శక్తిని సమర్ధవంత వినియోగాలు, శక్తి నష్టాల నివారణ, కాంతి కాలుష్య కట్టడి లాంటి అంశాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వబడుతుంది. పునరుత్పాదక శక్తి వనరులు, మానవాళి కనీస అవసరాలు, వాతావరణ మార్పులు, కృత్రిమ ఉపగ్రహాలు లాంటివి కాంతి ఆధారంగానే జరుగుతున్నాయి.

**అంతర్జాతీయ కాంతి దినోత్సవ కార్యక్రమాలు:**
2015 ఏడాదిని అంతర్జాతీయ కాంతి సంవత్సరంగా పాటించడం సత్ఫలితాలను ఇవ్వడంతో 2018 నుంచి యునెస్కో అంచర్జాతీయ కాంతి దినోత్సవాన్ని ప్రవేశ పెట్టడం జరిగింది. వైద్య ఆరోగ్య రంగాలు, ఇంటర్నెట్‌కమ్యూనికేషన్ వ్యవస్థలు, సుస్థిర శక్తి వనరుల వాడకం, విద్యుత్‌తో పాటు ఆవిష్కరణలు లాంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు సుసాధ్యం కావడానికి కాంతిఆధారిత ఆధునిక పరిజ్ఞానాలు దోహదపడుతున్నాయి. అంతర్జాతీయ కాంతి దినోత్సవ వేదికగా వైజ్ఞానిక ప్రదర్శనలు, ఉపన్యాసాలు, వెబినార్లు, సడలే జర్‌ఆప్టిక్స్ నమూనాల ప్రదర్శనలు, ఆర్ట్ ఫోటోగ్రఫీ రంగాల్లో పోటీలు, ప్లానిటోరియం సందర్శనలు లాంటివి ఏర్పాటు చేయవచ్చు.



మధుసూదన్ రెడ్డి
9949700037

## రచనలు పంపండి



వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

## అదుపు తప్పిన ఆర్థిక ప్రగతి వెల్లడిస్తున్న
# ప్రధాని పొదుపు మాత్రం

మే 10న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బీజేపీ నిర్వహించిన ఓ బహిరంగ సభలో ప్రసంగిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు దేశం ఎదుర్కొంటున్న కఠినమైన పరిస్థితుల గురించి పరోక్షంగా హెచ్చరించారు. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా సరఫరా వ్యవస్థలో నెలకొన్న క్లిష్టమైన పరిస్థితులను ప్రస్తావిస్తూ ప్రజలు పొదుపుగా జీవించాలని విజ్ఞప్తి చేశారు.

ఒక సంవత్సరం పాటు బంగారం కొనవద్దని, పెట్రోల్, డీజిల్ అనవసరంగా వాడవద్దని, విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా క్లాసులను తీసుకోమని, ఉద్యోగులను అవకాశం ఉన్నమేరకు 'వర్క్ ఫ్రమ్ హోమ్' చేయమని. ఇక నూనె వాడకం తగ్గించమని అంటూ, ఆర్గానిక్ వ్యవసాయం వైపు రైతులు చూస్తే మంచిది సూచించారు. తన ప్రసంగంలో విదేశీప్రయాణాలు కూడా కుదించుకోవాల్సిన అవసరం కూడా ప్రస్తావించారు.

పైగా, విదేశీ వస్తువుల వాడకం తగ్గించాలని, స్థానిక వస్తువులను ప్రోత్సహించాలని కోరారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యల రీత్యా దేశ ఆర్థిక ప్రగతి మందగించటం వలన ఇటువంటి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టటం అవసరం అని స్పష్టం చేశారు. ఓ విధంగా మొన్నటి వరకు ప్రపంచంలో నాల్గవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా, వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా చెప్పుకుంటూ వచ్చిన ప్రధాని ఇప్పుడు ఆరవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారిన వాస్తవాన్ని పొరపాటున కూడా ప్రస్తావించలేదు.

ప్రధాని ప్రసంగం చేసిన ఐదు రోజులకు పెట్రోల్, డీసెల్ ధరలను లీటర్ కు మూడు రూపాయలు చొప్పున పెంచారు. ప్రజాస్వామ్యంలో పారదర్శకత అత్యంత అవసరం. వాస్తవాలను ప్రజలముందు ఉంచి, పాలకులు వారిని దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు సిద్ధపడే విధంగా చేయాలి. అయితే, ఈ విషయంలో మనదేశం వెనుకబడి ఉందని చెప్పక తప్పదు.

ఒక వంక, దేశంలో పుష్కలంగా చమురు నిల్వలు ఉన్నాయని, మనం అనుసరిస్తున్న దౌత్య విధానం కారణంగా హర్మూజ్ జలసంధి వద్ద ఆంక్షలను అధిగమించి పుష్కలంగా దేశ అవసరాలకు సరిపడిన సరఫరాలు పలు మార్గాల నుండి పొందగలుగుతున్నామని చెప్పుకుంటూ వస్తున్నారు. ఇంకోవంక క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉంటున్నాయి.

భారత్ కు ఇంధన సరఫరా సమస్యలు ఎదురుకాకుండా ఆదుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని రష్యా మంత్రులు స్పష్టం చేస్తున్నా స్పందన లేదు. భాత్‌కు చవకగా ఎల్ఎన్‌జీ సరఫరా చేస్తామంటూ రష్యా అవసరం లేదంటూ నిరాకరిస్తున్నాము. రాయిటర్స్ కథనం ప్రకారం ఏప్రిల్ 30న రష్యా మంత్రి పావెల్ సోరోకిన్ న్యూఢిల్లీ సందర్శన సందర్భంగా మన పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి, ఇతర అధికారులతో సమావేశమై తాము చవకగా ఇచ్చే ఎల్ఎన్‌జీని దిగుమతి చేసుకోవాలంటూ ఆఫర్ ఇచ్చారు.

అయితే, రష్యా ఎల్ఎన్‌జీని దిగుమతి చేసుకోలేమంటూ భారత్ తన నిస్సహాయతను తెలియజేసింది. భారత్ నిర్ణయం కారణంగా రష్యాకు చెందిన ఒక ఎల్ఎన్‌జీ నౌక భారత్‌కు రాకుండా సింగపూర్ సమీపంలో నిలిచిపోయింది. ఏది ఏమైనా, పలువురు ఆర్థికవేత్తలు ఊహించినట్లుగానే, ఎన్నికల కాలం ముగియడంతో పొదుపు చర్యలకు ప్రధాని పిలుపు ఇవ్వడం, వెంటనే ముఖ్యమంత్రులు, మంత్రులు తమ వాహనాల సంఖ్యను తగ్గించుకోవడం వంటి చర్యలతో ప్రజలను ఆకట్టుకోవడంలో పోటీపడుతున్నారు.

పశ్చిమ ఆసియా సంక్షోభాన్ని ప్రధాని మోదీ "ఈ దశాబ్దపు అతిపెద్ద సంక్షోభాలలో ఒకటి"గా అభివర్ణించారు. రాష్ట్ర అసెంబ్లీల ఎన్నికలు ముగియడంతో, పెరుగుతున్న ఇంధన ధరలు, దిగుమతుల భారం, బలహీనపడుతున్న రూపాయి, తరిగిపోతున్న విదేశీ మారక నిల్వలపై ఆందోళనలు తెరపైకి వచ్చాయి.

అయితే ఈ పేరుతో ప్రజలపై భారాలు మోపే ప్రయత్నాలు చేయడం, వారిని మరిన్ని భారాలు మోయమని కోరడమే గాని ప్రభుత్వం విధాన పరమైన చర్యలకు సిద్ధపడటం లేదు. కార్పొరేట్ పన్ను మినహాయింపులను పునఃపరిశీలించడం లేదా అధిక సంపన్నులపై పన్ను విధించే చర్యలకు బదులుగా, సాధారణ పౌరుల నుండి "చిన్న త్యాగాలు", "సామూహిక బాధ్యత"కోసం విజ్ఞప్తులు చేస్తున్నారు.




అత్యంత సంపన్నులు ఖచ్చితంగా తక్కువ బంగారం కొనుగోలు చేయగలరు, తక్కువ విదేశీ విహారయాత్రలు లేదా డెస్టినేషన్ వెడ్డింగ్‌లలో పాల్గొనగలరు (ఇవి కేవలం $16 నుండి $18 బిలియన్ల వరకు మాత్రమే ఉంటాయి). కానీ రాబోయే ధరల పెరుగుదల అసలు భారం పేదలపైనే ఎక్కువగా పడుతుంది. అసలు, దేశంలో ఎంతమంది ప్రజలు వాస్తవంగా ఇంటి నుండి పని చేయగలరు? వాస్తవానికి, స్థూల ఆర్థిక పరిస్థితి తీవ్రంగానే ఉంది.

పశ్చిమ ఆసియా సంఘర్షణ మొదలైన గత రెండు నెలల్లో విదేశీ మారక నిల్వలు 38 బిలియన్ డాలర్లు పడిపోయాయి. అదే సమయంలో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లకు పైగానే ఉన్నాయి. అయినప్పటికీ, సర్దుబాటు భారాన్ని సాధారణ పౌరులపై, ముఖ్యంగా తక్కువ ఆదాయ వర్గాలపై మోపడం అనేది విధాన ప్రాధాన్యతల గురించి ముఖ్యమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది.

ఈ దృక్పథం, ఇటీవలి ఆర్థిక సమాచార ప్రసారాల విస్తృత ఉద్దేశానికి అనుగుణంగా ఉంది. కేంద్ర బడ్జెట్ కుటుంబాలకు స్వల్పకాలిక ఉపశమనం పరిమితంగానే ఉంటుందని సూచించగా, ఆర్థిక సర్వే స్వల్పకాలిక నివారణ చర్యల పట్ల హెచ్చరించడానికి 'ప్రేయ' (క్షణిక సౌకర్యం), 'శ్రేయ' (శాశ్వతమైన మేలు) మధ్య ఉన్న తాత్విక భేదాన్ని ఉపయోగించుకుంది. దీని సారాంశం ఏమిటంటే, తక్షణ జోక్యం కంటే ఓపికతో సహించడమే ఇక్కడ ముఖ్య సందేశం.

పొదుపు సందేశానికి "ఆత్మనిర్భరత", స్వదేశీ నినాదాలను జోడించడం కూడా వినోదాత్మకంగా ఉంది. ఉదాహరణకు, స్వదేశీ జాగరణ్ మంచ్ దేశీయ ఉత్పత్తులను కొనాలన్న, విదేశీ నిల్వలను ఆదా చేయాలన్న విజ్ఞప్తిని స్వాగతించింది. సుంకాల డిమాండ్లకు తలొగ్గడం, డిజిటల్ సేవల పన్నును ఉపసంహరించుకోవడం వంటి బాహ్య ఒత్తిళ్లకు గణనీయంగా తలొగ్గుతున్న వాణిజ్య విధానంతో పాటు "ఆత్మనిర్భరత", స్వదేశీ వంటి పదజాలాన్ని ఉపయోగించడంలో ఉన్న ఉద్రిక్తతను గమనించడం ముఖ్యం.

పొదుపు సందేశాన్ని ప్రచారం చేయడంలో స్వేచ్ఛా మార్కెట్ మౌలికవాదులకు వారి స్వంత ప్రయోజనాలు ఉన్నాయి. వాస్తవానికి వారి దృష్టిలో, ఈ సందేశం కేవలం పౌరులకే పరిమితం కాకూడదు. ప్రభుత్వం సబ్సిడీల వర్షం కురిపిస్తోందని, సంక్షేమ పథకాలపై విపరీతంగా ఖర్చు చేస్తోందని, వీటన్నింటినీ కలిపి "ఉచితాలు" అనే పదంతో పిలుస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.

ప్రస్తుతానికి కావలసింది పొదుపు చర్యలు కాదు. ఒక ఆర్థిక వ్యవస్థను నిజంగా స్థితిస్థాపకంగా మార్చే పరిస్థితులను బలోపేతం చేయడం. గృహ స్థాయిలో ఖర్చులను తగ్గించుకోవడం కంటే, బలమైన సామాజిక వ్యయం, మెరుగైన మానవ అభివృద్ధి ఫలితాలు, విస్తృతమైన దేశీయ డిమాండ్ అనేవి ప్రపంచ ప్రతికూలతల నుండి మెరుగైన రక్షణ కవచాలుగా పనిచేస్తాయి.

స్థిరమైన కరెన్సీలు కలిగిన దేశాలు ఉత్పాదక రంగ బలంతో ప్రత్యేకతను చాటుకుంటాయని ఆర్థిక సర్వేనే స్వయంగా అంగీకరించింది. గత దశాబ్దంలో భారతదేశ గమనం దీనికి వ్యతిరేక దిశలో సాగింది. 2020 నుండి 2025 మధ్య, మొత్తం ఎగుమతుల వృద్ధి (వార్షిక సగటు) 9.4% ఉండగా, వస్తు ఎగుమతుల వృద్ధి కేవలం 6.4% వద్ద నిలిచింది. ఇది వస్తువుల కంటే సేవలపై నిరంతర ఆధారపడటాన్ని ప్రతిబింబిస్తుంది.

ఏదేమైనప్పటికీ, దీర్ఘకాలిక బాహ్య, కరెన్సీ స్థిరత్వం అంతిమంగా వస్తు ఆధారిత ఎగుమతి సామర్థ్యంపైనే ఆధారపడి ఉంటుంది. విచారకరంగా, భారతదేశంలో మనం ఒకే సమయంలో తయారీ రంగంలో ఒక దశాబ్దం నష్టాన్ని, అలాగే నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, పెద్ద నోట్ల రద్దు, మహమ్మారి, ముడి చమురు సంక్షోభం వంటి వరుస షాక్‌ల బారిన పడి సతమతమవుతున్న ప్రజల వినియోగ శక్తి క్షీణించడాన్ని చూస్తున్నాము.


అనవసరపు ప్రయాణాలు మానుకోవలసిందిగా ప్రజలకు పాఠం చెప్పిన ప్రధాని మోదీ ఆ రోజు ప్రైవేట్ కార్యక్రమాలకు హైదరాబాద్ లో హాజరయ్యేందుకు వాయుసేనకు చెందిన ప్రత్యేక విమానం, మూడు ప్రత్యేక హెలికాప్టర్లు, ప్రధాని సెక్యూరిటీ అంతా కదలి రావాల్సి రావడంతో భారీగా ప్రభుత్వవ్యయం అయింది. అంతేకాదు. ఎన్డీయే ముఖ్యమంత్రుల ప్రమాణస్వీకారంకు కొద్దిసేపు హాజరయ్యేందుకు ఆయన మాత్రమే కాకుండా కేంద్ర మంత్రులు, ఎన్డీయే ముఖ్యమంత్రులు ప్రభుత్వ నిధులతో ప్రత్యేక విమానాలతో హాజరుకావాల్సిన అవసరం ఏమొచ్చింది? అనే ప్రశ్నలు తలెత్తుతాయి.

వాస్తవానికి స్వదేశంలో, విదేశంలో ప్రయాణాలకు ప్రధానమంత్రిగా మోదీ పెట్టిన ఖర్చులు గతంలోని ప్రధాన మంత్రులు ఎవ్వరికీ తీసిపోని విధంగా ఉంటాయి. ఆయన ప్రజలకు పొదుపు పాఠాలు చెప్పడం విస్మయం కలిగిస్తోంది. నేడు భారతదేశపు ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం ఆకస్మికంగా పశ్చిమాసియా ఘర్షణలతో తలెత్తింది కాదని గమనించాలి. దశాబ్దానికి పైగా పేరుకుపోతున్న నిర్మాణాత్మక అసమతుల్యతల ఫలితం అని తెలుసుకోవాలి.

నామమాత్రపు జీడీపీ పరంగా ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఉన్నప్పటికీ, భారతదేశం తీవ్రమవుతున్న వైరుధ్యాలను ప్రదర్శిస్తోంది. వాస్తవ ఆర్థిక ఉత్పత్తిని గణనీయంగా అధిగమించిన స్టాక్ మార్కెట్ క్యాపిటలైజేషన్, చారిత్రాత్మక గ్రామీణపట్టణ వలసలకు దారితీస్తున్న దీర్ఘకాలిక సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగం, పెరుగుతున్న విదేశీ రుణ బాధ్యతలు, ఉత్పాదక తయారీ రంగం క్షీణించడాన్ని కప్పిపుచ్చే సేవా రంగ ఆధిపత్యం అందుకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు.

విదేశీ రుణాలు గణనీయంగా, వేగంగా పెరుగుతూ ఉండటం ఆందోళన కలిగిస్తుంది. ప్రస్తుత కాలంలో దేశం ఎదుర్కొంటున్న ప్రధాన నిర్మాణాత్మక బలహీనతలలో ఒకటిగా ఈ పరిణామం నిలుస్తోంది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ గణాంకాల ప్రకారం, మార్చి 2024 చివరి నాటికి భారతదేశ మొత్తం విదేశీ రుణాలు 663.8 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. కేవలం ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే ఈ రుణం 39.7 బిలియన్ డాలర్లు మేర పెరిగింది. మార్చి 2025 చివరి నాటికి, ఈ మొత్తం మరింత పెరిగి 736.3 బిలియన్ డాలర్లకు చేరింది. ఇది వార్షికంగా 67.5 బిలియన్ డాలర్ల విస్తరణను సూచిస్తూ, 10.1% వార్షిక వృద్ధి రేటును నమోదు చేసింది.

భారత రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ నుండి ఐఎంఎఫ్‌తో సహా అంతర్జాతీయ సంస్థల వరకు ప్రముఖ ఆర్థికవేత్తలు జారీ చేసిన నిర్మాణాత్మక హెచ్చరికలకు తగినంత విధానపరమైన స్పందన లభించడంలేదు. దేశంలో స్టాక్ మార్కెట్ లావాదేవీలు జిడిపి మొత్తంకు మించరాదని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తుంటారు. కానీ మనదేశంలో 135 శాతం మేరకు స్టాక్ మార్కెట్ వ్యవహారాలు నమోదవుతున్నాయి. మన ఆర్థిక వ్యవస్థ సంక్షోభం మూలాలు అక్కడే ఉన్నాయని గుర్తించాలి.



చలసాని నరేంద్ర
9849569050

# పెట్రోల్ డీజిల్ మంటలు

## ప్రజల జేబుకు కొత్త భారం!



ఉదయం బైక్ స్టార్ట్ చేసే ముందు మీటర్ వైపు చూసే రోజుల నుంచి... ఇప్పుడు పెట్రోల్ బంక్ బోర్డు చూసి గుండె బరువెక్కే రోజులు వచ్చాయి. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు మళ్లీ పెరగడంతో సాధారణ కుటుంబాల నుంచి రైతులు, ఆటో డ్రైవర్లు, చిన్న వ్యాపారుల వరకు అందరి జీవన వ్యయం పెరుగుతోంది. ఒక్క లీటర్ ధర పెరగడం అంటే కేవలం వాహన ఖర్చు పెరగడమే కాదు; కూరగాయల రవాణా నుంచి బస్సు ఛార్జీలు, సరుకు రవాణా నుంచి మార్కెట్ ధరల వరకు మొత్తం ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం పడుతుంది.

తాజాగా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఆయిల్ మార్కెటింగ్ సంస్థలు పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు సుమారు రూ.3 వరకు పెంచాయి. ఇది నాలుగేళ్ల తర్వాత వచ్చిన పెద్ద పెరుగుదలగా భావిస్తున్నారు.

**ఎందుకు పెంచారు?**
ప్రధాన కారణం అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా పెరగడం. పశ్చిమ ఆసియా ఉద్రిక్తతలు, ఇరాన్ పరిణామాలు, హోర్ముజ్ జలసంధిలో సరుకు రవాణా అంతరాయం వంటి కారణాలతో అంతర్జాతీయంగా చమురు ధరలు భారీగా ఎగిశాయి. దీంతో భారత ప్రభుత్వ ఆయిల్ కంపెనీలు భారీ నష్టాలను ఎదుర్కొన్నాయని చెబుతున్నారు. ఇండియా తన అవసరాల కోసం ఎక్కువ భాగం ముడి చమురును విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధర పెరిగితే దాని ప్రభావం నేరుగా దేశీయ ఇంధన ధరలపై పడుతుంది. రూపాయి విలువ తగ్గినా కూడా ఇంధన దిగుమతి ఖర్చు పెరుగుతుంది.

**రెండు తెలుగు రాష్ట్రాల్లో ధరల వ్యత్యాసం ఎందుకు?**
పెట్రోల్ ధరలు ప్రతి రాష్ట్రంలో ఒకేలా ఉండవు. కారణం — రాష్ట్ర ప్రభుత్వాలు విధించే (వ్యాట్), సెస్సులు, అదనపు పన్నులు.

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం:**
ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై అత్యధిక పన్నుల్లో ఒకటి ఉంది. అక్కడ 31% వ్యాట్ తో పాటు అదనపు రోడ్డు డెవలప్‌మెంట్ సెస్ కూడా ఉంది. తెలంగాణలో కూడా అధిక వ్యాట్ ఉండటంతో ధరలు జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉన్నాయి.

**తాజా అంచనాల ప్రకారం:**
తెలంగాణలో పెట్రోల్ ధర లీటరుకు సుమారు ₹110 వరకు చేరింది. ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని ప్రాంతాల్లో ₹112 దాటింది. అంటే ఒకే దేశంలో ఉన్న రెండు పొరుగు రాష్ట్రాల్లో కూడా పన్నుల విధానం వల్ల వినియోగదారుడు ఎక్కువ ధర చెల్లించాల్సి వస్తోంది.

**ప్రభుత్వ విధానం ఏంటి?**
భారతదేశంలో ప్రస్తుతం "డైనమిక్ ఫ్యూయల్ ప్రైసింగ్" విధానం అమల్లో ఉంది. అంటే అంతర్జాతీయ ముడి చమురు ధరలు, డాలర్ మారకం విలువ, రవాణా ఖర్చులు, కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ, రాష్ట్ర వ్యాట్ ఆధారంగా ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు ధరలు మారుతాయి.

**కేంద్ర ప్రభుత్వం ఒకవైపు:**
- ఆయిల్ కంపెనీల నష్టాలను తగ్గించాలని చూస్తోంది.
- మరోవైపు ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉండాలని భావిస్తోంది.
- ఇక రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇంధన పన్నుల ద్వారా భారీ ఆదాయం పొందుతున్నాయి. అందుకే వ్యాట్ తగ్గించడంలో చాలా రాష్ట్రాలు వెనుకంజ వేస్తున్నాయి.

**పెట్రోల్, డీజిల్ GSTలోకి వస్తాయా?**
ఇది చాలాకాలంగా చర్చలో ఉన్న అంశం. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ జీఎస్టీ పరిధిలో లేవు. అందువల్ల కేంద్ర ఎక్సైజ్, రాష్ట్ర వ్యాట్ వేర్వేరుగా విధిస్తున్నారు.

**ఇంధనాన్ని జీఎస్టీలోకి తీసుకొస్తే:**
- దేశవ్యాప్తంగా ఒకే విధమైన పన్ను విధానం రావచ్చు.
- ధరలు కొంత తగ్గే అవకాశం ఉంటుంది.
- కానీ రాష్ట్రాలకు వచ్చే ఆదాయం తగ్గిపోతుందనే భయంతో ఈ నిర్ణయం ఇంకా అమలు కాలేదు.

**ప్రభావం ఎవరిపై ఎక్కువ?**
- ఈ ధరల పెరుగుదలతో అత్యధికంగా నష్టపోయేది మధ్యతరగతి మరియు పేద ప్రజలే.
- రైతులకు ట్రాక్టర్లు, మోటార్లు నడపడం ఖరీదవుతుంది.
- ఆటో, క్యాబ్ డ్రైవర్ల ఆదాయం తగ్గుతుంది.
- సరుకు రవాణా ఖర్చు పెరిగి కూరగాయలు, నిత్యావసరాల ధరలు పెరుగుతాయి.
- గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగాలకు వెళ్లే కార్మికులపై అదనపు భారం పడుతుంది.
- ఇంధన ధర పెరుగుదల అంటే కేవలం బంక్ వద్ద మాత్రమే కాదు... ప్రతి ఇంటి వంటగదిలో కూడా దాని ప్రభావం కనిపిస్తుంది.

**వినియోగదారులు ఈ సమస్యను ఎలా ఎదుర్కోవాలి?**
**ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం అవసరం:**
- అవసరం లేని ప్రయాణాలు తగ్గించాలి.
- బైక్, కార్లకు రెగ్యులర్ మెయింటెనెన్స్ చేయాలి.
- కార్ పూలింగ్, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఉపయోగించాలి.
- ఎలక్ట్రిక్ వాహనాలపై దృష్టి పెట్టాలి.
- గ్రామాల్లో సైకిల్ వినియోగాన్ని మళ్లీ ప్రోత్సహించాలి.
- రైతులు సోలార్ ఆధారిత పరికరాల వైపు మళ్లాలి.
- చిన్న చిన్న మార్పులు కూడా నెలాఖరులో పెద్ద ఆదా ఇవ్వగలవు.

**ముగింపు :** ఇంధన ధరల పెరుగుదల ఇప్పుడు కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాదు... ఇది సామాజిక, రాజకీయ, జీవన ప్రమాణాల సమస్యగా మారుతోంది. ప్రపంచ మార్కెట్ పరిస్థితులు భారతదేశాన్ని ప్రభావితం చేస్తున్నా, ప్రజలపై భారం తగ్గించే బాధ్యత మాత్రం ప్రభుత్వాలదే. కేంద్రం, రాష్ట్రాలు కలిసి పన్నులపై సమతుల్య విధానం తీసుకురాకపోతే... పెట్రోల్ బంక్ మీటర్ వేగం కంటే ప్రజల ఆందోళనల వేగమే ఎక్కువగా పెరుగుతుంది. "ఇంధనం" ఇప్పుడు వాహనాలకు మాత్రమే కాదు... దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా ప్రధాన శక్తి. ఆ శక్తి ధర పెరిగితే, ప్రజల జీవిత వేగం తగ్గిపోవడం సహజమే.



శ్యాంమోహన్
9440595858

## కమ్యూనికేషన్ రంగానికి మూలస్తంభంగా
# శాస్త్రవేత్త డేవిడ్ ఎడ్వర్డ్ హ్యూస్

మానవ స్వరాన్ని ప్రపంచ దూరాలకు శబ్దంగా పరిచయం చేసిన సంఘటన విజ్ఞాన చరిత్రలో ఓ మైలురాయి. ఈ శబ్ద విప్లవానికి మార్గం వేసిన ఆవిష్కరణ మైక్రోఫోన్. శబ్దాన్ని విద్యుత్ సంకేతాలుగా మార్చే ఈ అద్భుత పరికరాన్ని శాస్త్రీయంగా అభివృద్ధి చేసిన విజ్ఞాన శిల్పి డేవిడ్ ఎడ్వర్డ్ హ్యూస్. ఆయన కమ్యూనికేషన్ రంగానికి మూలస్తంభంగా నిలిచిన శాస్త్రవేత్త. పేటెంట్ హక్కుల ఊహలకు అతీతంగా, పరిశ్రమలకు తన ఆవిష్కరణలు ఉచితంగా అందించాలన్న ఉదారత ఆయనను విశ్వ విజ్ఞాన మాధ్యమాల్లో చిరస్మరణీయుడిగా నిలిపింది.



1831 మే 16న బ్రిటన్‌లో జన్మించిన డేవిడ్ హ్యూస్ చిన్ననాటి నుంచే సంగీతంపై మక్కువ చూపించాడు. పియానో, మాండలిన్ వాయిద్యాల్లో ప్రావీణ్యం సాధించిన అతను, శబ్ద తరంగాల స్వభావంపై ఆసక్తితో శాస్త్రీయ అధ్యయనానికి పయనమయ్యాడు. 1838లో కుటుంబంతో కలిసి అమెరికాకు వలస వెళ్లిన హ్యూస్, కెంటుకీలోని సెయింట్ జోసెఫ్స్ కళాశాలలో సంగీత ప్రొఫెసర్‌గా స్థిరపడ్డాడు. అయితే సంగీతంలోని శబ్దతత్వం ఆయనను ఎలక్ట్రిక్ విజ్ఞాన ప్రక్రియల వైపు ఆకర్షించింది.

1855లో అభివృద్ధి చేసిన టైప్‌ప్రింటింగ్ టెలిగ్రాఫ్ పరికరం హ్యూస్‌కు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చింది. టెలిగ్రాఫ్ ద్వారా వచ్చిన సంకేతాలను తక్షణమే అక్షరాలుగా ముద్రించ గలిగే ఈ పరికరం కమ్యూనికేషన్ రంగంలో విప్లవాత్మక మార్పుకు కారణమైంది. ఇది ఫ్రాన్స్, ఇటలీ, రష్యా వంటి దేశాలలో అధికారికంగా ఉపయోగించ బడింది.

1878లో హ్యూస్ రూపొందించిన కార్బన్ మైక్రోఫోన్ ఆధునిక టెలిఫోన్ వ్యవస్థకు మౌలిక పునాదిగా నిలిచింది. శబ్ద తరంగాలను విద్యుత్ ప్రవాహ మార్పులుగా మార్చే ఈ పరికరం, మానవ స్వరాన్ని కిలోమీటర్ల దూరానికీ పంపించ గలిగే సామర్థ్యం కలిగింది. ఆసక్తికరమైనది ఏమంటే, హ్యూస్ తన మైక్రోఫోన్ ఆవిష్కరణకు పేటెంట్ దాఖలు చేయలేదు. శాస్త్రీయ విజ్ఞానాన్ని వ్యక్తిగత లాభానికి ఉపయోగించకుండా, సమాజానికి అందించిన ఉదారత ఆయన గొప్పతనానికి నిదర్శనం.

వైర్‌లెస్ కమ్యూనికేషన్ పై కూడా హ్యూస్ విశేష ప్రయోగాలు నిర్వహించాడు. 1879లో 500 గజాల దూరానికి వైర్‌లెస్ సంకేతాలను ప్రసారం చేయగలిగిన ఆయన, హర్ట్స్, మార్కోని కంటే ముందే రేడియో తరంగాలను ప్రయోగాత్మకంగా అన్వేషించాడు. కానీ, ఈ పరిశోధనలకు తగినంత శాస్త్రీయ ప్రామాణికత అందలేదన్న కారణంతో, ఆ కీర్తి ఆయనకు దక్కలేదు. అయినా ఆయన అభివృద్ధి చేసిన ఇండక్షన్ బ్యాలెన్స్ పరికరం ఆధారంగా భవిష్యత్తులో మెటల్ డిటెక్టర్లు రూపొందించబడ్డాయి.

తన ఆవిష్కరణలకు గుర్తింపుగా హ్యూస్ 1880లో బ్రిటన్ రాయల్ సొసైటీ ఫెలోగా ఎంపికయ్యాడు. 1885లో రాయల్ మెడల్‌తో సత్కరించ బడ్డాడు. ఫ్రాంక్లిన్ ఇనిస్టిట్యూట్ సహా అనేక అంతర్జాతీయ శాస్త్రీయ సంస్థల నుంచి గౌరవాలు అందుకున్నాడు. అయినప్పటికీ, శాస్త్రానికి సేవ చేయాలన్న లక్ష్యం ఒక్కటే ఆయన్ని నడిపించింది.

1900 జనవరి 22న హ్యూస్ లండన్‌లో పరమ పదించాడు. ఆయన సాధించిన విజ్ఞాన పునాదులు టెలి కమ్యూనికేషన్, రేడియో, టెలివిజన్, మైక్రోఫోన్, డిజిటల్ ఆడియో వ్యవస్థల్లో నేటికీ ప్రాణంగా కొనసాగు తున్నాయి. శబ్దాన్ని విద్యుత్ భాషలో మార్చిన ఆయన సృష్టి, మానవ సంభాషణలకి సుదూర సంబంధాలే కాదు - సమాజానికి శాశ్వతమైన శబ్ద సంబంధాన్ని అందించిందని చెప్పడంలో సందేహమే లేదు.



(కాలగిరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్)

# జాతీయం-అంతర్జాతీయం

## బాబ్రీ మసీదులాగే భోజ్‌శాల తీర్పు సుప్రీంకు వెళ్తామన్న ఓవైసీ



**వుదయం డెస్క్, మే 15:**

మధ్యప్రదేశ్ ధార్‌లోని భోజ్‌శాల వివాదాస్పద స్థలంపై ఆ రాష్ట్ర హైకోర్టు సంచలన తీర్పు చెప్పింది. ''భోజ్ శాల ఒక ఆలయం'' అని స్పష్టం చేసింది. అయితే, ఈ తీర్పును ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది బాబ్రీ మసీదు తీర్పును పోలి ఉందని, సుప్రీంకోర్టు ఈ తీర్పును రద్దు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ''సుప్రీంకోర్టు దీనిని సరిదిద్ది, ఈ ఉత్తర్వును రద్దు చేస్తుందని మేము ఆశిస్తున్నాము. బాబ్రీ మసీదు తీర్పుతో స్పష్టమైన సారూప్యతలు ఉన్నాయి'' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ తీర్పును వ్యతిరేకిస్తున్న ముస్లిం పక్షం కూడా చెప్పింది. తాము సుప్రీంకోర్టులో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తామని ధర్ షహర్ ఖాజీ వకార్ సాదిక్ అన్నారు.ఎన్నో దశాబ్ధాలుగా ఉన్న ఈ వివాదంపై శుక్రవారం మధ్యప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. భోజ్‌శాల సముదాయం, సరస్వతీ దేవికి అంకితం చేయబడిన ఆలయమని హైకోర్టు శుక్రవారం ఒక చారిత్రాత్మక తీర్పు ఇచ్చింది. అదే సమయంలో, మసీదు నిర్మాణం కోసం జిల్లాలో ప్రత్యేక భూమిని కేటాయించాలని కోరుతూ ముస్లిం సమాజం రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించవచ్చని కూడా పేర్కొంది. భోజ్‌శాల ఆలయంకమల్ మౌలా మసీదు వివాదంపై తన తీర్పును వెలువరిస్తూ, భోజ్‌శాల స్థలంలో ఒక సంస్కృత బోధనా కేంద్రం, సరస్వతీ దేవి ఆలయం ఉన్నట్లు సూచనలు ఉన్నాయని కోర్టు పేర్కొంది.



## జానపద గాయకుడిపై లక్షల్లో నోట్ల వర్షం

**గుజరాత్, మే 15(వుదయం):**

ప్రస్తుతం భారత్‌లోనూ.. అంతర్జాతీయంగా ఆర్థిక సంక్షోభం కొనసాగుతోంది. పశ్చిమాసియా యుద్ధం కారణంగా చమురు, గ్యాస్ కష్టాలు ప్రజలను ముప్పతిప్పలు పెడుతున్నాయి. దీంతో ఆయా దేశాల్లో పొదుపు మంత్రం పాటిస్తున్నారు. ఇప్పుడు భారత్‌లో కూడా ప్రధాని దగ్గర నుంచి పౌరులంతా పొదుపు మంత్రం పాటిస్తున్నారు. ఇలాంటి తరుణంలో గుజరాత్‌లోని ఓ జానపద గాయకుడిపై లక్షల రూపాయల నోట్లు కుమ్మరించడం వివాదాస్పదమవుతోంది. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.జునాగఢ్ జిల్లా ఖంభాలియా గ్రామంలో సంప్రదాయ 'డైరో' కార్యక్రమం జరిగింది. డైరో అనేది గుజరాత్‌లో సంగీతం, కథలు, హాస్యాన్ని మేళవించి నిర్వహించే ప్రత్యేక జానపద కార్యక్రమం. ఈ కార్యక్రమంలో గాయకుడు గోపాల్ సాధు హార్మోనియం వాయిస్తూ పాటలు పాడుతుండగా భక్తులు పరవసించిపోయారు. ఇంకేముంది.. బ్యాగుల నిండా భారీగా నోట్ల కట్టలను తీసుకొచ్చి కుమ్మరించారు. సంచుల్లో తీసుకొచ్చిన డబ్బును వేదికపైనే కుమ్మరించడంతో గోపాల్ సాధు దాదాపు నోట్ల కుప్పలో కనిపించకుండా పోయారు. అయినప్పటికీ ఆయన ఏ మాత్రం ఆగకుండా తన గానం కొనసాగించారు.

ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ''ఇదే అసలు వర్క్ ఫ్రం హోమ్.. కూర్చొని నోట్ల వర్షంలో తడుస్తున్నారు'' అంటూ ఒకరు కామెంట్ చేయగా.. ''అంత డబ్బు మధ్యలో కూడా ప్రశాంతంగా పాడుతున్నారు'' అంటూ మరొకరు స్పందించారు. ఇంకొందరు ఈ డబ్బును పేదల సంక్షేమానికి వినియోగించాలని సూచించారు.

ఇదే తరహా ఘటనలు గుజరాత్‌లో గతంలో కూడా చోటుచేసుకున్నాయి. 2023లో వల్సాద్‌లో నిర్వహించిన భజన కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు కీర్తిదాన్ గఢ్వీపై కూడా రూ.10, రూ.20, రూ.50, రూ.100 నోట్ల వర్షం కురిసింది. అలాగే 2022లో నవ్‌సారీలో జరిగిన మరో కార్యక్రమంలో ఆయనపై సుమారు రూ.50 లక్షల విలువైన నోట్లను భక్తులు కురిపించారు. గుజరాత్‌లో జానపద సంగీత కార్యక్రమాల్లో గాయకులపై నగదు నోట్ల వర్షం కురిపించడం సాధారణమేనని స్థానికులు చెబుతున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా వచ్చిన మొత్తాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించే సంప్రదాయం కూడా ఉందని సమాచారం.

## ''భోజ్‌శాల హిందువులదే''



- ఆలయం ఎలా మసీదుగా మారింది
- చరిత్ర ఏం చెబుతోంది.?

**వుదయం డెస్క్, మే 15:**

దేశంలో మందిర్‌మసీదు వివాదాలు కొనసాతున్నాయి. ఇప్పటి వరకు అయోధ్యబాబ్రీ మసీదు, కాశీ విశ్వనాథ ఆలయంజ్ఞానవాపి మసీదు, శ్రీ కృష్ణ జన్మస్థలంషాహీ ఈద్గా దర్గా వివాదాలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ కోవకు చెందినదే మధ్యప్రదేవ్ రాష్ట్రంలోని ధార్‌లోని భోజశాలకమల్ మౌలా మసీదు. దశాబ్ధాలుగా నలుగుతున్న ఈ వివాదంపై మధ్యప్రదేశ్ హైకోర్టు శుక్రవారం సంచలన తీర్పు ఇచ్చింది. ''భోజ్‌శాల ఒక సరస్వతీ ఆలయం'' అని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో దశాబ్ధాలుగా హిందువుల కల నెరవేరింది. ఏఎస్ఐ నివేదిక, శాస్త్రీయ ఆధారాలతో తాము ఈ తీర్పు ఇస్తున్నట్లు ఇండోర్ ధర్మాసనం ప్రకటించింది. ముస్లింలు కావాలంటే ప్రార్థనాస్థలం కోసం ప్రభుత్వాన్ని కోరవచ్చని చెప్పింది. ఒకప్పుడు వేద ఘోష, సంస్కృతంతో ప్రతిధ్వనించిన ఈ చారిత్రాత్మక కట్టడం ఇప్పుడు వివాదంలో ఉంది. ప్రస్తుతం ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ASI) దీనిని ''భోజ్‌శాల ఆలయం కమల్ మౌలా మసీదు సముదాయం'' గా పిలుస్తోంది. క్రీ.శ 1034లో పర్మార్ రాజవంశానికి చెందిన శక్తివంతమైన రాజు భోజుడు దీనికి పునాది వేశారు. భోజరాజు యోధుడు మాత్రమే కాదు, 72 కళలు, 36 రకాల ఆయుధాల వాడకంలో నిపుణుడు. ప్రస్తుతం భోజశాలగా పిలువబడుతున్న ఈ ప్రాంతంలో సంస్కృత విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. కాళిదాసు, బాణభట్టుడు, భవభూతి వంటి మహానుభావులతో ఈ ప్రాంతానికి సంబంధం ఉందని చరిత్ర చెబుతుంది.

### సుప్రీం కోర్టు పొదుపు మంత్రం


## ఇకపై వర్చువల్ విచారణకు ఆదేశం



**వుదయం డెస్క్, మే 15:**

పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచ దేశాల్లో సంక్షోభం నెలకొంది. ఆయా దేశాలు ఇప్పటికే పొదుపు మంత్రం పాటిస్తున్నాయి. ఇప్పుడు భారత్ వంతు వచ్చింది. ప్రధాని మోడీ దగ్గర నుంచి కేంద్రమంత్రులు, రాష్ట్రాలు పొదుపు మంత్రం పాటించక తప్పడం లేదు. ఇప్పటికే మోడీ కాన్వాయ్ సగానికి సగం తగ్గిపోయింది. అలాగే రాష్ట్రాల ముఖ్యమంత్రుల పరిస్థితి కూడా ఇంతే. ఇక కేంద్రమంత్రులు ప్రజా రవాణాను ఉపయోగిస్తున్నారు. విదేశీ మారక నిల్వలు అయిపోవడం.. నిలిచిపోవడంతో దేశంలో సంక్షోభం తలెత్తాయి. దీంతో దేశ పౌరులంతా పొదుపు మంత్రం పాటించాలని భారత ప్రభుత్వం ఆదేశించింది.తాజాగా దేశ సర్వోన్నత న్యాయస్థానం కూడా ఈ కోవలోకి వచ్చేసింది. తాజా పరిణామాల నేపథ్యంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై వర్చువల్ విచారణలకు సుప్రీంకోర్టు ఆదేశించింది. రిజిస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ విచారణలు కేవలం సోమ, శుక్రవారాల్లో మాత్రమే నిర్వహించాలని కోర్టు ఆదేశించింది. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సీజేఐ సూర్యకాంత్ ఈ నిర్ణయం తీసుకున్నారు.ఫిబ్రవరి 28న ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా దాడి చేశాయి. ఈ ఘటనలో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ అయతుల్లా ఖమేనీ హతమయ్యారు. అనేక మంది ప్రభుత్వ పెద్దలు కూడా చనిపోయారు. దీనికి ప్రతీకారంగా ఇరాన్ గల్ఫ్ దేశాలపై దాడులు చేసింది. అంతేకాకుండా హోర్ముజ్ జలసంధిని కూడా మూసేసింది. దీంతో ప్రపంచ దేశాలకు వెళ్లే నౌకలు నిలిచిపోయాయి. దీంతో చమురు, గ్యాస్ కష్టాలు మొదలయ్యాయి. ఇప్పటికే ఆయా దేశాల్లో పొదుపు మంత్రం పాటిస్తుండగా.. ప్రస్తుతం భారత్‌లో అమలవుతోంది.

## మోడీ, రాష్ట్రపతికి పుతిన్ సందేశం యూపీ తుఫాన్ మృతులకు సంతాపం



**వుదయం డెస్క్, మే 15:**

రష్యా అధ్యక్షుడు పుతిన్.. ప్రధాని మోడీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ములకు సంతాపం సందేశం పంపించారు. ఉత్తరప్రదేశ్‌లో తుఫాను వల్ల జరిగిన ప్రాణ నష్టంపై పుతిన్ విచారం వ్యక్తం చేస్తూ.. ప్రధాని మోడీ, రాష్ట్రపతి ముర్ములకు సందేశం పంపారు. తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ''ఈ ప్రకృతి వైపరీత్యంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు, ప్రియమైన వారికి నా ప్రగాఢ సంతాపం. గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను..'' అని రాసుకొచ్చారు.

బుధవారం ఉత్తరప్రదేశ్‌లో తుఫాను బీభత్సం సృష్టించింది. సుమారు 19 జిల్లాల్లో భారీ నష్టం వాటిల్లింది. 100 మందికి పైగా మరణించారు. బుధవారం ఊహించని రీతిలో రాష్ట్రమంతటా తుఫాన్ కకావికలం చేసింది. పెద్ద ఎత్తున గాలులు, వర్షం కురవడంతో జనజీవనం అస్తవ్యస్థం అయింది. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. అనేక ఇళ్లు దెబ్బతిన్నాయి. ఒక్క ప్రయాగ్‌రాజ్‌లోనే 21 మంది మృతి చెందారు.భదోహిలో 18 మంది, మీర్జాపూర్‌లో 15 మంది, ఫతేపూర్‌లో 10 మంది, ఉన్నావ్, బదాయూన్‌లలో చెరో ఆరుగురు, ప్రతాప్‌గఢ్, బరేలీలలో చెరో నలుగురు, అలాగే సీతాపూర్, రాయ్‌బరేలి, చందౌలీలలో ఇద్దరు చొప్పున మరణించారు. మృతుల కుటుంబాలకు సీఎం యోగి ఆదిత్యనాథ్ సంతాపం వ్యక్తం చేశారు. 24 గంటల్లో ఆర్థిక సాయాన్ని పంపిణీ చేయాలని ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఒక్కసారిగా ఉత్తర్ ప్రదేశ్‌లోని ఐదారు జిల్లాల్లో హోరుగాలి, వర్షం బీభత్సం సృష్టించింది. హోర్డింగులు, రేకుల షెడ్లు కూలిపోయాయి. చాలా ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నెలకొరియాయి. ఒక వ్యక్తి అయితే గాల్లోకి ఎగిరిపడ్డాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

## ఆర్జీకర్ కేసులో ముగ్గురు ఐపీఎస్ అధికారులు సస్పెండ్





**పశ్చిమబెంగాల్,మే 15(వుదయం):**

పశ్చిమబెంగాల్‌లో ఏర్పడిన బీజేపీ ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా బెంగాల్, దేశ రాజకీయాలను కుదిపేసిన ఆర్జీ కర్ మెడికల్ కాలేజ్, హాస్పిటల్ పీజీ డాక్టర్ హత్యాచార ఘటనపై సంచలన నిర్ణయం తీసుకుంది. ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారుల్ని సస్పెండ్ చేసింది సువేందు అధికారి ప్రభుత్వం. ఈ కేసును సరిగా నిర్వహించలేదని ఈ ముగ్గురు అధికారులపై ఆరోపణలు ఉన్నాయి.రాష్ట్ర సచివాలయంలో సీఎం సువేందు అధికారి మాట్లాడుతూ.. మాజీ కోల్‌కతా పోలీస్ కమిషనర్ వినీత్ గోయల్, మాజీ డిప్యూటీ కమిషనర్లు ఇందిరా ముఖర్జీ, అభిషేక్ గుప్తాలపై శాఖాపరమైన విచారణ ప్రారంభించిన నేపథ్యంలో వారి సస్పెన్షన్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ''కేసు సరిగా నిర్వహించకపోవడం, బాధితురాలి తల్లిదండ్రులకు లంచం ఆశగా చూపడం, అధికారిక అనుమతి లేకుండా విలేకరుల సమావేశం నిర్వహించడం'' వంటి ఆరోపణలు ఈ ముగ్గురిపై ఉన్నాయి.

### పాక్‌పై నమ్మకం లేదు

## ఇరాన్ యుద్ధంలో భారత్‌నే నమ్ముతున్న రష్యా



**న్యూఢిల్లీ,మే 15(వుదయం):**

న్యూఢిల్లీ వేదికగా బ్రిక్స్ దేశాల విదేశాంగ మంత్రులు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రష్య విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలలో భారతదేశం ఒక ''దీర్ఘకాలిక మధ్యవర్తి'' పాత్ర పోషించగలదని రష్యా విదేశాంగ మంత్రి అన్నారు. ప్రస్తుతం, ఇరాన్ యుద్ధంలో పాకిస్తాన్ మధ్యవర్తి పాత్ర పోషిస్తోంది. అయితే, పాకిస్తాన్ చేసిన మధ్యవర్తిత్వం ఫలితాలను ఇవ్వలేదు. పాక్ అమెరికా ప్రతిపాదనల్ని తమ ముందు పెడుతోందని, తమ ప్రతిపాదనల్ని పట్టించుకోవడం లేదని ఇరాన్ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో రష్యా ప్రతిపాదన కీలకంగా మారింది. ''సమస్యలను పరిష్కరించేందుకు అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు జరిపేందుకు పాకిస్తాన్ ప్రస్తుతం సహాయం చేయవచ్చు. అయితే దీర్ఘకాలిక మధ్యవర్తి అవసరమైతే సుదీర్ఘ దౌత్య అనుభవం ఉన్న భారత్ ఆ పాత్ర పోషించగలదు'' అని రష్యా మంత్రి అన్నారు. అయితే, లావ్రోవ్ చేసిన ఈ వ్యాఖ్యలు పాకిస్తాన్‌కు చికాకు తెప్పించవచ్చు. పాక్ మధ్యవర్తిత్వంపై ఇజ్రాయిల్, యూఏఈ, ఇరాన్ కూడా అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ఇటీవల పాక్ మధ్యవర్తిత్వాన్ని తాము విశ్వసించడం లేదని అమెరికా సెనెటర్ లిండ్సే గ్రాహం అన్నారు.

## ఘోర విషాదం.. గుడికెళ్లి వస్తుండగా ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు మృతి

**కర్ణాటక,మే 15(వుదయం):**

కర్ణాటకలో ఘోర విషాదం చోటుచేసుకుంది. విజయనగరలో గుడికి వెళ్లి తిరిగి వస్తుండగా ట్రాక్టర్‌ను వెనుక నుంచి అత్యంత వేగంగా ట్యాంకర్ ఢీ కొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు ప్రాణాలు కోల్పోగా... మరో 10 మందికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.విజయనగర జిల్లాలోని టీబీ డ్యామ్ సమీపంలో జాతీయ రహదారి 50పై శుక్రవారం ఘోర ప్రమాదం జరిగింది. అతివేగంగా వస్తున్న ట్యాంకర్ వెనుక నుంచి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఆ తీవ్రతకు రెండు వాహనాలు వంతెన పైనుంచి కిందపడిపోయాయి. ఈ ప్రమాదంలో చిన్నారితో సహా ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు అక్కడికక్కడే మరణించగా.. మరో పది మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటినా సంఘటనాస్థలికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు.




బాధితులు హులిగెమ్మ ఆలయంలో పూజ చేసి ట్రాక్టర్‌పై తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. మృతుల్లో ఎక్కువ మంది విజయనగర జిల్లా, కుడ్లిగి తాలూకాలోని మారల్యాన్‌హళ్లి గ్రామానికి చెందినవారు కాగా.. మిగిలిన వారు బళ్లారి జిల్లా, సాండూర్ తాలూకాలోని యశ్వంత్ నగర్, కుడ్లిగి ప్రాంతంలోని అంకామన్నహళ్లి గ్రామానికి చెందినవారని తెలిసింది. ఈ ఘోర ప్రమాదంతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. క్షతగాత్రులను హుటాహుటినా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## చైనాలో ట్రంప్ టూర్



హోర్ముజ్ జలసంధిపై వైట్‌హౌస్ కీలక ప్రకటన

**వుదయం డెస్క్, మే 15:**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనాలో పర్యటిస్తున్నారు. మూడు రోజుల పర్యటన కోసం బుధవారం బీజింగ్ చేరుకున్నారు. శుక్రవారం తిరిగి అమెరికాకు వెళ్లున్నారు. ఇక పర్యటనలో భాగంగా జిన్‌పింగ్‌తో ట్రంప్ కీలక ద్వైపాక్షిక సమావేశం నిర్వహించినట్లుగా వైట్‌హౌస్ పేర్కొంది. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికాచైనా మధ్య ఆర్థిక సహకారాన్ని మరింత విస్తరించే దిశగా చర్చలు సానుకూలంగా జరిగాయని వెల్లడించింది. చైనాలో అమెరికన్ కంపెనీలకు మరింత మార్కెట్ యాక్సెస్ కల్పించడం, అదే సమయంలో అమెరికా పరిశ్రమల్లో చైనా పెట్టుబడులను పెంచే అంశాలపై ఇరు దేశాధినేతలు చర్చించినట్లు తెలిపింది. ఈ సమావేశంలో అమెరికాకు చెందిన పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులు కూడా పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఈ సమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చిన అంశాల్లో హోర్ముజ్ జలసంధి, ప్రపంచ ఇంధన భద్రత కీలకంగా నిలిచాయి. ప్రపంచ ఇంధన సరఫరాలకు అంతరాయం కలగకుండా హోర్ముజ్ జలసంధి ఎల్లప్పుడూ తెరిచి ఉండాలని ట్రంప్‌జిన్‌పింగ్ ఇద్దరూ అంగీకరించినట్లు తెలిపింది. హోర్ముజ్ జలసంధిని సైనికీకరించడాన్ని చైనా వ్యతిరేకించిందని.. అక్కడ టోల్ చార్జీలు విధించే ప్రతిపాదనలకూ కూడా బీజింగ్ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు వెల్లడించింది. భవిష్యత్తులో హోర్ముజ్‌పై ఆధారాన్ని తగ్గించుకునేందుకు అమెరికా నుంచి మరింత చమురు కొనుగోలు చేసే ఆసక్తిని చైనా వ్యక్తం చేసినట్లు వైట్‌హౌస్ తెలిపింది.

ఇక ఇరాన్ అంశంలో కూడా ఇరు దేశాలు ఒకే అభిప్రాయానికి వచ్చినట్లు వెల్లడించింది. ''ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలను కలిగి ఉండకూడదు'' అనే విషయంలో ట్రంప్, జిన్‌పింగ్ ఇద్దరూ ఏకీభవించినట్లు పేర్కొంది. అలాగే అమెరికాలో తీవ్ర ఆందోళన కలిగిస్తున్న ఫెంటానిల్ సంక్షోభంపైనా ఇరు దేశాలు చర్చించాయి. అమెరికాకు అక్రమంగా చేరుతున్న ఫెంటానిల్ తయారీ రసాయనాల ప్రవాహాన్ని అరికట్టేందుకు మరింత కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరంపై ఇరు దేశాలు ఏకాభిప్రాయానికి వచ్చినట్లు వైట్‌హౌస్ పేర్కొంది.ఈ సమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చిన అంశాల్లో హోర్ముజ్ జలసంధి, ప్రపంచ ఇంధన భద్రత కీలకంగా నిలిచాయి. ప్రపంచ ఇంధన సరఫరాలకు అంతరాయం కలగకుండా హోర్ముజ్ జలసంధి ఎల్లప్పుడూ తెరిచి ఉండాలని ట్రంప్‌జిన్‌పింగ్ ఇద్దరూ అంగీకరించినట్లు తెలిపింది. ఇక ఇరాన్ అంశంలో కూడా ఇరు దేశాలు ఒకే అభిప్రాయానికి వచ్చినట్లు వెల్లడించింది. ''ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలను కలిగి ఉండకూడదు'' అనే విషయంలో ట్రంప్, జిన్‌పింగ్ ఇద్దరూ ఏకీభవించినట్లు పేర్కొంది. అలాగే అమెరికాలో తీవ్ర ఆందోళన కలిగిస్తున్న ఫెంటానిల్ సంక్షోభంపైనా ఇరు దేశాలు చర్చించాయి. అమెరికాకు అక్రమంగా చేరుతున్న ఫెంటానిల్ తయారీ రసాయనాల ప్రవాహాన్ని అరికట్టేందుకు మరింత కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరంపై ఇరు దేశాలు ఏకాభిప్రాయానికి వచ్చినట్లు వైట్‌హౌస్ పేర్కొంది.ఈ సమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చిన అంశాల్లో హోర్ముజ్ జలసంధి, ప్రపంచ ఇంధన భద్రత కీలకంగా నిలిచాయి. ప్రపంచ ఇంధన సరఫరాలకు అంతరాయం కలగకుండా హోర్ముజ్ జలసంధి ఎల్లప్పుడూ తెరిచి ఉండాలని ట్రంప్‌జిన్‌పింగ్ ఇద్దరూ అంగీకరించినట్లు తెలిపింది. హోర్ముజ్ జలసంధిని సైనికీకరించడాన్ని చైనా వ్యతిరేకించిందని.. అక్కడ టోల్ చార్జీలు విధించే ప్రతిపాదనలకూ కూడా బీజింగ్ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు వెల్లడించింది. భవిష్యత్తులో హోర్ముజ్‌పై ఆధారాన్ని తగ్గించుకునేందుకు అమెరికా నుంచి మరింత చమురు కొనుగోలు చేసే ఆసక్తిని చైనా వ్యక్తం చేసినట్లు వైట్‌హౌస్ తెలిపింది.

ఇక ఇరాన్ అంశంలో కూడా ఇరు దేశాలు ఒకే అభిప్రాయానికి వచ్చినట్లు వెల్లడించింది. ''ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలను కలిగి ఉండకూడదు'' అనే విషయంలో ట్రంప్, జిన్‌పింగ్ ఇద్దరూ ఏకీభవించినట్లు పేర్కొంది.



# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా విద్యా వారోత్సవాల కింద రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ దినోత్సవం, ప్రణాళిక ప్రకారం చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలి: జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**




**రాజన్న సిరిసిల్ల, మే -15 (వుదయం ప్రతినిధి)**

విద్యార్థులందరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. *ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఈ నెల 11 వ తేదీ నుంచి 17 వ తేదీ వరకు విద్యా వారోత్సవాల కింద రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా జయ జయహే తెలంగాణ పాటను వినిపించారు. లైబ్రరీ లో చదివి ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తకాలను పరిశీలించారు. పాఠశాలల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక పుస్తక ప్రదర్శన, మానసిక ఉల్లాసానికి అందుబాటులో ఉంచిన వివిధ ఆటల పరికరాలను పరిశీలించి.. విద్యార్థులు ఈ పుస్తకాలు, ఆటల పరికరాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా జూన 12వ తేదీ వరకు 10 శాఖల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, చెత్తాచెదారం తొలగింపు పనులు చేయించామని వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల సందర్భంగా రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన సదస్సులు చేపట్టామని వెల్లడించారు. ఆరు రకాల ప్రత్యేక వైద్య నిపుణులతో రోగ నిర్ధారణ పరీక్షలు, సేవలు అందించామని తెలిపారు. పోలీస్, రవాణా శాఖ ఆధ్వర్యంలో డ్రైవర్లకు వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు చేయించామని పేర్కొన్నారు. మూడేండ్ల వయసు, అలాగే ఆరేండ్లలోపు పిల్లలు తమ సమీపంలోని అంగన్వాడీ కేంద్రంలో నమోదు కావాలని సూచించారు. కోడి గుడ్లు, బాలామృతం, ఇక్రిశాట్ వారి సూచనల మేరకు రూపొందించిన స్నాక్స్, పాలు పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చాలా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. లైబ్రరీ అనేది చదువుకునేందుకు మంచి అవకాశమని, మిగతా వారితో పోటీ పడే స్ఫూర్తి పొందుతారని పేర్కొన్నారు. తాను కూడా లైబ్రరీలో చదివానని గుర్తు చేశారు. పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న అభ్యర్థులు వార్త పత్రికలు చదవాలని సూచించారు. దీంతో అన్ని విషయాలపై అవగాహన వస్తుందని వివరించారు. సమయం చాలా విలువైందని, సోషల్ మీడియా కు దూరంగా ఉంటూ లక్ష్య సాధన పై దృష్టి సారించాలని సూచించారు. ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని, ప్రతి సబ్జెక్ట్ కు నిర్ణీత గడువు పెట్టుకొని చదవాలని తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న వారు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. ఏదైనా కొలువు సాధించాలని ఆకాంక్షించారు. స్కూల్ వెళ్ళే విద్యార్థులు లైబ్రరీకి వచ్చేలా వివరించాలని పేర్కొన్నారు. వచ్చే వారం యూత్ అండ్ పర్యాటక శాఖ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ప్రత్యేక వాకథాన్, జాబ్ మేళా నిర్వహించ నున్నామని వెల్లడించారు. యువత పెద్ద సంఖ్యలో తరలి రావాలని పిలుపు నిచ్చారు.

**కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో పరిశీలన**

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో టాస్క్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కంప్యూటర్ శిక్షణ తరగతులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. ఎంత మంది విద్యార్థులు వస్తున్నారు? ఏ ఏ అంశాలు నేర్చుకుంటున్నారో ఆరా తీశారు. తరగతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం కృషితో గ్రంథాలయాలను అభివృద్ధి బాటలో తీసుకు వెళుతున్నామని తెలిపారు. గ్రంథాలయంలో చదువుకొని దాదాపు 150 మంది వరకు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు. చాలా గ్రామాల్లో పబ్లిక్ రీడింగ్ రూమ్ లను ఏర్పాటు చేసి గ్రామీణ పాఠకులకు గ్రంథాలయాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## జనగణన తయారీపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా కలెక్టర్

**కామారెడ్డి, మే 15 (వుదయం ప్రతినిధి):-**

జనగణన2027లో భాగంగా మొదటి దశలో చేపడుతున్న ఇంటి గణన, ఇంటి జాబితా తయారీ కార్యక్రమం పై జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ అధికారి టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని తహసీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లకు పలు సూచనలు చేసి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, జిల్లాలో నియమించబడిన ఎన్యూమరేటర్లు అందరూ తమకు కేటాయించిన హౌస్ లిస్టింగ్ బ్లాక్స్ పరిధిలో హెచ్ ఎల్ ఓ యాప్ ద్వారా వివరాలను నమోదు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పాలన అధికారులు, పట్టణ ప్రాంతాల్లో వార్డ్ అధికారులు, బిల్ కలెక్టర్లు ఎన్యూమరేటర్లకు పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో టామ్‌టామ్, శానిటేషన్ వాహనాల ద్వారా జనగణనపై విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్లకు ఆదేశించారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు తగిన జాగ్రత్తలు పాటిస్తూ ఉదయం లేదా సాయంత్రం వేళల్లో వివరాల సేకరణ చేపట్టాలని సూచించారు. జనగణనలో భాగంగా ప్రజలు ఎన్యూమరేటర్లకు సరైన సమాచారాన్ని అందించి, దేశ అభివృద్ధికి అవసరమైన గణాంకాల సేకరణలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కోరారు.



## వరి ధాన్యం నిల్వ ప్రక్రియ సక్రమంగా చేపట్టాలి : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల జిల్లా, మే 15:(వుదయం ప్రతినిధి)**



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు త్వరితగతిన తరలించాలని, ధాన్యం దెబ్బతినకుండా నిల్వ ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం గోదామును దండేపల్లి మండల తహసిల్దార్ రోహిత్ దేశ్ పాండే, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్ లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని, కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని, సంబంధిత రైస్ మిల్లర్లు, అధికారులు తరలించిన ధాన్యాన్ని త్వరగా దిగుమతి అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఒకరోజులో కనీసం 10 నుంచి 15 లారీల ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలని సూచించారు. ధాన్యం తరలింపుకు అవసరమైన లారీలను సమకూర్చడం జరుగుతుందని, రైస్ మిల్లుల యజమానులు ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతంగా చేపట్టాలని తెలిపారు. అనంతరం జన్నారం మండలం మొర్రిగూడ, జన్నారం లలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం గోదామును మండల తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో కలిసి సందర్శించి గోదాము నిర్వాహకులు, అధికారులకు పలు సూచనలు చేశారు. జన్నారం మండలం పొనకల్ గ్రామంలో గల సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రస్తుతం వేసవి సెలవులు అయినందున వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పనులు పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. తదనంతరం లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట గ్రామంలో గల ధాన్యం గోదామును లక్షెట్టిపేట మండల తహసిల్దార్ దిలీప్ కుమార్ తో కలిసి సందర్శించారు. ధాన్యం దిగుమతి వేగవంతం చేయాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలని తెలిపారు

## ధాన్యం సేకరణలో అగ్రస్థానంలో నిజామాబాద్ జిల్లా : కలెక్టర్ ఇలా త్రిపాఠి

**రికార్డు స్థాయిలో 5.68 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ**
**61,442 మంది రైతులకు రూ. 1162.18 కోట్ల బిల్లుల చెల్లింపులు**

**నిజామాబాద్, మే 15 (వుదయం ప్రతినిధి) :**

యాసంగి2026సీజన్ కు సంబంధించి వరి ధాన్యం సేకరణలో నిజామాబాద్ జిల్లా రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 5.68 లక్షల మెట్రిక్ టన్నుల పైచిలుకు వరి ధాన్యం సేకరణ పూర్తి చేశామని వివరించారు. కేవలం ఐదు శాతం మేరకు మిగిలి ఉన్న మరో 32,797 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సైతం వేగవంతంగా వారం రోజుల్లోపు కొనుగోళ్ళు పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో ఎక్కడ కూడా లారీలు, హమాలీల కొరత తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని, రైస్ మిల్లుల వద్ద ధాన్యం అన్ లోడింగ్ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ జరుపుతున్నామని తెలిపారు.

ఈ సీజన్ లో 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం కాగా, 95 శాతం ధాన్యం సేకరణ పూర్తి చేశామని తెలిపారు. సేకరించిన ధాన్యం విలువ రూ. 1358.20 కోట్లు కాగా, అందులో 61,442 మంది రైతులకు వారి ఖాతాలలో రూ. 1162.18 కోట్ల బిల్లుల చెల్లింపులు పూర్తయ్యాయని కలెక్టర్ వివరించారు. ట్యాబ్ ఎంట్రీలలో నిజామాబాద్ జిల్లా రాష్ట్రంలోనే ఐదవ స్థానంలో ఉందని, కేవలం మరో 9శాతం ట్యాబ్ ఎంట్రీలు పూర్తికావాల్సి ఉందన్నారు. రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా వేగవంతంగా రైస్ మిల్లులకు చేరవేసే విషయంలోనూ నిజామాబాద్ జిల్లా అగ్రభాగాన ఉందని, మిల్లర్ల నుండి 96శాతం మేర ఎక్ నాలెడ్జ్ మెంట్ పూర్తయ్యిందని వివరించారు. ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని అన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాలలో సరిపడా గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని, ధాన్యం లోడింగ్, అన్ లోడింగ్ కోసం సరిపడా హమాలీలు, వెంటదివెంట ధాన్యం రవాణా కోసం తగిన సంఖ్యలో లారీలను సమకూర్చడం జరిగిందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.



## ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, కళ్యాణ లక్ష్మి మరియు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు

**ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి )**



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి*: మండలంలోని బాలాజీ అనుకోడా రైతు వేదికలో ఈరోజు 43 లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను, నలుగురికి కల్యాణ లక్ష్మి చెక్కులు మరియు ఆరుగురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలోపు ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారులందరూ బేస్మెంట్ పూర్తి చేసుకోవాలని, లేని పక్షంలో వారి మంజూరు పత్రాలను రద్దు చేసి వేరే వారికి ఇల్లు కేటాయిస్తామని తెలిపారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ పథకం పూర్తిస్థాయిలో అమలు కావాలంటే ప్రజలు మరియు లబ్ధిదారులు సహకరించాలని కోరారు. చింతలమానేపల్లి మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేశామని, త్వరలో పనులు చేపడతామని తెలిపారు. చింతలమానేపల్లి మండల కేంద్రంలో 33/11 కెవి సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం కూడా ప్రతిపాదన పెట్టామని దీనితో మండలంలో పూర్తిస్థాయిలో లోవోల్టేజ్ సమస్య తీరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సుధాకర్ రెడ్డి, ఎమ్మార్వో ప్రకాష్, మాజీ జడ్పీటీసీ ఎల్ముల మల్లయ్య, సర్పంచులు బాలు, అంకులు, కుమ్మరి శ్రీధర్, తిరుపతి, అశోక్, ఉపసర్పంచులు డబ్బులు మురళీ, జైరాం, తిరుపతి, మాజీ ఎంపీటీసీ తిరుపతి, బీజేపీ పార్టీ నాయకులు సత్పుతే తుకారాం, డబ్బులు రావు, ధనూరి సాయి, నవీన్, శంకర్ పురుషోత్తం, పోషన్న కొంపరి బాలాజీ, హరికృష్ణ, తిరుపతి కొంపరి సాయి తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో పుస్తక ప్రదర్శన



**కాగజ్ నగర్ ( వుదయం ప్రతినిధి ):**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా కళాశాలలో 5వ రోజు డిపార్ట్మెంట్ ఆఫ్ లైబ్రరీ లో గ్రంథాలయ అధ్యాపకుడు తూడూరు దత్తాత్రేయ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ రకాలైన పోటీ పరీక్షలు అనగా బ్యాంకింగ్, రైల్వే మరియు టీఎస్పీఎస్సీ సాహిత్యం మరియు అన్ని సబ్జెక్ట్స్ యొక్క పుస్తకాలను చదువరులకు ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ Ms శ్రీదేవి గారు మాట్లాడుతూ ఇలాంటి పుస్తక ప్రదర్శన వలన విద్యార్థులు వివిధ రకాల పుస్తకాల గురించి తెలుసుకోవడమే కాకుండా వాటి వలన అనేక ప్రయోజనాలను పొందగలుగుతారని తెలిపారు. అంతే కాకుండా ఈ కార్యక్రమంలో పత్రికా విలేకరులు కూడా పాలుపంచుకోవడం జరిగింది. మరియు కళాశాలలోని వివిధ విభాగాలు అనగా హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ఇంగ్లీష్, తెలుగు, బోటనీ, ఫిజిక్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీ, జోవాలజీ మరియు హిందీ విభాగాల ఆధ్వర్యంలో కూడా ఆయా విభాగాల ఫ్యాకల్టీ మెంబర్లు కూడా ఈ పుస్తక ప్రదర్శన ను నిర్వహించడం జరిగింది .ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా లక్ష్మీ నరసింహం , కళాశాల కోఆర్డినేటర్ శ్రీ దుర్గం జనార్ధన్ మరియు పత్రికా విలేకరులు కె. శ్రీకాంత్, బి.చిరంజీవి మరియు అబ్దుల్ సమీర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపల్ మరియు సిబ్బంది పత్రికా విలేకరులను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల టీచింగ్ స్టాఫ్ మరియు నాన్ టీచింగ్ స్టాఫ్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.షన్న కొంపరి బాలాజీ, హరికృష్ణ, తిరుపతి కొంపరి సాయి తదితరులు పాల్గొన్నారు.

## మక్కల కొనుగోళ్లను వేగవంతంగా నిర్వహించాలని, కొనుగోలు చేసిన మక్కల బస్తాలను వెంటనే గోదాంలకు తరలించాలి: కలెక్టర్ చిత్రమిశ్రా

**కరీంనగర్ మే 15 (వుదయం ప్రతినిధి):**



జమ్మికుంట మార్కెట్ యార్డులోని మక్కల కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి కొనుగోలు ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని ఆరా తీశారు. అనంతరం రోజుకు ఎన్ని క్వింటాళ్ల మక్కలు కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు ప్రక్రియలో జాప్యం చేయవద్దని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల కష్టం పంట రూపంలో వస్తుందని, అందువల్ల కొనుగోళ్లలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని అధికారులకు సూచించారు. లోడ్ చేసిన బస్తాలను వెంటనే గోదాంలకు తరలించాలని, గోదాంలో నిల్వ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మార్కెట్ యార్డు పక్కన ఉన్న గోదాంను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గోదాంలో స్టోర్ చేస్తున్న మక్కల బస్తాల నిర్వహణను పర్యవేక్షించి అధికారులకు తగిన సూచనలు చేశారు. రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియను సమన్వయం తో నిర్వహించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ప్రతి బస్తాను సురక్షితంగా గోదాంలో భద్రపరచాలని, ఎప్పటికప్పుడు లిఫ్టింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న, హుజురాబాద్ ఆర్డీవో కే రమేష్ బాబు, జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ మహమ్మద్ షహబుద్దీన్ తహసిల్దార్ వెంకట రెడ్డి తో పాటు పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు తప్పవు | జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

- పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా
- బక్రీద్ నేపథ్యంలో జిల్లా సరిహద్దుల్లో ముమ్మర తనిఖీలు





**ధర్మపురి మే15 (వుదయం ప్రతినిధి):**

రాబోయే బక్రీద్ పండుగ నేపథ్యం లో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు, పశువుల అక్రమ రవాణా,గోవధ నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.జిల్లా సరిహద్దుల్లోని రాయపట్నం, రాజారాం పల్లె, చిల్వకోడూర్ చెక్‌పోస్టులను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. జిల్లాలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని,ముఖ్యంగా పశువుల రవాణా వాహనాల పత్రాలను పరిశీలించి రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.రాత్రి వేళల్లో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. అక్రమ రవాణా నెపంతో ఎవరైనా వ్యక్తులు లేదా సంఘాలు బృందాలుగా ఏర్పడి చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఊపేక్షించేది లేదని ఎస్పీ హెచ్చరించారు.చట్టాన్ని అమలు చేసే బాధ్యత పోలీసుల దేనని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రజలు ఎలాంటి అనుమానాస్పద సమాచారమున్నా డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు తెలపాల ని కోరారు. ఈ తనిఖీల్లో ఎస్పీ వెంట అదనపు ఎస్పీ చేతన్ నితిన్,డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, సీఐ రాం నరసింహ రెడ్డి, ఎస్ఐలు మహేష్,ఉదయ్ కుమార్, కృష్ణ సాగర్,సిబ్బంది,వెటర్నరీ అధికారులు పాల్గొన్నారు.

## బాధితుల సమస్యలను వేగంగా పరిష్కరించాలి

**ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెంపొందించాలి: పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి**

**పెద్దపల్లి, మే 15: (వుదయం కరస్పాండెంట్ న్యూస్)**



పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించే విధంగా సేవలు అందించాలని పెద్దపల్లి జోన్ డీసీపీ బి. రామ్‌రెడ్డి పోలీసు సిబ్బందిని ఆదేశించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో వార్షిక తనిఖీల్లో భాగంగా డీసీపీ శుక్రవారం అంతర్గాం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పలు అంశాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న డీసీపీకి గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, రామగుండం సీఐ కృష్ణకుమార్, అంతర్గాం ఎస్ఐ వెంకటస్వామి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిశుభ్రత, పరిసరాల నిర్వహణ, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధి నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. అలాగే పోలీస్ సిబ్బందితో పరేడ్ నిర్వహించి వారి పనితీరు, విధుల నిర్వహణపై సమీక్ష చేపట్టారు. స్టేషన్ పరిధిలో ఉన్న ప్రధాన సమస్యలు, నమోదైన కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల పరిష్కార స్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో సమావేశమై వారు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా తెలుసుకొని తగిన సూచనలు చేశారు.ఈ సందర్భంగా డీసీపీ బి. రామ్‌రెడ్డి మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని సూచించారు. బాధితుల సమస్యలను వేగంగా, పారదర్శకంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం పెంపొందించడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ప్రతి పోలీస్ అధికారి ప్రజలకు అందుబాటులో ఉండి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.

## ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు భేష్

**రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి**




**నిజామాబాద్, మే 15 (వుదయం) :**

నిజామాబాద్ జిల్లాలో వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు సజావుగా జరుగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పర్యవేక్షణలో పౌర సరఫరాలు, రెవెన్యూ, రవాణా, సహకార తదితర శాఖలన్నీ ధాన్యం, మొక్కజొన్న సేకరణ విషయంలో సమర్థవంతంగా పని చేస్తున్నాయని అన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి శుక్రవారం సాయంత్రం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి కొనుగోలు కేంద్రాల నిర్వహణ తీరుతెన్నులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంతకుముందు వేల్పూర్, చెంగల్, ఆలూరు, మిర్జాపల్లి తదితర గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు.

## పకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి




**జిల్లా కలెక్టర్ కె .హరిత**

**ఆసిఫాబాద్( వుదయం ప్రతినిధి)**

వచ్చే వర్ష కాలంలో వరదలు విపత్తుల వల్లా ఆస్తులు ప్రాణ నష్టము జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె హరిత అన్నారు శుక్రవారం సమీకృత కల్లెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాతీయా విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు న్యూ ఢిల్లీ నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ఎం డెవిడ్ కాగజ్ నగర్ డివిజన్ అటవీ అధికారి అప్పయ్యతో కలిసి కలెక్టర్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరదలు అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అస్తి నష్టం ప్రాణ నష్టం జరగకుండా అధికారులు అప్రమతంగా వుండాలన్నారు. భారి అతి భారి వర్షాలు కురిసే సమయంలో వరదలు వచ్చి జన వననం స్తంభించి పోతుందని ఆ సమయంలో ప్రజలను రక్షించి వారికి పునర వాసం ఏర్పాటు చేపట్టాలన్నారు. జిల్లాలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తక్షణమే స్పందించి నివారణ చర్యలు తీసుకోవాలని అన్నారు. వరదలు వచ్చే సమయంలో ప్రజను అప్రమత్తం చేయాలన్నారు. జిల్లాలో విపత్తులు సంభవించినప్పుడు ప్రజలను రక్షించడానికి రేస్కు బృందాలు సిద్ధంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరవాస కేంద్రాలకు తరలించి వారికి ఆహారం త్రాగు నీరు వైద్య చికిత్సలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్, అగ్నిమాపక, నీటిపారుదల శాఖ, అధికారులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు



## తుమ్మూరులో నీటి కొరత

**నీటి కొరత కోసం, ఎంపీ సురేష్ షెట్కర్, కలిసిన, తుమ్మూరు, గ్రామ సర్పంచ్, సంజీవులు**

**వుదయం, మనూరు**

మండల్ ఈరోజు, నారాయణఖేడ్, లో తుమ్మనూరు, సంజీవులు, సర్పంచ్ ఈరోజు,జహీరాబాద్ ఎంపీ, సురేష్ శెట్టి, గారిని మర్యాదపూర్వకంగా కలిసి వారి, యొక్క గ్రామం యందు నీటి ఎద్దడి చాలా, ఉందని ఎంపీ గారితో,వి న్నవించడం,మరియు మా ఊరికి బోర్, కావాలని తెలియజేయడంతో,మాకు వెంటనే స్పందించి,బోరు వేయిస్తానని హామీ ఇచ్చినారు,

ఇటువంటి,పనికిమాలిన ప్రగాలు వాళ్ళు,యుద్ధమనే గ్రూపులో పెట్టిన,వారికి దయచేసి ఇలా చేయకూడదు,అని దానిని విరమించుకోవాలని,చెప్తూ కోరుచున్నాము,మరియు అదేవిధంగా, మా యొక్క ఎంపి గారికి మా గ్రామం తరపున

## వరి కొనుగోలు సెంటర్లలో రైతుల సమస్యలను పరిష్కరించండి



**కలెక్టరేట్ ఏఓకి బి. కె. ఎస్ వినతి**
**నారాయణపేట మే15**
**(వుదయం ప్రతినిధి)**

ప్రభుత్వం ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాలలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఏఓకి వినతి పత్రాన్ని అందజేశారు.నారాయణపేట జిల్లాలో కొనుగోలు సెంటర్లలో హమాలి చార్జీలు ఒక్కో సెంటర్లో ఒక్కో విధంగా ఉన్నాయని వీటిని వెంటనే పరిశీలించాలని వారు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. అంతేకాక కోస్గిలో బస్తాకి 20 రూపాయలు హమాలి తీసుకుంటున్నారని కిలో 50 గ్రాములు తరుగు రైతుల దగ్గర తీసుకుంటూ రైతులను మోసం చేస్తున్నారని వారు ఏఓకి వివరించారు. సెంటర్లో తూకాలు అయిన తర్వాత రైతులకు బిల్ ఇవ్వడం లేదని బిల్ చేయడం లో ఆలస్యం చేస్తున్నారని విధంగా ఉండాలని, 650 గ్రాములు మాత్రమే తరుగు తీయాలని రైతంగ పరంగా భారతీయ కిసాన్ సంఘం కలెక్టర్ ఏవో ఏవో కు వివరించారు.విషయాన్ని పౌర సరఫరాల శాఖ డిఎస్ఓ దృష్టికి తీసుకుపోగా డీఎస్ఓ స్పందించి సెంటర్ వాళ్లకు రైతులను ఇబ్బంది కాకుండా చూడాలని సూచించారు.కార్యక్రమంలో వెంకోబా బికేస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకోబా, జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి, జిల్లా సహా కార్యదర్శులు ప్రభు మిస్కిన్, మహిపాల్ రెడ్డి, జిల్లా కోశాధికారి రంగారెడ్డి,పట్టణ అధ్యక్షులు ఆకుల వెంకటప్ప, నారాయణపేట మండల ఉపాధ్యక్షులు ఈరప్ప, పగిడిమారి గ్రామ అధ్యక్షులు నాగార్జున, ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, కోస్గి మండల అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంత్లీ క్రైమ్ రివ్యు మీటింగ్ లో అధికారులకు పలు సూచనలు చేసిన



**జిల్లా ఎస్పీ. టి శ్రీనివాసరావు**
**గద్వాల మే 15 (వుదయం ప్రతినిధి)**

నేరాల నియంత్రణలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటూ, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు జరిపి బాధితులకు పూర్తి న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులతో మంత్లీ క్రైమ్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. రానున్న బక్రీద్ పండగ సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిడ్డమైన చర్యలు తీసుకోవాలని చెక్పోస్టులలో 24 X 7 పూర్తి నిఘా పెట్టీ ఇతర రాష్ట్రాల నుంచి వడ్లు, మొక్కజొన్నలు రాకుండా అలాగే పశువుల అక్రమ రవాణా జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని అన్ని సర్కిల్స్, పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులు, దర్యాప్తు నాణ్యత, నేరాల నియంత్రణ అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించి, ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఉండేలా చూసి నేరస్తులకు తప్పనిసరిగా శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయడం పోలీసుల ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. కేసుల విచారణలో జాప్యం లేదా నిర్లక్ష్యం అసలు సహించబోమని హెచ్చరిస్తూ, బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించేందుకు పెట్రోలింగ్‌ను మరింత బలోపేతం చేసి, బ్లూ కోల్ట్స్ వాహనాల ద్వారా ఎల్లప్పుడూ విజిబుల్ పోలీసింగ్ ఉండేలా చూడాలని ఆదేశించారు.అలాగే రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, ముఖ్యంగా సైబర్ నేరాల నివారణకు గ్రామ స్థాయి వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అక్రమ గంజాయి రవాణా, మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల వ్యవస్థను విస్తరించి అవి నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలన్నారు. దొంగతనాల కేసుల్లో ఆధునిక సాంకేతికతను వినియోగించి లాంగ్ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి, దొంగిలించిన సొత్తును బాధితులకు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌స్‌ను గుర్తించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు. మండల కేంద్రాల్లో ట్రాఫిక్ నియంత్రణను మెరుగుపరచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని, మద్యం సేవించి వాహనం నడిపే వారిపై కఠినంగా కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామ స్థాయిలో పోలీసింగ్‌ను బలోపేతం చేస్తూ విలేజ్ పోలీస్ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలతో మమేకమై సామాజిక సమస్యలను తెలుసుకోవాలని, ముందస్తు సమాచారాన్ని సేకరించాలని సూచించారు. ఎస్‌హెచ్‌ఓలు తమ పరిధిలోని ప్రతి గ్రామాన్ని సందర్శించి స్థానిక సమస్యలను గుర్తించాలని, గ్రామ సభల తీర్మానాల అమలును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు.మే 27న బక్రీద్ పండగ జరగనున్న నేపథ్యంలో అన్ని మండలాల ఎస్సైలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జాగ్రత్తలు తీసుకుంటూ, మండలం లెవెల్లో సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అలాగే చెక్ పోస్టులలో పశువుల అక్రమ రవాణాకు చెక్ పెట్టాలని, అంటే కాకుండా వరి, మొక్కజొన్న ధాన్యాలు ఇతర రాష్ట్రాల నుంచి మన జిల్లాలోకి రవాణా జరగకుండా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ కె. శంకర్, డీఎస్పీ గద్వాల వై. మొగిలయ్య, ఏ.ఆర్. డీఎస్పీ టి నరేందర్ రావు, ఆర్ఐ లు, అన్ని సర్కిల్ ఇన్స్పెక్టర్లు, ట్రాఫిక్ వింగ్ ఆర్.ఐ., జిల్లాలోని అన్ని పి.ఎస్.ల ఎస్సైలు, ఇతర విభాగాలలో పనిచేసే ఎస్సైలు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా గ్రంథాలయం అభివృద్ధికి కృషి**
**లైబ్రరీ డే లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**
**గద్వాల మే 15**
**(వుదయం ప్రతినిధి)**



గ్రంథాలయంలోని పత్రికలు, పుస్తకాలను పాఠకులు, విద్యార్థులు, నిరుద్యోగులు చదివి సద్వినియోగం చేసుకోవాలని, గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో శుక్రవారం లైబ్రరీ డే సందర్భంగా గద్వాలలోని జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా సరస్వతి దేవి చిత్రపటానికి పూజలు నిర్వహించి, రిబ్బన్ కట్ చేసి పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. లైబ్రరీలో వివిధ విభాగాలను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు, నిరుద్యోగులకు అవసరమైన అప్డేట్ పుస్తకాలను తెప్పిస్తామన్నారు. విద్యార్థులు ఒక కమిటీగా ఏర్పడి తమకు కావాల్సిన పుస్తకాల లిస్ట్ రాసి ఇవ్వాలన్నారు. గ్రూప్స్, బ్యాంకింగ్, టీచర్, తదితర ఉద్యోగాలకు సాధన చేస్తున్న నిరుద్యోగులు పక్కా ప్రణాళికతో లక్ష్యాలకు అనుగుణంగా చదివితే పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారన్నారు. ఒకే నోటిఫికేషన్ కోసం కాకుండా నిరుద్యోగులు తాము చదివిన కోర్సులకు రిలేటెడ్ గా ఉండే ఇతర ఉద్యోగాల కోసం కూడా సాధన చేస్తే ప్రయోజనం ఉంటుందనీ సూచించారు. గ్రంథాలయ పక్కా భవన నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రస్తుతం నిర్వహిస్తున్న గ్రంథాలయాన్ని సమీపంలో ఉన్న పాత కోర్టు భవనంలోకి మార్చడానికి సంబంధిత అధికారులతో మాట్లాడతానన్నారు. ప్రస్తుతం ఉన్న గ్రంథాలయంను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నూతన భవన నిర్మాణానికి ప్రస్తుతం ఉన్న నిధులేకాక ఎంపీ నిధులతో పాటు కలెక్టర్ నిధులను కూడా మంజూరు చేస్తామన్నారు. టాయిలెట్స్, ఫ్యాన్లు, లైట్లు, కంప్యూటర్స్ అప్డేట్, ఇంటర్నెట్, ఇన్వర్టర్, తదితర సమస్యలను పలువురు నిరుద్యోగులు తన దృష్టికి తీసుకొచ్చినందున పరిష్కరిస్తామన్నారు. మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉండడంతో అందుబాటులో ఉన్న నిధులతో త్వరలోనే నిర్మిస్తామన్నారు. గ్రంథాలయంకు వచ్చే పాఠకులు తప్పనిసరిగా రిజిస్టర్లో సంతకాలు పెట్టాలని, లైబ్రరీ మెంబర్షిప్ కార్డును తీసుకొని సద్వియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రంథాలయంలోని వివిధ సమస్యలపై కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం కలెక్టర్ గ్రంథాలయ పరిసరాలను పరిశీలించి మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు స్కావెంజర్ ను నియమిస్తామన్నారు. సమీపంలోని నీటిపారుదల శాఖ కార్యాలయాన్ని సందర్శించి అక్కడి ఉద్యోగులతో మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, డీఈవో విజయలక్ష్మి, లైబ్రేరియన్ రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## పుస్తక పఠనం జ్ఞాన వికాసానికి పునాది

**డీఈవో వెంకటేశ్వర్లు**
**యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి:**
**గ్రంథాలయ చైర్మన్ అంజయ్య**
**విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంచేందుకే లైబ్రరీ డే**
**సంగారెడ్డి గ్రంథాలయంలో ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన కార్యక్రమం**
**సంగారెడ్డి, మే 15:వుదయం**



విద్యా వారోత్సవాల సందర్భంగా సంగారెడ్డి జిల్లా గ్రంథాలయంలో శుక్రవారం ఘనంగా "లైబ్రరీ డే" పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల పుస్తకాల ప్రదర్శనను ఆయన పరిశీలించి అభినందించారు. విద్యార్థులు, యువత, పాఠకులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డీఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పుస్తకాలు మనిషికి మంచి మిత్రులని, గ్రంథాలయాలు జ్ఞానానికి నిలయాలుగా నిలుస్తాయని అన్నారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా సాహిత్యం, చరిత్ర, విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పుస్తకాలను కూడా చదవాలని సూచించారు. డిజిటల్ యుగంలోనూ పుస్తక పఠనానికి ఉన్న ప్రాధాన్యత ఏమాత్రం తగ్గలేదన్నారు.జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య మాట్లాడుతూ..

యువతలో చదువుపై ఆసక్తి పెంచేందుకు గ్రంథాలయ శాఖ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నదన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి వసుంధర, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

## చెంచుల జీవనోపాధి అభివృద్ధికి టీజీఐఎల్పీ కీలకం

**జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్,**
**నాగర్ కర్నూల్ మే (వుదయం ప్రతినిధి)**



జిల్లాలోని ఆదివాసి గిరిజన అత్యంత పేద, వెనుకబడిన వర్గాల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తెలంగాణ ఇన్‌క్లూజివ్ లైవ్లీహుడ్స్ ప్రోగ్రాం (టీజీఐఎల్పీ)ను సమర్థవంతంగా అమలు చేసి చెంచు గిరిజన కుటుంబాలను ఆర్థికంగా స్వావలంబన దిశగా తీసుకెళ్లాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం నాడు జిల్లాలోని అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని మల్లాపూర్ పెంట గ్రామాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి, అత్యంత పేదరిక పరిస్థితుల్లో జీవిస్తున్నట్లు గుర్తించిన 34 చెంచు కుటుంబాలతో సమావేశమై వారి సమస్యలను నేరుగా కలెక్టర్ తెలుసుకున్నారు. కుటుంబాల జీవన విధానం, ఉపాధి అవకాశాలు, ఆరోగ్య పరిస్థితులు, పిల్లల విద్య, తాగునీటి సౌకర్యాలు వంటి అంశాలపై సమగ్రంగా ఆరా తీశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...., చెంచు గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తరతరాలుగా అడవులపై ఆధారపడి జీవిస్తున్న చెంచు కుటుంబాలను ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధిలోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. టీజీఐఎల్పీ కార్యక్రమం ద్వారా ఎంపిక చేసిన కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాలు కల్పించి, వారిని స్వయం ఆదాయం పొందే స్థాయికి చేర్చాలని అత్యంత పేదరికంలో ఉన్న కుటుంబాలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగానే కాకుండా, ఆర్థికంగా నిలదొక్కుకునే కుటుంబాలుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి కుటుంబానికి వారి సామర్థ్యాలు, ఆసక్తులను ఆధారంగా చేసుకుని ప్రత్యేక జీవనోపాధి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. పశుపోషణ, కోళ్ల పెంపకం, చిన్నచిన్న వ్యాపారాలు, అటవీ ఉత్పత్తుల ఆధారిత ఉపాధి, వ్యవసాయ అనుబంధ రంగాల్లో శిక్షణలు ఇచ్చి ఆదాయ వనరులు పెంచాలని అధికారులకు ఆదేశించారు బ్యాంకు లింకేజీలు కల్పించడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించాలని, గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించి ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. , విద్యుత్, రహదారులు, ఆరోగ్య సేవలు, దృష్టి సారించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పిల్లలు చదువుకు దూరం కాకుండా ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో ప్రవేశాలు కల్పించాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులైన చెంచు కుటుంబాలకు చేరేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని, పింఛన్లు, రేషన్, ఆరోగ్య భద్రత పథకాలు, గృహ నిర్మాణ పథకాలు వంటి ప్రయోజనాలు అందకుండా ఎవరూ మిగలకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు.

చెంచు కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు మానవీయ దృక్పథంతో పరిష్కరించాలని, గ్రామ స్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యం కేవలం సాయం అందించడం మాత్రమే కాకుండా, ప్రతి కుటుంబం గౌరవప్రదమైన జీవితం గడపగలిగే స్థాయికి తీసుకెళ్లడమేనని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పిడి చిన్న ఓబులేష్, అచ్చంపేట ఆర్డీవో యాదగిరి గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత విద్యపై దృష్టి పెట్టి భవిష్యత్తును నిర్మించుకోవాలి

**జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా**
**మహబూబ్ నగర్ మే15**
**(వుదయం ప్రతినిధి)**




ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా, మే 11 నుండి 17 వరకు విద్యా శాఖ ద్వారా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల సందర్భంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, మేయర్ గుమ్మాల మమతతో కలిసి ఎస్.ఎస్.సి లో ముగ్గురు ఇంటర్ లో ముగ్గురు, క్రీడలలో ముగ్గురు ఉత్తమ ఫలితాలు సాధించిన 9 మంది జిల్లా టాపర్లకు 10 వేల రూపాయల నగదు, మెడల్, సర్టిఫికెట్ ప్రధానం చేసి సన్మానించారు. జిల్లా లో ఎస్.ఎస్.సి ఫలితాల్లో 100 శాతం పాస్ సాధించిన 57 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శాలువాతో సన్మానించి, ఆయా పాఠశాలలో యస్.యస్.సి లో టాప్ మార్కులు సాధించిన విద్యార్థులకు మెడల్, సర్టిఫికెట్ ప్రధానం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాలోనే టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల సమష్టి కృషితో జిల్లాలో ఎస్ఎస్‌సీ ఫలితాల్లో 92.70 శాతం ఉత్తీర్ణత సాధించ గలిగామని అన్నారు. జిల్లాలో ఉన్న 180 ప్రభుత్వ విద్యాలయాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, నూటికి నూరు శాతం ఫలితాలు నమోదు చేసిన 57 ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, సబ్జెక్టు ఉపాధ్యాయులను ప్రోత్సహించేందుకే ఈ సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎస్ఎస్‌సీ తర్వాత విద్యార్థులు ఉన్నత చదువులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా బాలికలు చదువు మధ్యలో ఆపకుండా ముందుకు సాగాలని సూచించారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, ట్రిపుల్ ఐటీ వంటి విద్యా అవకాశాలపై విద్యాశాఖ ద్వారా మండలాల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులు ఉన్నత చదువుల్లోనూ రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మేయర్ గుమ్మాల మమత మాట్లాడుతూ విద్యార్థులు ఎస్. ఎస్.సి ఫలితాల్లో మంచి ఉత్తీర్ణత సాధించడం ఎంతో సంతోషమని అన్నారు. విద్యార్థి జీవితంలో ఎస్.ఎస్.సి పరీక్షలు ముఖ్యమైన తొలి మెట్టని అన్నారు. ప్రతి విద్యార్థి ఎస్.ఎస్.సి తరువాత తప్పకుండా ఉన్నత చదువులు చదవాలని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి విద్యార్థుల చదువును ప్రోత్సహించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో కంటే ప్రభుత్వ పాఠశాలలో మంచి విద్యాబోధన ఉన్నదని, విద్యార్థులు దానిని సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని అన్నారు.జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యాశాఖ విద్య విజయోత్సవాలను నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం జిల్లాలో ఉన్న 180 పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాల టాపర్లకు సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రధానం చేసి సన్మానించుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ ద్వారా జిల్లాలో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు చేపడుతున్న అనేక కార్యక్రమాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి రాజశేఖర్ రెడ్డి, సి.యం.ఓ సుధాకర్ రెడ్డి, ఎ.ఎం.ఓ డి . శ్రీనివాస్, జి.సి.డి.ఓ ఆశ్ర ఖాద్రి,ఏడీ అనురాధ , వెంకట్రాములు, అన్ని మండలాల ఎంఈఓ లు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ సీట్ల కేటాయింపు

**లక్కీ డ్రా ద్వారా ఐదో తరగతి విద్యార్థుల ఎంపిక: జిల్లా కలెక్టర్ కె. హైమావతి**
**సిద్దిపేట, మే 15 ( వుదయం ప్రతినిధి)**

సిద్దిపేట జిల్లాలోని గిరిజన విద్యార్థులకు 'బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం' కింద సీట్ల కేటాయింపు ప్రక్రియ శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. స్థానిక సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కె. హైమావతి నేతృత్వంలో పారదర్శకంగా లక్కీ డ్రా నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేశారు. మొత్తం 5 సీట్లు అందుబాటులో ఉండగా, కేవలం 3 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. దీంతో లక్కీ డ్రా అవసరం లేకుండానే, ఆ ముగ్గురు విద్యార్థుల సర్టిఫికేట్లను తెలిపారు. మొత్తం 3 సీట్లకు గానూ 5 దరఖాస్తులు వచ్చాయి. ముగ్గురిని (ఒక బాలిక, ఇద్దరు బాలురు) ఎంపిక చేశారు. మరో విద్యార్థిని రిజర్వ్ లిస్ట్ లో ఉంచారు.శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో సీట్లు.. ఈ పథకం కింద ఎంపికైన ఎస్టీ విద్యార్థులకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ పూర్తి చేసిన అనంతరం... సిద్దిపేట అర్బన్ మండలం, తడకపల్లి గ్రామంలోని ప్రతిష్ఠాత్మక శ్రీ విద్యారణ్య




కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ, గిరిజన విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న ఇలాంటి సువర్ణావకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఎంపికైన విద్యార్థులకు ఆమె ప్రత్యేకంగా శుభాకాంక్షలు (ఆల్ ద బెస్ట్) తెలిపారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఏవో రాజ్‌కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పబ్లిక్ స్కూల్స్ లో దరఖాస్తులకు ఆహ్వానం

**మహబూబ్ నగర్ మే15**
**(వుదయం ప్రతినిధి)**

202627 విద్యా సంవత్సరానికి హైదరాబాద్ పబ్లిక్ స్కూల్స్ బేగంపేట్, రామంతపూర్ లలో 1వ తరగతి యందు ప్రవేశానికి అర్హులైన (01) సీటు కొరకు యస్. సి కులాలకు మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన బాల బాలికల నుండి దరఖాస్తులు కోరు తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిని డి .సునీత ఒక ప్రకటనలో తెలిపారు.తేది 01.06.2019 నుండి 31.05.2020 ల మధ్య పుట్టిన వారయి, తల్లిదండ్రుల వార్షిక ఆదాయము గ్రామీణ ప్రాంతాలవారికి రూ 1,50,000, పట్టణ ప్రాంతాల వారికీ రూ. 2,00,000 లకు మించని వారయి ఉండాలని ఆమె తెలిపారు.దరఖాస్తులు మే 29 వ తేదీ వరకు కార్యాలయ పనిదినములలో ఉప సంచాలకులు, షెడ్యుల్డు కులాల అభివృద్ధి శాఖ, రూమ్ నెంబర్ 105, జిల్లా కలెక్టరేట్, మహబూబ్ నగర్ లో సమర్పించాలన్నారు. దరఖాస్తు తో పాటుగా మీసేవ నుండి పొందిన కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఆదార్ కార్డు, మున్సిపాలిటీ లేదా రెవిన్యూ అధారిటి జారీచేసిన పుట్టిన తేది ధ్రువపత్రాల కాపీలు గెజిటేడు అధికారి అటేస్టెషను చేసి 2 పాస్ పోర్ట్ సైజు ఫోటోలు జతపరచి సమర్పించాలన్నారు. ఇతర వివరములకొరకు షెడ్యుల్డు కులాల అభివృద్ధి శాఖ, రూమ్ నెంబర్ 105, జిల్లా కలెక్టరేట్ యందు సంప్రదించగలరని ఆమె ఈ ప్రకటన లో పేర్కొన్నారు.

## సొసైటీ నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలి



**విలేకరుల సమావేశంలో మండిపడ్డ మండల కాంగ్రెస్ నాయకులు..**
**మెదక్ జిల్లా వుదయం**

ప్రతినిధి నిజాంపేట మండలం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు సజావుగా సాగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అమరాసేనారెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని కొనుగోలు కేంద్రాలను సందర్శించి సెంటర్ ల నుండి రోజుకు రెండు చొప్పున వరి ధాన్యం లారీ లోడ్లు తరలిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. రైతుల కాంటాలు అయిన రెండు మూడు రోజులలోనే వారి ఖాతాలో డబ్బులు జమ అవుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కాంటాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పనులు చూసి ఓర్వలేకనే బిఆర్ఎస్ పార్టీ నాయకులు వారి సొంత ప్రయోజనాల కోసం కొనుగోలు కేంద్రాలలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. కేంద్రాలలో రోజుకు రెండు చొప్పున లారీ లోడు రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని కాంట అయిన మూడు రోజులలోనే రైతుల ఖాతాలో డబ్బులను జమ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు,లు కొనుగోలు విషయంలో ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు.అలాగే రామాయంపేట సొసైటీ బిఆర్ఎస్ పార్టీ పాలకవర్గానికి సంబంధించి 3 కోట్ల 66 లక్షల 55,859 రూపాయల నిధులు దుర్వినియోగానికి గురయ్యాయని. దుర్వినియోగానికి పాల్పడ్డ పాలకవర్గానికి మళ్లీ బాధ్యతలు అప్పగించడం దొంగ చేతికే తాళాలు అప్పజెప్పే విధంగా డి సి ఓ వ్యవహరిస్తున్నారని నాయకులు మండిపడ్డారు. ఇకనైనా బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే ఊరుకునేది లేదని రైతులను రెచ్చగొట్టే విధంగా చూస్తే ఆ రైతులే మిమ్మల్ని కొట్టే రోజులు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీపీ దేశెట్టి సిద్ధిరాములు, మండల అధ్యక్షుడు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్,నసీరుద్దీన్, సర్పంచ్ల ఫోరంఅధ్యక్షులు భాను ప్రకాష్‌రెడ్డి, ముత్యాల మధుసూదన్ రెడ్డి, పంజా బాబు,సామల మహేష్, నాగరాజు,మధు,భాస్కర్ గౌడ్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ స్థాయిలో 'ఉపాధి' పనులు ముమ్మరం చేయాలి: ఖీమ్యా నాయక్



**వనపర్తి మే 15 (వుదయం ప్రతినిధి)**

ఉపాధి హామీ పథకంలో కార్మికుల మొబిలైజేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, గ్రామ స్థాయిలో పనులను వేగవంతంగా చేపట్టి అర్హులైన కార్మికులకు ఉపాధి కల్పించాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్ ఆదేశించారు. శుక్రవారం వీపనగండ్ల మండల పరిధిలోని కల్వరాల గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) పనుల అమలును అదనపు కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్లు (FAలు), టెక్నికల్ అసిస్టెంట్లు (TAలు), పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో కార్మికుల మొబిలైజేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, గ్రామ స్థాయిలో పనులను వేగవంతంగా చేపట్టి అర్హులైన కార్మికులకు ఉపాధి కల్పించాలని అధికారులకు సూచించారు.

అలాగే పనుల నాణ్యతను కాపాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కలకు నీరు పోసి సంరక్షించాలని సూచించారు.

డి ఆర్ డి ఓ ఉమాదేవి, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

## ఆస్తి పత్రాలు పోగొట్టుక పోయాయి

**లక్షల విలువైన ఆస్తి పత్రాల మాయం**
**బస్టాండ్‌కు వెళ్తుండగా తప్పిన పత్రాలు**
**బాధితురాలు అనిత కన్నీటి పర్యంతం**
**ఫోన్ నంబర్ 7661818404కు సమాచారం ఇవ్వాలని కోరిక**

**వికారాబాద్: మే 15**
**(వుదయం పరిగి ప్రతినిధి)**

ఆచూకీ తెలిస్తే అప్పగించి ఆదుకోండి బాధితురాలు దాసరి అనిత విజ్ఞప్తి. పరిగి: లక్షల విలువైన తన స్వంత ఇంటికి సంభందించిన ఆస్తి పత్రాలు పోగొట్టుకొని పోయాయని, ఎవరికైనా దొరికితే తిరిగి తనకు అప్పగించి ఆదుకోవాలని పరిగి పట్టణానికి చెందిన తెలిపిన వివరాల మేరకు పరిగి పట్టణ కేంద్రం లోని, సర్వే నంబర్ 291,295 లో , ప్లాట్ నంబర్ 76లో, 150 గజాల విస్తీర్ణం లో తాను కొనుగోలు చేసిన స్వంత ఇల్లు ఇంటి నెంబర్ 111/5/R 30ఉందని ఆమె తెలిపింది.గత వారం రోజుల క్రిందట తన స్వంత ఇంటికి సంభందించిన లింకు డాక్యుమెంట్లు.. డాక్యుమెంట్ నంబర్ 426/2024 ఆస్తి పత్రాలు తీసుకొని తన ఇంటి నుండి పరిగి పట్టణ కేంద్రం లోని బస్ స్టాండ్ కు ప్రయాణ మై బయలు దేరి వెళుతుండగా పోగొట్టుకొని పోయాయని ఎంత వెతికిన లింక్ డాక్యుమెంట్ ఆస్తి పత్రాలు లభ్యం కాలేదని భాదితురాలు ఆవేదన గా తెలిపింది. ఎవరికైనా తన స్వంత ఇంటికీ సంబందించిన లింక్ డాక్యుమెంట్ ఆస్తి పత్రాలు దొరికితే తన మొబైల్ నంబర్ 7661818404కు కాల్ చేసి అప్పగించి ఆదుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# ఎన్టీఆర్ లో ఘనంగా జరిగిన గ్రంధాలయ వారోత్సవాలు



మహబూబ్ నగర్ మే15 (వుదయం ప్రతినిధి)

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ఐదవరోజు కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. జ్ఞానోత్సవంలో భాగంగా పుస్తక వితరణ, పుస్తకాల ప్రదర్శన, పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం కళాశాల గ్రంథాలయంలో ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యఅతిథి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి,జిల్లా గ్రంథాలయ కార్యదర్శి మనోజ్ కుమార్ ,ప్రొఫెసర్ సలీం ఇక్బాల్ ఎస్ సి ఎ ఆర్ టి, అమీనా ముంతాజ్ జహాన్ ఇంచార్జి ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్ డాక్టర్ ఎం ప్రవీణ్ కుమార్, అస్మా బేగం గ్రంథాలయాధిపతి పాల్గొన్నారు .ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శనను మల్లు నరసింహారెడ్డి ప్రారంభించారు .ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మల్లు నరసింహారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పుస్తకాలు చదవడం వల్ల విద్యార్థులలో మనోవికాసం కలుగుతుందని లైబ్రరీలకు వెళ్లడం విద్యార్థులు అలవాటు చేసుకుంటే ఉన్నత స్థాయికి వెళ్లే అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. మనోజ్ కుమార్ జిల్లా గ్రంథాలయ కార్యదర్శి విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి పుస్తక పఠనం తోడ్పడుతుందని నిరంతర పఠనం పరిపూర్ణ మేధో వికాసం అని అన్నారు.అమీనా ముంతాజ్ జహాన్ ఇన్చార్జి ప్రిన్సిపల్ ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రభుత్వ ఆదేశానుసారము జరుగుతున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలు భాగంగా గ్రంథాలయ జ్ఞాన ఉత్సవము విద్యార్థులకు గ్రంథాలయం పట్ల అవగాహన పఠనం పట్ల ఆసక్తి కలిగిస్తుందని అన్నారు .ఈ సందర్భంగా కళాశాల తెలుగు విభాగం సంకలనం చేసిన ప్రబంధ వాంగ్మయము సాహిత్యానుశీలన అనే జాతీయ సదస్సు పూర్తి వ్యాసాల సంకలనమును జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ,కార్యదర్శి ,ఇన్చార్జి ప్రిన్సిపాల్ చేతులమీదుగా ఆవిష్కరించారు.గ్రంథాలయ జ్ఞానోత్సవం సందర్భంగా ప్రొఫెసర్ సలీం ఇక్బాల్ ఎస్సీ ప్రొఫెసర్ సలీం ఇక్బాల్ ఎస్ ప్రొఫెసర్ సలీం ఇక్బాల్ ఎస్ సి ఏ ఆర్ టి ,పద్మ అనురాధ వైస్ ప్రిన్సిపల్ ,శ్రీదేవి ఐక్యుఎసి కోఆర్డినేటర్ పుస్తకాలు గ్రంథాలయానికి డొనేట్ చేశారు .ఉత్తమపఠితలైన విద్యార్థులకు అతిథులు ఘనసన్మానం చేశారు .ఈ కార్యక్రమంలో మధుసూదన్ శర్మ, డాక్టర్ లక్ష్మీనరసింహారావు, మద్దిలేటి, డాక్టర్ ప్రకాష్, హరిబాబు కుమార్, డాక్టర్ అనిత, డాక్టర్ ఉషాలక్ష్మి , డాక్టర్ మార్కండేయ, డాక్టర్ సునీత, హేమలత తదితర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# పదిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం టెక్నో స్కూల్లో ప్రిన్సిపాల్



ఊర్కొండ న్యూస్15వుదయం ప్రతినిధి

పదిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం టెక్నో స్కూల్లో టాపర్లకు ఘనంగా సన్మానం చేశారు. వర్షిత్, అభిరామ్, సంజయ్ ఐదువందల పైగా మార్కులు సాధించిన విద్యార్థులను వాళ్ల తల్లిదండ్రుల సమక్షంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎన్ రాఘవాచారి మాట్లాడుతూ మా పాఠశాలలో విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించారు,విద్యార్థులు పట్టుదల, ఇష్టంతో చదివితే ఎంతటి విజయాన్నైనా సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమార్, మహమ్మది, రామలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు శ్రీనివాసులు, యాదయ్య, రాణి పాల్గొన్నారు.

# బ్రోకర్ ఉంటే గంటల్లో సర్టిఫికెట్.. లేకపోతే వారాల నిరీక్షణ..!



**గద్వాల ఎమ్మార్వో కార్యాలయంలో ప్రజలకు చుక్కలు చూపిస్తున్న వ్యవస్థ**

గద్వాల మే 15 (వుదయం ప్రతినిధి)

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని గద్వాల మండలం ఎమ్మార్వో కార్యాలయంలో రెసిడెన్షియల్ సర్టిఫికెట్ల జారీ వ్యవహారం ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని రేకెత్తిస్తోంది. సాధారణ ప్రజలు నేరుగా దరఖాస్తు చేసుకుంటే వారం నుంచి పది రోజుల వరకు వేచి చూడాల్సి వస్తోందని, అదే బ్రోకర్ల ద్వారా వెళితే గంటల వ్యవధి లోనే సర్టిఫికెట్లు అందుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేయించుకోవాలంటే తప్పనిసరిగా బ్రోకర్లను ఆశ్రయించాలా? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కార్యాలయానికి స్వయంగా వెళ్లి దరఖాస్తు చేసుకున్న వారికి అధికారులు సరైన స్పందన ఇవ్వడం లేదని, వివిధ కారణాలు చెబుతూ ఆలస్యం చేస్తున్నారని మండల ప్రజలు వాపోతున్నారు. మరోవైపు మధ్యవర్తుల ద్వారా వెళ్లిన దరఖాస్తులు మాత్రం వేగంగా పరిష్కారమవుతున్నా యని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ సేవల పారదర్శకతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సామాన్య ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతుండగా, బ్రోకర్ వ్యవస్థ మాత్రం యథేచ్ఛగా కొనసాగుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు ఎమ్మార్వో కార్యాలయంలో జరుగుతున్న ఆలస్యాలు, మధ్యవర్తుల జోక్యంపై సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకో వాలని జిల్లా కలెక్టర్‌ను గద్వాల పట్టణ, మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# సంగారెడ్డిలో మ్యాంగో మేళా

సంగారెడ్డి వుదయం.


సంగారెడ్డి ఫల పరిశోధన స్థావరంలో డైమండ్ జూబిలీ వేడుకల సందర్భంగా 'మ్యాంగో డైవర్సిటీ ఫెయిర్-2026' లేదా 'మ్యాంగో మేళా'ను ఈ నెల 16న ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమం మే 16, 17 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు.మామిడి ప్రేమికులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై వివిధ రకాల మామిడి పండ్ల ప్రదర్శనను వీక్షించాలని కోరారు. రైతులకు శాస్త్రవేత్తలతో నేరుగా మాట్లాడే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. మామిడి సాగులో ఆధునిక సాంకేతికతలు, కొత్త ఆవిష్కరణలపై అవగాహన కల్పించనున్నారు.రైతులు తమ వద్ద ఉన్న ప్రత్యేకమైన, అరుదైన లేదా కొత్త మామిడి రకాలను ప్రదర్శించవచ్చని తెలిపారు.

అలాగే మామిడి పండ్లతో తయారు చేసిన ప్రాసెస్డ్ ఉత్పత్తులను కూడా ప్రదర్శనలో ఉంచే అవకాశం ఉందన్నారు.

కార్యక్రమానికి ప్రవేశం పూర్తిగా ఉచితమని, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తా



- దేవాలయం వద్ద కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు
- 2 కోట్ల 38 లక్షల సిసి రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి.
- కాగ్నా నదిపై కొత్త వంతెన మంజూరు
- త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదగా శంకుస్థాపన
- యాలాల మే 15 (వు దయం ప్రతినిధి):

దేవాలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారం అందిస్తానని తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం యాలాల మండల పరిధిలోని సంగెం కుర్దు గ్రామ శివారులో గల సంగమేశ్వర ఆలయానికి రెండు కోట్ల 38 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ రోడ్డును ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆలయం ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తారని హామీ ఇచ్చారు. సంగెం కుర్దు, కోకట్ ప్రజల కోరిక మేరకు ఆలయం నుండి సంఘం కుర్రు గ్రామం వరకు సిసి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. అదేవిధంగా శివాలయం వద్ద కాగ్న నదిపై వంత నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కోకట్ నదిపై గతంలో స్వర్గీయ ఎన్ టి రామారావు బ్రిడ్జిను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన వంతేన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారం వచ్చిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకున్న ప్రజల సమస్యలు తీర్చడం కోసం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అంచలంచలుగా నెరవేర్చడం జరుగుతుందని వివరించారు. తాండూర్ నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎంత కష్టమైనా వెనుకాడదిలేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు. తాండూర్ మున్సిపల్ చైర్పర్సన్ నీరజ బాల్ రెడ్డి, యాలాల పి ఎ సీ ఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, కోకట్ సర్పంచ్ రాజేందర్ రెడ్డి, సంగం కుర్దు సర్పంచ్ సుధా లక్ష్మి.. యాలల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహిపాల్ యాదవ్, మాజీ అధ్యక్షులు, నర్సిరెడ్డి, భీమయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు హనుమంతు ముదిరాజ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, తాండూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింలు గౌడ్, ఎంపీడీవో శ్రీనిజ, తాసిల్దార్ వెంకటస్వామి, ఆర్ ఐ చరణ్ పంచాయతీరాజ్ డిఇ, ఏ ఏ ఈ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఆర్డీవో



నారాయణ పేట మే15 (వుదయం ప్రతినిధి)

నారాయణపేట జిల్లాకు నూతనంగా నియమితులైన ఆర్డీవో ఎల్. రమేష్ జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ని ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి ఎస్పీకి పూల మొక్కను అందజేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆర్డీవోకు జిల్లా ఎస్పీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, జిల్లా అభివృద్ధి ప్రజలకు మెరుగైన సేవలందించడంలో పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు.

# సకాలంలో ధాన్యం కొనుగోలు చేయాలి



★ తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నర్సింలు.

★ యాలాల మే15 (వు దయం ప్రతినిధి ):

వరి ధాన్యం సకాలంలో కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తాండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నర్సింలు పేర్కొన్నారు. శుక్రవారం ఈ యాలాల మండల పరిధిలోని రాసనం గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నర్సింలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. ధాన్యం కొనుగోలు ఎన్ని ఇబ్బందులు ఉన్న రైతు పండించిన ప్రతి గింజలు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతుల ధాన్యాన్ని సకాలంలో తూకం చేసి మిల్లులకు చేరవేయనున్నారు. రైతులకు అవసరమైన గోనె సంచల ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సకాలంలో ధాన్య సేకరణ పూర్తి చేస్తామని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేంద్ర నిర్వాహకులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కేటాయించిన మిల్లులకు ట్రాన్స్పోర్ట్ ద్వారా వెంట వెంటనే ధాన్యం చేరవేరాలని సూచించారు. కేంద్రంలో ఏలాంటి ఇబ్బందులు ఏర్పడిన తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో యాలాల పిఏసిఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, యాలాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహిపాల్, మాజీ మండల అధ్యక్షులు నర్సిరెడ్డి, గ్రామ సర్పంచ్, మాజీ ఉపసర్పంచ్ జనార్దన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సాయిలు, ఐకెపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**- ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి**

**కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే**

**నాగర్ కర్నూల్, మే 15 (వుదయం ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం తాడూర్, తెల్కపల్లి మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం చెక్కులను ఆయన పంపిణీ చేశారు. రెండు మండలాల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు చెక్కులు అందుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తోంది. సమాజంలోని ప్రతి వర్గానికీ ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం" అని తెలిపారు."కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేద కుటుంబాల్లో ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక సాయం అందించి వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నాయి. ఆడపిల్ల పెళ్లి ఇక భారం కాదు, ప్రభుత్వ బాధ్యత" అని ఆయన పేర్కొన్నారు.ప్రజల సంక్షేమం కోసం మరింత సమర్థంగా పనిచేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, అందరూ కలిసి రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు మాట్లాడుతూ, ప్రభుత్వం అందించిన సాయానికి కృతజ్ఞతలు తెలిపారు. "మా కూతురి పెళ్లికి ఈ డబ్బు ఎంతో ఉపయోగపడుతుంది.

ముఖ్యమంత్రికి,ఎమ్మెల్యే కి ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్, తాడూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యారా రమేష్, తెల్కపల్లి మండల అధ్యక్షుడు బండా పర్వతాలు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల ముఖ్య నాయకులు, ప్రభుత్వ అధికారులు, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.ఫొటో క్యాప్షన్: నాగర్‌కర్నూల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి. చిత్రంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు తదితరులు. బాక్స్ ఐటమ్‌కి టైటిల్: "పేదింటి ఆడబిడ్డలకు ప్రభుత్వ కానుక"ఇది పేపర్‌లో డైరెక్ట్‌గా వేసుకోవచ్చు బ్రో. ఫాంట్ సైజ్, కాలమ్ అడ్జస్ట్ చేసుకుంటే సరిపోతుంది.

# విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించాలి



**పుస్తక పఠనమే విజ్ఞానానికి మార్గం, జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్**

**నాగర్ కర్నూల్ మే 15(వుదయం ప్రతినిధి)**

గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా జిల్లా గ్రంథాలయంలో విద్యా వారోత్సవాల ఉత్సాహంప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల సందర్భంగా శుక్రవారం విద్యా వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ మాట్లాడుతూ....., గ్రంథాలయాలు విద్యా వ్యవస్థలో జ్ఞాన కేంద్రాలుగా కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. విద్యార్థుల్లో పఠన అలవాటును పెంపొందించడం ద్వారా వారి సృజనాత్మకత, విశ్లేషణా సామర్థ్యం, ఆలోచనా శక్తి అభివృద్ధి చెందుతుందని ఆయన వివరించారు."పుస్తకాలు మనకు నిజమైన మార్గదర్శకులు. తరగతి గదిలో నేర్చుకున్న జ్ఞానాన్ని మరింత విస్తరించాలంటే గ్రంథాలయ పఠనం అత్యంత అవసరం" అని రమేష్ కుమార్ అన్నారు. ఆధునిక సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా పుస్తకాల ద్వారా లభించే లోతైన జ్ఞానానికి ప్రత్యామ్నాయం లేదని ఆయన స్పష్టం చేశారు.విద్యార్థులు రోజువారీ జీవితంలో కనీసం కొంత సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించాలని ఆయన సూచించారు. ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని, అందుబాటులో ఉన్న పుస్తకాలు, రిఫరెన్స్ మెటీరియల్‌ను ఉపయోగించుకోవడం ద్వారా తమ లక్ష్యాలను సులభంగా చేరుకోవచ్చని ఆయన తెలిపారు.గ్రంథాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కూడా ఆయన ఈ సందర్భంగా వివరించారు. ప్రతి విద్యార్థికి సులభంగా జ్ఞానం అందించాలనే లక్ష్యంతో గ్రంథాలయ వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి కురుమయ్య, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి కిరణ్ కుమార్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా తెలంగాణ: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు రావాలి : మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**కెజేఎస్ ఇండియా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్–II కు శంకుస్థాపనచేసిన మంత్రులు**

**సంగారెడ్డి, మే 15:--వుదయం జిల్లా ప్రతి నిది.**

రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తో కలిసి సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం తోగారపల్లి గ్రామ శివారులో కే జేఎస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్-II కు శుక్రవారం శంకుస్థాపన చేశారు. రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం చేపడుతున్న ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 1500 మందికి, పరోక్షంగా సుమారు 5 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.రాబోయే రోజుల్లో రాష్ట్రంలో భారీ స్థాయిలో ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌లు ఏర్పాటుకానున్నాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఫుడ్ ప్రాసెసింగ్ రంగం 9 ట్రిలియన్ డాలర్ల మార్కెట్‌గా ఎదగనున్న నేపథ్యంలో తెలంగాణ కూడా ఈ రంగంలో ప్రత్యేక గుర్తింపు సాధించే దిశగా అడుగులు వేస్తోందన్నారు.జహీరాబాద్ ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకొని నిమ్జ్ (NIMZ) ను అతిపెద్ద పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. భవిష్యత్తులో ఈ ప్రాంతం రూపుదిద్దుకుంటుందని పేర్కొన్నారు. 65 శాతం పైగా యువత నైపుణ్యాలను వినియోగించుకొని తెలంగాణను మరింత శక్తివంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతాలను గుర్తించి విలువ ఆధారిత పరిశ్రమల స్థాపనకు మెదక్ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి స్వర్గీయ ఇందిరా గాంధీ ఎంపీగా ఉన్న సమయంలో ఏర్పడిన పారిశ్రామిక ప్రోత్సాహక చర్యలే కారణమన్నారు.సంగారెడ్డి జిల్లా పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందేందుకు ఇంకా అనేక ప్రాంతాల్లో పరిశ్రమలు స్థాపించేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కోరారు. యువతకు విస్తృత స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు, సురేష్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, టి జి ఐ ఐ సి చైర్మన్లు నిర్మల జగ్గారెడ్డి, గిరిధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పి పరితోష్ పంకజ్, టీజీఐఐసి ఎండి శశాంక్ , మాజీ శాసనసభ్యులు జయప్రకాశ్ రెడ్డి,స్థానిక ప్రజాప్రతినిధులు, కంపెనీ చైర్మన్ గిరీష్ జైన్,ఎండి సి.పి. రాంకా , అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో మంత్రి శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు



**పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కేంద్రంపై విమర్శలు – రైతులు, విద్యార్థుల అంశాలపై స్పందన**

**సంగారెడ్డి వుదయం.**

మంత్రి శ్రీధర్ బాబు సంగారెడ్డిలో నిర్మలా జగ్గారెడ్డి నివాసంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎంపీ సురేష్ షెట్కర్ కూడా పాల్గొన్నారు.మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరలను రూ.3 పెంచడం ప్రజలపై భారంగా మారిందని విమర్శించారు. నాలుగు రాష్ట్రాల ఎన్నికల అనంతరం కేంద్ర ప్రభుత్వం ధరల పెంపు చేపట్టడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్లేనని అన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలపై ఈ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.బెంగాల్, తమిళనాడులో ఎన్నికల చివరి దశకు ముందు పెట్రోల్, డీజిల్ ధరలు పెరగవని అధికార వర్గాలు చెప్పి, ఇప్పుడు పెంపు చేయడం ద్వారా ఓటర్లను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తగ్గిన సమయంలో కేంద్రం ప్రజలకు ఎప్పుడైనా ఉపశమనం కల్పించిందా అని బీజేపీని ప్రశ్నించారు."ఇప్పుడు రూ.3 పెంచి, ఇంకా ధరలు పెరిగే సంకేతాలు ఇస్తున్నారు. నిత్యావసర వస్తువుల ధరల పై అదనపు భారం మోపి పేదల , సామాన్య ప్రజల నడ్డి విరచడమే బీజేపీ అసలు స్వరూపం" అని వ్యాఖ్యానించారు.

గత 12 ఏళ్లలో అంతర్జాతీయంగా చమురు ధరలు అత్యల్ప స్థాయికి చేరినా కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ప్రయోజనం కల్పించలేదని విమర్శించారు. రాజకీయ అంశాలపై స్పందిస్తూ, ప్రజలను విభజించడం, ప్రజల మధ్య చిచ్చు పెట్టడం బీజేపీ లక్ష్యమని ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలు స్నేహపూర్వకంగా జీవించాలని రాహుల్ గాంధీ కోరుతున్నారని తెలిపారు. తెలంగాణ ప్రజలు విజ్ఞానవంతులని, బీజేపీ కుట్రపూరిత రాజకీయాలను అంగీకరించరని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభివృద్ధి, సంక్షేమానికే కట్టుబడి ఉందని స్పష్టం చేసిన మంత్రి, రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రులందరూ సమిష్టిగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వంలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని, ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సక్రమంగా వినియోగిస్తామని చెప్పారు.ధాన్యం కొనుగోలు అంశంపై మాట్లాడుతూ, దేశ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా ఈసారి భారీగా ధాన్యం మార్కెట్‌కు వచ్చిందన్నారు.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతి రెండు రోజులకు ఒకసారి ధాన్యం కొనుగోలుపై సమీక్ష నిర్వహిస్తున్నారని, చివరి గింజ వరకు మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు హామీ ఇచ్చారు.

నీట్ పరీక్ష లీకేజీ ఘటనపై కూడా మంత్రి స్పందించారు.

దాదాపు 23 లక్షల విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రంలోని ఎన్డీఏ, బీజేపీ ప్రభుత్వం ఆడుకుందని ఆరోపించారు. ఎన్నో సంవత్సరాలు కష్టపడి చదివిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే, "చట్టాలను చుట్టాలుగా బీఆర్ఎస్ ఉపయోగించినట్లు మేము చేయము. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుంది" అని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు.

# 2027 నాటికి కుష్టు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం: డాక్టర్ రాజు



సిద్దిపేట, మే 15 (వుదయం బ్యూరో ప్రతినిధి)

2027 సంవత్సరం నాటికి కుష్టు వ్యాధిని (లెప్రసీ) సంపూర్ణంగా నిర్మూలించడమే లక్ష్యంగా క్షేత్రస్థాయి ఆరోగ్య సిబ్బంది ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని రాష్ట్ర కుష్టు వ్యాధి నివారణ పరిశీలకులు డాక్టర్ రాజు పిలుపునిచ్చారు. గురువారం ఆయన జిల్లాలోని చిన్నకోడూరు, కొమురవెల్లి, నాసర్ పుర పట్టణ ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. అక్కడ జరుగుతున్న కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమాల పని తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం దస్త్రాలను (రికార్డులను) పరిశీలించి, ఆరోగ్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన ముందస్తు ప్రణాళికలపై దిశా నిర్దేశం చేశారు. ప్రజల్లో ఈ వ్యాధి పట్ల విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు.కుష్టు వ్యాధి శాపం కాదు.. నయమయ్యే చర్మ వ్యాధి.. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ధనరాజ్ అనంతరం సిద్దిపేట సమీకృత మాత్రమే. సకాలంలో గుర్తిస్తే ఈ వ్యాధి పూర్తిగా నయమవుతుంది. క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది ముందస్తుగా వ్యాధి లక్షణాలను గుర్తించి, బాధితులకు తగిన చికిత్స అందించాలి. అప్పుడే సిద్దిపేటను కుష్టు వ్యాధి రహిత జిల్లాగా మార్చడం సాధ్యమవుతుంది. అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకుల బృంద సభ్యులు సకల రెడ్డి, వెంకటేశ్వర చారి, సురేందర్ లతో పాటు జిల్లా కార్యక్రమ అధికారులు డాక్టర్ నిర్మలారెడ్డి, డాక్టర్ వినోద్, డాక్టర్ దీప్తి ప్రియాంక, డాక్టర్ శ్రీకాంత్ యాదవ్, జిల్లా కార్యక్రమ నిర్వహణ అధికారి (డిపిఎంఓ) లక్ష్మణ్, జయాకర్, జయమ్మ, రవీందర్, జిల్లా ఆరోగ్య విద్యా ప్రచార అధికారి (డెమో) నవీన్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## పుచ్చకాయ గింజలూ మంచివేనట!



వేసవిలో మండుటెండల నుంచి ఉపశమనం పొందాలంటే పుచ్చకాయకు మించిన పండు మరొకటి లేదు. నీటి శాతం అధికంగా ఉండే ఈ సీజనల్ ఫ్రూట్‌లో శరీరానికి చలువనిచ్చే గుణాలు పుష్కలంగా ఉంటాయి. అయితే చాలామంది ఈ పండును తినేటప్పుడు గింజలను పక్కన పడేస్తుంటారు. అయితే ఇలా పుచ్చకాయ గింజలను పక్కన పెట్టేయడమంటే చేతికందిన పోషకాలను దూరం చేసుకున్నట్లేనని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ప్రొటీన్లు, విటమిన్లు లాంటి పోషకాలు వీటిలో పుష్కలంగా ఉంటాయని వారు సూచిస్తున్నారు. పుచ్చకాయ గింజల్లో ప్రొటీన్లు, విటమిన్స్‌తో పాటు మెగ్నీషియం, ఐరన్, పొటాషియం, కాపర్, జింక్, మాంగనీస్, ఒమేగా–3, ఒమేగా–6 ఫ్యాటీ ఆమ్లాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందించడమే కాకుండా చర్మం, జుట్టు సంరక్షణలోనూ కీలక పాత్ర పోషిస్తాయట. చర్మ సంరక్షణకు పుచ్చకాయ గింజలను డైట్‌లో భాగం చేసుకోవాల్సిందే అంటున్నారు నిపుణులు. ఇందులోని మెగ్నీషియం, జింక్, ఇతర ఖనిజ లవణాలు చర్మంలోని విష తుల్యాలను తొలగించడంలో సహాయం చేస్తాయట. వీటిని నేరుగా తీసుకోవడం ఇష్టం లేకపోతే వేయించుకుని తినచ్చు. చర్మమే కాదు కురుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఎన్నో పోషకాలు పుచ్చకాయ గింజల్లో ఉంటాయి. ఇందులోని ప్రొటీన్లు, ఐరన్, మెగ్నీషియం, జింక్ తదితర ఖనిజ లవణాలు శిరోజాల కుదుళ్లను బలంగా ఉంచడంలో తోడ్పడతాయి. ఈ గింజల్లోని మాంగనీస్ జుట్టు రాలిపోవడాన్ని నిరోధిస్తుందట. పుచ్చకాయ గింజల్లో మోనో అన్‌శ్యాచురేటెడ్, పాలీ అన్‌శ్యాచురేటెడ్ ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు గుండె పనితీరును మెరుగుపరుస్తాయని చెబుతున్నారు నిపుణులు. సాధారణంగా వయసు పెరిగే కొద్దీ ఎముకలు కూడా బలహీనంగా మారిపోతాయి. చిన్న చిన్న దెబ్బలు తగిలినా చాలా రోజుల పాటు వెంటాడుతుంటాయి. ఈ క్రమంలో పుచ్చకాయ గింజలను క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా ఈ సమస్యలను అధిగమించవచ్చని చెబుతున్నారు నిపుణులు. ఈ గింజల్లోని మెగ్నీషియం, కాపర్, పొటాషియం వంటి పోషకాలు కండరాలను దృఢంగా మార్చుతాయట. సాధారణంగా చాలామంది పుచ్చకాయ గింజలను ఎండబెట్టి తింటుంటారు. ఇలా డైరెక్టుగా తినడం ఇష్టం లేకపోతే వేయించుకుని తినచ్చు. అదేవిధంగా వీటిని పొడిగా చేసుకుని వివిధ రకాల ఫ్రూట్ సలాడ్స్, సూప్స్, స్మూతీలలో కలుపుకొని కూడా తీసుకోవచ్చు అంటున్నారు నిపుణులు.

## స్ప్రే చేస్తే వేడిపోతుంది!



ఎండలు నిప్పులు చెరుగుతున్నా... ఉద్యోగం, ఇంటిపనులు, ఇతర అవసరాలకోసం తరచూ బయటకు వెళ్లడం తప్పదు. వెంట గొడుగు తీసుకెళ్తున్నా కూడా ఆ వేడిని తట్టుకుని ఇంటికి చేరేవరకూ ఉక్కపోత మామూలుగా ఉండదు. ఈ సమస్య నుంచి బయటపడేందుకే ఇప్పుడు కొత్తగా 'కూల్ స్ప్రే' వస్తోంది. దీన్ని కొద్దిగా స్ప్రే చేసుకుంటే చాలు... చాలా తక్కువ సమయంలోనే శరీరం ఏసీలో ఉన్నంత చల్లగా మారిపోతుంది. నీళ్లు, పెర్‌ఫ్యూమ్, శరీరానికి హానిచేయని డ్రైఐస్... తదితరాలు కలిపి తయారుచేసే ఈ స్ప్రేని కేవలం ఒంటికే కాదండోయ్, దుస్తులపైనా, చెప్పుల్లో, కార్లో... ఇలా అన్నిచోట్లా వాడుకోవచ్చు!

## సమ్మర్ ట్రిప్స్‌లో ఈ కిట్ తప్పనిసరి!

చాలా మంది బట్టలు, చార్జర్స్, కెమెరా ప్యాక్ చేస్తారు కానీ ఎమర్జెన్సీకి పనికొచ్చే వస్తువులు మర్చిపోతారు. కానీ మన జర్నీలో ఈ కిట్ ఒక సూపర్ హీరోలా అవసర సమయంలో ఆదుకుంటుంది అని చాలా మందికి తెలియదు. ప్రయాణంలో అనుకోని సమస్యలు వచ్చినప్పుడు ఉపయోగపడేందుకు మీ వద్ద ఈ కిట్ మెయింటేన్ చేయడం మరవకండి. ఈ ఎమర్జెన్సీ కిట్‌లో తప్పకుండా స్పేర్‌గా ఒక వాటర్ బాటిల్, కొన్ని ఓఆర్ఎస్ 'ప్యాకెట్స్ ఉండాలి. ఎందుకంటే ఎండాకాలంలో డీహైడ్రేషన్ అనేది చాలా పెద్ద సమస్య. అందుకే రీయూజబుల్ బాటిల్‌తో 'పాటు ఓఆర్ఎస్ 'ప్యాకెట్స్ క్యారీ చేయండి. బేసిక్ మెడిసిన్స్.. తలనొప్పి ట్యాబ్లెట్స్, ఫీవర్ మెడిసిన్, మోషన్ సిక్‌నెస్ ట్యాబ్లెట్స్, ఆసిడిటీ రెగ్యులేటర్ ట్యాబ్లెట్స్, బ్యాండ్ ఎయిడ్స్, యాంటిసెప్టిక్ క్రీమ్ తప్పకుండా ఉండాలి. పిల్లలతో వెళ్లేటప్పుడు మరింత జాగ్రత్త అవసరం. ఇవన్నీ తీసుకున్నాక అవసరమైతే దగ్గర్లోని వైద్యుడిని సంప్రదించడం మరవకండి! సన్‌స్క్రీన్, క్యాప్... మన తెలుగు రాష్ట్రాల్లో మే నెలలో ఎండల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎస్‌పీఎఫ్ సన్‌స్క్రీన్, సన్‌గ్లాసెస్, క్యాప్ లేకపోతే వేడికి చర్మం డ్యామేజ్ అయ్యే అవకాశం ఉంది. పవర్ బ్యాంక్ అండ్ టార్చ్ ... కొండప్రాంతాలు లేదా అటవీ ప్రాంతాలకు వెళ్తే చార్జింగ్ పేయింట్స్ లభించకపోవచ్చు. పవర్ బ్యాంక్, చిన్న టార్చ్ లైట్ చాలా ఉపయోగపడతాయి. మరీ ముఖ్యంగా కొండ ప్రాంతాల్లో ఈ సమస్యలు సాధారణమే.వెట్ వైప్స్, శానిటైజర్... రోడ్ ట్రిప్స్‌లో హైజీన్ మెయింటేన్ చేయడానికి వెట్ వైప్స్ చాలా ఉపయోగపడతాయి. శానిటైజర్ మీ బ్యాగ్‌లో తప్పకుండా ఉండేలా చూసుకోండి.చిరుతిళ్లు ... బిస్కిట్స్, డ్రై ఫ్రూట్స్, ప్రోటీన్ బార్స్ లాంటి స్నాక్స్ క్యారీ చేయడం మరవకండి. పిల్లలు ఉన్నప్పుడు ఇంకా జాగ్రత్తగా ప్లాన్ చేయాల్సి ఉంటుంది. ఎండాకాలం రోడ్ ట్రిప్ అయితే మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు ప్రయాణాలు చేయకపోవడం ఉత్తమం. ఉదయం త్వరగా బయల్దేరి ఎండ పెరిగేలోపు ప్రయాణించండి. తరువాత సాయంత్రం సమయంలో ప్రయాణాన్ని కొనసాగించండి. ఇలా చేస్తే మీ ప్రయాణం మరింత కంఫర్టబుల్‌గా సాగుతుంది.



## మామిడి పండ్లను తినేముందు ఇలా చేయడం తప్పనిసరి..!

ఇలా నీటిలో నానబెట్టడం వల్ల పోషకాల శోషణ మెరుగుపడటమే గాక శరీర ఉష్ణోగ్రతను నియంత్రించి, జీర్ణసంబంధిత సమస్యలను నివారిస్తుందని అంటున్నారు. ఈ మామిడిలో విటమిన్లు ఏ,సీల తోపాటు, పీచుపదార్థం కూడా పుష్కలంగా ఉంటుంది. ఇది మంచి శక్తి కేంద్రం అయినప్పటికీ..పచ్చి రూపంలో కొన్ని జీవరసాయన సమ్మేళనాలు ఉంటాయి. అయితే ఈ పండు మన జీర్ణక్రియకు సురక్షితమైనదిగా ఉండాలంటే..ఈ సమ్మేళనాల ప్రభావాన్ని తగ్గించేలా నీటిలో అరగంటపాటు నానబెట్టక తప్పదని అంటున్నారు ఆరోగ్య నిపుణులు. మరి అలా చేయడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి సవివరంగా చూద్దామా..! మామిడి పండ్లను నానబెట్టమని సిఫార్సు చేయడానికి ప్రాథమిక శాస్త్రీయ కారణం ఫైటిక్ ఆమ్లం ఉండటమే. ఫైటిక్ ఆమ్లం అనేది వివిధ మొక్కల ఆధారిత ఆహారాలలో కనిపించే ఒక సహజ పదార్థం. ఇది ఫాస్ఫరస్‌ను నిల్వ చేసే రూపంగా పని చేస్తుంది. పోషకాహార శాస్త్ర ప్రకారం..ఖనిజాల జీవ లభ్యతపై దాని ప్రభావం కారణంగా దీనిని తరచుగా "పోషక విరోధి"గా వర్గీకరిస్తారు. జీర్ణవ్యవస్థలో కాల్షియం, ఇనుము, జింక్ వంటి అవసరమైన ఖనిజాలతో బంధం ఏర్పరచుకోవడానికి ఫైటిక్ ఆమ్లానికి అధిక అనుబంధం ఉంటుంది. ఈ ఖనిజాలు ఫైటిక్ ఆమ్లంతో బంధం ఏర్పరచుకున్నప్పుడు, అవి కరగని అవక్షేపాలను ఏర్పరుస్తాయి. అయితే వీటిని మానవ శరీరంలోని చిన్న ప్రేగు గ్రహించలేదు. అందువల్ల ఈ మామిడి పండ్లను 30 నిమిషాల పాటు నీటిలో నానబెట్టడం వల్ల, వాటిలోని అదనపు ఫైటిక్ ఆమ్లం కరిగిపోవడం లేదా విచ్ఛిన్నం కావడం జరుగుతుందని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. ఈ "యాక్టివేషన్" ప్రక్రియ కారణంగా పండులోని సూక్ష్మపోషకాల పూర్తి పోషక విలువను సులభంగా పొందగలమని చెబుతున్నారు. జీర్ణవ్యవస్థ సమతుల్యతను కాపాడుకోవడానికి ఈ పద్ధతి చాలా అవసరమని వైద్యులు నొక్కి చెబుతున్నారు.




## రెండు వారాల పాటు గ్రీన్ టీ తాగితే..




గ్రీన్ టీ తాగడం అనేది ఒక సాధారణ ఆరోగ్యకరమైన విధానంగా పేర్కొనవచ్చు. దీనిలో శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్లు, ఇతర ప్రయోజనకరమైన సమ్మేళనాలతో నిండిన గ్రీన్ టీతో మెరుగైన సంపూర్ణ ఆరోగ్యం ముడిపడి ఉందని చెబుతున్నారు నిపుణులు. అలాంటి గ్రీన్‌టీని క్రమంతప్పకుండా తీసుకుంటే.. జీవక్రియ, మెదడు పనితీరు, కాలేయ ఆరోగ్యం తదితరాలపై మంచి ప్రభావాన్ని చూపిస్తుందని తెలిపారు. కేవలం 14 రోజుల్లోనే ప్రతిరోజూ ఒకటి లేదా రెండు కప్పుల గ్రీన్ టీ తాగడం వల్ల శరీరంలో అర్థవంతమైన మార్పులు ఎలా సంతరించుకుంటాయో గమనించొచ్చని అన్నారు. అంతేగాదు హార్వర్డ్ అండ్ స్టాన్‌ఫోర్డ్‌లో శిక్షణ పొందిన గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ 14 రోజుల పాటు ప్రతిరోజూ గ్రీన్ టీ తాగితే ఇలా జరుగుతుందంటూ ఓ వీడియోని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఆయన ఈ వీడియోకి ఇది ఆరోగ్యకరమైన అలవాటా? లేక అతిగా ప్రచారం చేయబడిన ట్రెండా? అనే క్యాప్షన్ జోడించి మరి పోస్ట్ చేశారు. ఆ వీడియోలో గ్రీన్ టీ వల్ల అత్యధికంగా ప్రయోజనం పొందే మొదటి అవయవాలలో కాలేయం ఒకటని ఆయన పేర్కొన్నారు. గ్రీన్ టీలో EGCG వంటి కాటెచిన్లు ఉంటాయి. ఈ యాంటీఆక్సిడెంట్లు కాలేయ వాపును తగ్గించి, జీవక్రియను మెరుగుపరుస్తాయని అన్నారు. అంతేగాదు యాంటీఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడితో పోరాడటం ద్వారా పనిచేస్తాయి, ఇది అనేక ఆరోగ్య సమస్యలతో ముడిపడి ఉంటుంది. ముఖ్యంగా కాఫీ వల్ల వచ్చే తీవ్రమైన వణుకుని నివారించి ఏకాగ్రత శక్తిని పెంచుతుందట. అంతేగాదు మెదడు చురుకుగా ఉంటుందని చెబుతున్నారు

## చెమట ఇబ్బంది పెట్టకూడదంటే..



స్నానానికి యాంటీ బ్యాక్టీరియల్ సబ్బును వాడటం వల్ల చర్మంపై ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. అలాగే స్నానం చేసిన తర్వాత బాహుమూలలు, పాదాలు, చర్మం మడతలు ఉండే ప్రాంతాల్ని తడి లేకుండా పూర్తిగా తుడుచుకోవాలి. గాలి ఆడేలా ఉండే కాటన్ బట్టల్ని ధరించాలి. ఇవిగాక యాంటీ–పెర్‌స్పిరెంట్స్, డియోడరెంట్స్ వాడటం వల్ల దుర్వాసనను కలిగించే బ్యాక్టీరియాను చంపి, మంచి సువాసనను ఇస్తాయి. వీటికన్నా ముఖ్యం ఏమిటంటే.. కారం ఎక్కువగా ఉండే పదార్థాలు, కెఫీన్, వెల్లుల్లి వంటి ఘాటైన వాసన వచ్చే ఆహార పదార్థాల్ని తగ్గించాలి. తాజా పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవడం వల్ల శరీరం సహజమైన సమతుల్యతను కలిగి ఉంటుంది. అలాగే తగినంత నీరు తాగడం వల్ల శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది. అలాగే చెమట గాఢత తగ్గి, దుర్వాసన తక్కువగా వస్తుంది.

## సైనస్‌తో బాధపడుతున్నారా?



కపాలభాతి అంటే తలను, మెదడును శుభ్రంగా చేసి ప్రకాశవంతంగా చేసే శ్వాస సాధన. దీన్ని శుద్ధిక్రియ అని కూడా అంటారు. ముందుగా సుఖాసనం లేదా పద్మాసనంలో కూర్చోవాలి.వెన్నెముక నిటారుగా ఉంచాలి. కళ్లు మూసుకొని రెండు చేతులను మోకాళ్ల పైన జ్ఞానముద్రలో ఉంచాలి. శ్వాస ప్రక్రియ: లోతుగా శ్వాస తీసుకోవాలి. ఇప్పుడు ముక్కు రంధ్రాల ద్వారా శ్వాసను వేగంగా, బలంగా బయటకు వదలండి. శ్వాసను బయటకు వదిలినప్పుడు, పొట్ట కండరాలను వెన్నెముక వైపు లోపలికి నొక్కాలి. శ్వాసను బయట కు వదలడం యాక్టివ్‌గా ఉండాలి, లోపలికి తీసుకోవడం పాసివ్‌గా – అంటే శ్వాసను లోపలికి తీసుకునే ప్రయత్నం చేయనక్కర్లేదు, అదిఆటోమేటిక్‌గా జరుగుతుంది ఉండాలి. బయటకు వదిలే శ్వాస మీద మాత్రమే దృష్టి పెట్టాలి.ఇలా 15–20 సార్లు వేగంగా శ్వాస తీసుకున్న తర్వాత, ఒక్క రౌండ్ పూర్తవుతుంది. కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని, 2–3 రౌండ్లు చేయాలి. ఉదయం ఖాళీ కడుపుతో చేస్తే ఎక్కువ ప్రయోజ నం. వేగంగా చేయకూడదు. తల తిరుగుతున్నట్లు అనిపిస్తే వెంటనే ఆపాలి. హై బీపీ, గర్భిణీలు, హెర్నియా, గుండె సమస్యలు ఉన్నవారు చేయకూడదు. ముక్కులో ఉన్న మ్యూకస్ (కఫం) బయటకు వస్తుంది.

ముక్కు బ్లాకేజ్ తగ్గుతుంది. సైనస్ ప్రెషర్, తలనొప్పి తగ్గుతుంది. శ్వాస సులభంగా జరుగుతుంది.ఊపిరితిత్తులు బలంగా అవుతాయి. జీర్ణశక్తి మెరుగవుతుంది. పొట్ట కొవ్వు తగ్గడానికి సహాయం చేస్తుంది. మనసు ప్రశాంతంగా, చురుకుగా ఉంటుంది.

## ఉపవాసంతో కేన్సర్ నయం అవుతుందా?


ఉపవాసం కేన్సర్ చికిత్సలో సహాయపడుతుందని, కణాల పునరుద్ధరణకు దోహదపడుతుందని పలు పరిశోధనలు సూచించాయి. కానీ ఉపవాసం మాత్రమే కేన్సర్‌ని పూర్తిగా తగ్గిస్తుందని తేల్చి చెప్పడానికి మరిన్ని పరిశోధనలు జరగాల్సి ఉంది. అయితే, కేన్సర్ రోగులకు ఉపవాసం వల్ల కొన్ని లాభాలు మాత్రం కచ్చితంగా ఉన్నాయని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. ఇక్కడ ఉపవాసం కీమోథెరపీ మందుల ప్రభావాన్ని పెంచి, ఆరోగ్యకరమైన కణాలను రక్షిస్తూ కేన్సర్ కణాలను బలహీనపరుస్తుందని కొన్ని అధ్యయనాల్లో తేలింది. అంతేగాదు ఉపవాసం వల్ల శరీరంలో గ్లూకోజ్ స్థాయిలు తగ్గి, కేన్సర్ కణాలకు కావాల్సిన పోషకాలు అందక అవి పెరగడం తగ్గుతుందని పరిశోధనల్లో తేలింది. ఇక్కడ ఉపవాసం రోగనిరోధక వ్యవస్థను పునరుద్ధరించి, కేన్సర్ కణాలతో పోరాడే సామర్థ్యాన్ని పెంచుతుంది. అలాగే శరీరం పాడైపోయిన కణాలను శుభ్రం చేసి, కొత్త కణాలను పునరుత్పత్తి చేస్తుందని పలువురు నిపుణులు నొక్కి చెబుతున్నారు. ఆ నేపథ్యంలోనే ఈ ఉపవాసానికి అత్యంత ప్రజాదరణ పెరిగి, పలు దేశాల్లో ఉపవాస కేంద్రాలు పుట్టుకొచ్చాయి ఇలా.

ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, అమెరికా, మెక్సికో, కోస్టారికా, స్పెయిన్, పోర్చుగల్, థాయ్‌లాండ్, బాలి తదితర దేశాల్లో ఉపవాస రీట్రీట్స్ నిర్వహిస్తున్నారు. వీటిని ఆరోగ్యపరమైన డిటాక్స్, బరువు తగ్గింపు, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక సాధన కోసం ఏర్పాటు చేశారు. ఈ విధానంలో యోగా, ధ్యానం తోపాటు ప్రత్యేకమైన జ్యూస్‌లు తీసుకుంటూ చేసే ఉపవాసం చేస్తారు. అలాగే కొద్ది మోతాదులోమొక్కల ఆధారిత ఆహారాన్ని ఇస్తారు. ఫ్లోరిడా – ఇది కూడా జ్యూస్ ఫాస్టింగ్ రీట్రీట్ కానీ 14 రాత్రులు చేస్తారు.

మెక్సికో: ప్లయా డెల్ కార్మెన్లో కాంబో డీప్ డెటాక్స్ థెరపీ

ఇది అమెజాన్ అడవులకు చెందిన ఒక సాంప్రదాయ చికిత్స. 24 గంటలు ఉపవాసం ఉండి..అమెజాన్ జంగిల్ మెడిసిన్‌ని శరీరంపై అప్లై చేస్తారు. ఇది శరీరంలోని విష పదార్థాలను బయటకు పంపించి నిర్వీకర్షణ చేస్తుంది. కోస్టారికా: 5–రోజుల తీవ్రమైన శారీరక, భావోద్వేగ నిర్విషీకరణ ప్రక్రియ. ఈ కార్యక్రమం జ్యూస్ ఫాస్టింగ్, కోలోన్ క్లెన్సింగ్, లివర్ ఫ్లష్‌లను సమ్మేళనం చేసి, శరీరాన్ని లోతుగా శుద్ధి చేస్తుంది

స్పెయిన్: ఆల్కెమీ ఆఫ్ బ్రెత్ సంస్థ నిర్వహించే 'టస్కనీలో 7 రోజుల ఆశా బ్రెత్‌క్యాంప్. ఇక్కడ సుమారు 40 ఎకరాల ప్రకృతి అభయారణ్యంలో ప్రతిరోజూ శ్వాస వ్యాయామాలు, ధ్వని వైద్యం, శాకాహార భోజనాలు ఉంటాయి. పోర్చుగల్: పోర్చుగల్‌లోని ఆల్గార్వే లో 5–రాత్రుల ఫాస్టింగ్ మిమికింగ్ మెటబాలిక్ రీసెట్ రిట్రీట్. ఇది శరీరాన్ని డిటాక్స్ చేయడానికి, బరువు తగ్గడానికి, జీవక్రియను (metabolism) మెరుగుపరచడానికి రూపొందించిన ఒక సైన్స్–ఆధారిత వెల్నెస్ ప్రోగ్రామ్. థాయ్‌లాండ్: 5 రోజుల అనయాత లగ్జరీ జ్యూస్ డిటాక్స్ రిట్రీట్. ఈ విధానంలో ప్రత్యేకమైన జ్యూస్‌లతో శరీరాన్ని శుద్ధి చేస్తారు. యోగా, ధ్యానం వంటి వెల్నెస్ ప్రోగ్రాములు కూడా ఉంటాయి. ఈ శిబిరాల్లో పాల్గొనేవారికి భావోద్వేగ, శారీరక మరియు మానసిక అలసట నుంచి విముక్తి పొందేలా పోషకమైన భోజనాన్ని తీసుకునే నిపుణులు మార్గదర్శకం అందిస్తారు. ఇండోనేషియా (బాలి): ఏడు రోజుల శారీరక, భావోద్వేగ హీలింగ్. ఈ విధానంలో సోమాటిక్ థెరపీ, యోగా వంటివి ఉంటాయి. నేపాల్: శ్రీ యోగా డిటాక్స్ రిట్రీట్ (కాఠ్మాండు). ప్రకృతి మధ్యలో నివాసం, యోగా, డిటాక్స్ వంటివి ఉంటాయి. కంబోడియా CPC వెల్‌నెస్ డిటాక్స్ రీట్రీట్. హోలిస్టిక్ డిటాక్స్, రీబ్యాలెన్సింగ్ ప్రోగ్రామ్.




## మీ కడుపు చల్లగా...

వేసవిలో జీర్ణక్రియ మందగించడం, గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలు రావడం సహజం. వీటికి చెక్ పెట్టాలంటే మన ఆహారపు అలవాట్లలో కొన్ని మార్పులు తప్పనిసరి. మన శరీరంలోని రోగనిరోధక శక్తిలో దాదాపు 70–80 శాతం కేవలం మన గట్ (జీర్ణాశయం, పేగులు) పైనే ఆధారపడి ఉంటుంది.



అందుకే గట్ హెల్త్ బాగుంటేనే మనం ఉత్సాహంగా ఉండగలం. వేసవిలో గట్ హెల్త్‌కు మజ్జిగను మించిన ఔషధం లేదు. ఇందులో ఉండే ప్రోబయాటిక్స్ పేగుల పనితీరును మెరుగుపరుస్తాయి. చల్లటి మజ్జిగలో కొంచెం అల్లం, కరివేపాకు, జీలకర్ర పొడి కలిపి తీసుకుంటే జీర్ణక్రియ సాఫీగా సాగుతుంది. ఇది కేవలం దాహాన్ని తీర్చడమే కాదు, పొట్టలోని మంటనూ తగ్గిస్తుంది. ఈ కాలంలో తప్పనిసరిగా చివరి ముద్దలో అయినా, భోజనం తర్వాతనైనా కప్పు పెరుగు తీసుకుంటే... ఇందులోని లాక్టోబాసిల్లస్ బ్యాక్టీరియా పేగుల్లోని ఇన్‌ఫెక్షన్లతో పోరాడుతుంది. వేసవిలో వచ్చే విరేచనాలు, గ్యాస్ట్రిక్ సమస్యలను అరికట్టడంలో కీలకపాత్ర పోషిస్తుంది. వేసవిలో లభించే పీచు పదార్థాలు పుష్కలంగా ఉండే పండ్లు, కూరగాయలు తీసుకోవాలి. నీటి శాతం ఎక్కువ ఉండే కీరదోసను తీసుకోవాలి. ఇది పొట్టను చల్లబరుస్తుంది. పుచ్చకాయ డీహైడ్రేషన్ బారిన పడకుండా కాపాడుతుంది. సొరకాయ, బీరకాయ, పొట్లకాయ... వంటివి తేలిగ్గా జీర్ణమవుతాయి. నూనెలో వేయించిన పదార్థాలు, ఎక్కువ మసాలాలు ఉన్న కూరలు, కెఫీన్ (కాఫీ, టీ) ఎక్కువగా తీసుకోవడం గట్ హెల్త్‌కు మంచిది కాదు. ఇవి ఎసిడిటీని పెంచి, కడుపులో అసౌకర్యాన్ని కలిగిస్తాయి. అందుకే, ఈ కాలంలో వీటికి వీలైనంతవరకూ దూరంగా ఉండండి. అలానే, శీతల పానీయాల కంటే కొబ్బరినీళ్లు, నిమ్మరసం తీసుకోవడం ఉత్తమం. అసలు డీహైడ్రేషన్ సమస్య రానివ్వకుండా తగినన్ని నీళ్లు తాగడమూ తప్పనిసరి. గట్ హెల్త్‌కు నిద్రకు సంబంధం ఉంది. సరైన నిద్ర లేకపోతే శరీరంలో ఒత్తిడి పెరిగి జీర్ణక్రియ దెబ్బతింటుంది. అందుకే, కనీసం 7,8 గంటలు గాఢంగా నిద్రపోయేలా చూసుకుంటే మేలు.

## జియో ప్లాట్‌ఫామ్స్ ఎండీగా ఆకాశ్ అంబానీ



ఐపీఓ సన్నాహాల్లో ఉన్న డిజిటల్ సేవల సంస్థ జియో ప్లాట్‌ఫామ్స్‌కు మేనేజింగ్ డైరెక్టరుగా ఆకాశ్ అంబానీ నియమితులయ్యారు. 2026 ఏప్రిల్ 9 నుంచి అయిదేళ్ల కాలానికి ఆయన్ను నియమించినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు కంపెనీ తెలిపింది. ప్రతిపాదిత ఐపీఓ కోసం ముసాయిదా పత్రాలను మే ఆఖరు లేదా జూన్‌లో జియో ప్లాట్‌ఫామ్స్ దాఖలు చేసే అవకాశం ఉంది.





# మళ్లీ కంపెనీలో 51% వాటా సాధించాలి..



టెలికాం దిగ్గజం సునీల్ భారతీ మిత్తల్, వచ్చే పదేళ్లలో భారతీ ఎయిర్‌టెల్ పగ్గాలను తన పిల్లలకు అప్పగించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇదే సమయంలో ఎయిర్‌టెల్‌లో ప్రమోటర్ సంస్థ భారతీ టెలికాం మళ్లీ 50% కంటే ఎక్కువ (51%) వాటా సాధించాలని కోరుకుంటున్నారు. ప్రస్తుతం ఎయిర్‌టెల్‌లో మిత్తల్ కుటుంబం, సింగ్‌టెల్ గ్రూప్‌నకు చెందిన భారతీ టెలికాంకు 40.47% వాటా ఉంది. దీన్ని 51 శాతానికి పెంచాలంటే, ప్రస్తుతం సంస్థ మార్కెట్ విలువ ప్రకారం దాదాపు రూ.లక్ష కోట్లు పెట్టుబడి అవసరమని మిత్తల్ అంచనా వేశారు. ప్రస్తుతం కంపెనీ ఛైర్మన్‌గా ఉన్న మిత్తల్ పదవీకాలాన్ని మరో అయిదేళ్ల పాటు (2031 సెప్టెంబరు 30 వరకు) పొడిగిస్తూ బోర్డు నిర్ణయించిన నేపథ్యంలో ఆయన ఈ వివరాలు తెలిపారు. వచ్చే దశాబ్దకాలంలో షేర్‌హోల్డర్లుగా తన తర్వాతి తరానికి బాధ్యతలు అప్పగించే సమయానికి, కంపెనీపై తమకు పూర్తి నియంత్రణ ఉండాలని మిత్తల్ ఆశిస్తున్నారు. భారతీ టెలికాంలో భారతీ ఎంటర్‌ప్రైజెస్‌కు 50.56%, సింగ్‌టెల్‌కు 49.44% వాటాలు ఉన్నాయి. సింగ్‌టెల్ తన వాటాలను విక్రయిస్తున్న నేపథ్యంలో, వచ్చే 3-4 ఏళ్లలో భారతీ టెలికాం తన పట్టును పెంచుకోవాలని భావి స్తోంది. భారతీ ఎయిర్‌టెల్‌లో సింగ్‌టెల్‌కు దాదాపు 7% వాటా ఉంది.విస్తరణ బాటలో ఎయిర్‌టెల్ ఆఫ్రికా: ఎయిర్‌టెల్ ఆఫ్రికాలో ప్రస్తుతం ఉన్న 62.73% వాటాను 79 శాతానికి పెంచేందుకు రూ.28,220 కోట్ల విలువైన షేర్ స్వాప్ ఒప్పందానికి ఎయిర్‌టెల్ బోర్డు ఆమోదం తెలిపింది. నిబంధనల ప్రకారం ఆఫ్రికా విభాగంలో వాటాను 90% వరకు పెంచుకోవాలని, దీని వల్ల అక్కడి నుంచి వచ్చే ఆదాయం మాతృసంస్థ భారతీ ఎయిర్‌టెల్‌కు లాభదాయకంగా మారుతుందని మిత్తల్ పేర్కొన్నారు. కేవలం డివిడెండ్లు, బైబ్యాక్ ద్వారా నిధులను వెనక్కి తీసుకునే ఐటీ కంపెనీల మాదిరిగా ఎయిర్‌టెల్ ఉండదని స్పష్టం చేశారు. లాభాలను తిరిగి కంపెనీ వృద్ధికి, అంతర్జాతీయ టెలికాం ఆస్తుల కొనుగోలుకు వినియోగిస్తామని మిత్తల్ వెల్లడించారు. 1976లో భారతీ గ్రూప్‌ను సునీల్ భారతీ మిత్తల్ స్థాపించారు. ప్రస్తుతం టెలికాం, స్పేస్ కమ్యూనికేషన్స్, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆర్థిక సేవల రంగాల్లో ప్రపంచ స్థాయి సంస్థగా కంపెనీ ఎదిగింది.

# నష్టాల్లో ముగిసిన సూచీలు

ముంబయి:
దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరగడం, డాలరుతో రూపాయి మారకం విలువ తొలిసారి 96 మార్కును దాటడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీనికితోడు మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో రెండ్రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఉదయం 75,497.10 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,398.72) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 75,870.36 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంది. చివరికి 160.73 పాయింట్ల నష్టంతో 75,237.99 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 46.10 పాయింట్ల నష్టంతో 23,643.50 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ ఇంట్రాడేలో 96.15 వద్ద కనిష్ఠాన్ని తాకి 95.94కి చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, ఎటర్నల్, రిలయన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎస్‌బీఐ షేర్లు నష్టాల్లో ముగిశాయి. ఇన్ఫోసిస్,



టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, అదానీ పోర్ట్స్, మారుతీ సుజుకీ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 108 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,560 వద్ద ట్రేడవుతోంది.

# హోండాకు మొదటి వార్షిక నష్టం




జపాన్ వాహన దిగ్గజం హోండా 423.9 బిలియన్ యెన్‌ల (రూ.25,500 కోట్ల) వార్షిక నష్టాన్ని ప్రకటించింది. కంపెనీ చరిత్రలో ఒక ఆర్థిక సంవత్సరం మొత్తంమీద నష్టం రావడం ఇదే తొలిసారి. విద్యుత్ వాహన (ఈవీ) ప్రణాళికల కోసం చేసిన భారీ ఖర్చులే ఈ నష్టాలకు ప్రధాన కారణం. హోండా ఈవీ కార్యకలాపాలకు సంబంధించి మొత్తం నష్టం 2.5 లక్షల కోట్ల యెన్‌ల (దాదాపు రూ.1.5 లక్షల కోట్ల) వరకు ఉండొచ్చని కంపెనీ తెలిపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న అమెరికా అనుకూల విధానాలు, పర్యావరణ నిబంధనల సడలింపు, ఈవీలకు ప్రోత్సాహకాల తగ్గింపు వంటివి హోండా లాభదాయకతను దెబ్బతీశాయి. వాహన విడిభాగాల దిగుమతిపై ట్రంప్ విధించిన 15% సుంకాలు కూడా కంపెనీపై భారాన్ని పెంచాయి. కార్ల విభాగం నష్టాల్లో ఉన్నప్పటికీ, హోండా మోటార్‌సైకిల్ వ్యాపారం బలంగా ఉంది. అంతక్రితం ఏడాదిలో 2 కోట్ల ద్విచక్ర వాహనాలను సంస్థ విక్రయించగా, ఈసారి 2.21 కోట్లు అమ్మింది. భారత్ వంటి మార్కెట్లలో ద్విచక్రవాహనవిభాగంలో హోండా అగ్రస్థానంలో కొనసాగుతోంది. 2028 నుంచి భారత్‌కు ప్రత్యేక మోడళ్లు: రెండేళ్లలో (2028 నుంచి) భారత మార్కెట్ కోసం ప్రత్యేకంగా వాహన మోడళ్లను తీసుకొస్తామని హోండా గ్లోబల్ సీఈఓ తొషిహిరో మిబే తెలిపారు. ఉత్తర అమెరికా, జపాన్‌తో పాటు అత్యంత ప్రాధాన్యత కలిగిన మార్కెట్‌గా భారత్‌ను ప్రకటించారు. భారత కొనుగోలుదార్ల అభిరుచులకు అనుగుణంగా 4 మీటర్ల కంటే తక్కువ పొడవున్న కార్లు, మిడ్ సైజ్ విభాగంలో కొత్త మోడళ్లను కంపెనీ ప్రవేశపెట్టనుంది. భారత్‌లో ఏటా 60 లక్షల ద్విచక్ర వాహనాలను విక్రయిస్తున్న హోండా, ఆ వినియోగదారులు భవిష్యత్తులో కార్ల వైపు మళ్లేలా తన ద్విచక్రవాహన నెట్‌వర్క్‌ను వినియోగించుకోనుంది. మన దేశంలో ద్విచక్రవాహన వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని ప్రస్తుత 62.5 లక్షల నుంచి 2028కి 80 లక్షలకు పెంచాలని నిర్ణయించింది. మధ్య, దక్షిణ అమెరికా, ఆసియన్ దేశాలకు భారత్‌ను ప్రధాన కేంద్రంగా హోండా కొనసాగించనుంది.

### ఆభరణాల ఎగుమతుల కోసం

#### 100 కిలోల పసిడి దిగుమతికే అనుమతి

దేశీయంగా ఆభరణాలు తయారు చేసి, ఎగుమతి చేసేందుకు.. విదేశాల నుంచి సుంకం లేకుండా బంగారాన్ని దిగుమతి చేసుకునేందుకు 'అడ్వాన్స్ ఆథరైజేషన్ (ఏఏ) స్కీం' కింద కంపెనీలకు అనుమతి ఉంటుంది. ఇప్పటివరకు దీనిపై పరిమితి లేకపోగా, తాజాగా 100 కిలోల వరకే ముడి బంగారాన్ని దిగుమతి చేసుకోవాలని ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకం అమలు తీరును నిశితంగా పరిశీలించాలనీ పేర్కొంది. ఈ పథకం కింద ఎగుమతులకు అవసరమైన ప్యాకేజింగ్ సామగ్రి, ఇంధనం వంటివీ సుంకం లేకుండా దిగుమతి చేసుకోవచ్చు. ఏఏ పథకం కింద తొలిసారి దరఖాస్తు చేసుకున్న సంస్థల తయారీ ప్రాంగణాన్ని అధికారులు ప్రత్యక్షంగా తనిఖీ చేయడాన్ని తప్పనిసరి చేశారు. పసిడిపై దిగుమతి సుంకాన్ని 6% నుంచి 15 శాతానికి పెంచిన నేపథ్యంలో, ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటోంది.



# ధరలు పెంచినా నష్టాల్లో ఆయిల్ షేర్లు..

అందరూ ఊహించినట్లే దేశీయంగా చమురు ధరలు పెరిగాయి. పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ.3 చొప్పున చమురు కంపెనీలు సవరించాయి. ఇన్నాళ్లూ భారీ నష్టాలు చవిచూస్తున్న ప్రభుత్వరంగ చమురు కంపెనీలకు ఇది ఊరట కల్పించే అంశం. అయితే, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచినప్పటికీ ఆయా కంపెనీల షేర్లు నష్టాలు చవిచూడడం గమనార్హం. హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ ఇంట్రాడేలో 3 శాతం మేర పతనమై రూ.376కి చేరింది. భారత్ పెట్రోలియం కార్పొరేషన్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సైతం దాదాపు 2 శాతం నష్టాల్లో ట్రేడవుతున్నాయి. అటు సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలైన మహానగర్ గ్యాస్, ఇంద్రప్రస్థ గ్యాస్, గుజరాత్ గ్యాస్ కంపెనీలు కూడా నష్టాల్లో ట్రేడవుతుండడం గమనార్హం. క్రూడాయిల్‌ను ముడిపదార్థంగా వినియోగించే పెయింట్ స్టాక్స్ కూడా క్షీణించాయి. ఇండిగో పెయింట్స్, ఏషియన్ పెయింట్స్, బెర్జర్ పెయింట్స్ స్వల్ప నష్టాలు చవిచూశాయి. పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలు స్వల్ప మొత్తంలో పెరగడం వల్ల ప్రభుత్వరంగ చమురు సంస్థలకు కొంతమేర ఊరట కల్పించే అంశం అయినప్పటికీ.. నష్టాలను పూడ్చే స్థాయిలో లేకపోవడంతో ఆయిల్ కంపెనీ షేర్లు క్షీణించినట్లు అనలిస్టులు అంచనా వేస్తున్నారు. ఒకప్పుడు 60 డాలర్లుగా బ్యారెల్ క్రూడాయిల్ ధర పశ్చిమాసియా ఉద్రిక్తలతో గరిష్ఠంగా 130 డాలర్ల వరకు చేరిందని, ప్రస్తుతం 107 డాలర్ల వద్ద ట్రేడవుతోందని తెలిపారు. దీంతో రోజుకు రూ.1000 కోట్లు చొప్పున చమురు కంపెనీలు నష్టాలు చవిచూస్తున్నట్లు కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ పురి వెల్లడించిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. చమురు ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇలానే కొనసాగి హర్మూజ్ తెరుచుకోకపోతే రాబోయే వారాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు మరింత పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.15 వరకు పెంచొచ్చని మార్కెట్ అంచనా వేసిందని, పెరిగిన మొత్తం తక్కువేనని అభిప్రాయపడుతున్నారు. కాబట్టి ముమ్ముందు పెంపు నిర్ణయాలు వెలువడొచ్చని అంచనా వేస్తున్నారు.



### రూపాయి మరింత పతనం..



ముంబయి: అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ భారీగా పతనం అయ్యింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా డాలర్ విలువ తొలిసారి రూ.96 మార్కును దాటింది. గురువారం ట్రేడింగ్ సెషన్‌లో 95.96 వద్ద కనిష్ఠాన్ని తాకిన రూపాయి విలువ.. శుక్రవారం మధ్యాహ్నం 96.07 కనిష్ఠాన్ని తాకింది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరల పెరుగుదల నేపథ్యంలో మన రూపాయిపై ఒత్తిడి పెరుగుతోంది. దిగుమతి చేసుకునే వంట నూనెలు, చమురు, సహజ వాయువు, ఎలక్ట్రానిక్స్, బంగారం, లగ్జరీ కార్లు, గడియారాలు మరింత ఖరీదవుతాయి. నిత్యావసరాల ధరలు పెరుగుతాయి. ద్రవ్యోల్బణం పెరిగి, ప్రజల కొనుగోలు శక్తి క్షీణిస్తుంది. విదేశీ ఉన్నత విద్య కోసం తమ పిల్లల్ని పంపిన తల్లిదండ్రులపై భారం పెరుగుతుంది. అదే సమయంలో మన దేశం నుంచి వస్తువులు, సేవలు ఎగుమతి చేసే వారికి మాత్రం లాభం కలుగుతుంది.




## రోహిత్ చెప్పిన మాటలే వింటా: తిలక్ వర్మ



పంజాబ్ కింగ్స్‌పై ముంబయి ఇండియన్స్ సంచలన విజయం సాధించడంలో తిలక్ వర్మ కీలక పాత్ర పోషించాడు. తన 75 పరుగుల అజేయమైన ఇన్నింగ్స్‌తో ముంబయిని గెలిపించాడు. ఈ సందర్భంగా విభిన్నంగా సెలబ్రేషన్స్ చేసుకుంటూ కనిపించాడు. అయితే, ఇవన్నీ రోహిత్ శర్మ కోసమని ఆ తర్వాత తిలక్ తెలిపాడు. '45' అంకెలను చూపిస్తూ ఇది నీ కోసమని చెప్పడం విశేషం. డగౌట్‌లోని రోహిత్ నవ్వుతూ కనిపించాడు. అనంతరం డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లాక.. సైడ్‌ఆర్మ్ స్పెషలిస్ట్ ముర్తుజా హుస్సేన్‌తో రోహిత్, తిలక్ వీడియో కాల్‌లో మాట్లాడారు. "మనతో ఆర్‌ఎస్ 45 ఉన్నారు. నేనెప్పుడూ రోహిత్ భాయ్ మాటే వింటా" అని తిలక్ హార్ట్ సింబల్ చూపించాడు. అనంతరం తిలక్ ఇన్నింగ్స్‌ను రోహిత్ ప్రశంసించాడు. తన ఇన్నింగ్స్‌ను చూడొద్దని.. తిలక్ ఆటను చూడాలని చెప్పడం గమనార్హం. ఈ వీడియోను ముంబయి ఇండియన్స్ సోషల్ మీడియాలో పంచుకుంది.

# పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు

## ఐసీసీ డబుల్ షాక్



ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ నాలుగో సీజన్‌లో పాకిస్థాన్ జట్టు ఆడింది కేవలం మూడే టెస్టులు. అందులో రెండింట్లో ఓడిపోగా.. ఒక్క విజయం మాత్రమే సాధించింది. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో ఎక్కడో ఎనిమిదో స్థానంలో ఉంది. తాజాగా ఐసీసీ నిర్ణయంతో పాయింట్ల కోతతో పాటు ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో భారీ జరిమానా పడింది. దీంతో పాక్‌కు ఐసీసీ డబుల్ షాక్ ఇచ్చింది. ఢాకా వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో పాకిస్థాన్ 104 పరుగుల తేడాతో ఘోర ఓటమిని చవిచూసింది. 267 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక కుదేలైంది. ఈ మ్యాచ్‌లో పాక్ స్లో ఓవర్ రేట్ కారణంగా ఐసీసీ రిఫరీ ఆగ్రహానికి గురైంది. ఏకంగా 8 ఓవర్ల పాటు ఆలస్యం కావడంతో డబ్ల్యూటీసీలో ఎనిమిది పాయింట్లను కోల్పోయింది. ప్రస్తుతం ఆ జట్టు ఖాతాలో కేవలం నాలుగు పాయింట్లు మాత్రమే ఉన్నాయి. ఇప్పటికే ఓటమి బాధలో ఉన్న పాక్‌కు ఇది తొలి షాక్. ఆ జట్టు కెప్టెన్ షాన్ మసూద్‌తో పాటు ఆటగాళ్లందరికీ ఒక్కొక్కరిపై 40 శాతం మ్యాచ్ ఫీజులో జరిమానా విధిస్తూ ఐసీసీ రెండో షాక్ ఇచ్చింది. మ్యాచ్ రిఫరీ జెఫ్ క్రోవ్ నిర్ణయం మేరకు విధించినట్లు ఐసీసీ ప్రకటన విడుదల చేసింది. ఐసీసీ నిబంధనల ప్రకారం.. ఒక్కో స్లో ఓవర్‌కు మ్యాచ్ ఫీజులో 5 శాతం, ఒక పాయింట్‌ను కోల్పోవాల్సి ఉంటుంది. ఇప్పుడు పాకిస్థాన్ ఏకంగా 8 ఓవర్లు ఆలస్యం కావడంతో భారీ జరిమానా తప్పలేదు. ప్రస్తుతం ఐసీసీ డబ్ల్యూటీసీ టేబుల్‌లో ఆస్ట్రేలియా (87.50 శాతం), న్యూజిలాండ్ (77.78 శాతం) తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి. దక్షిణాఫ్రికా (75), శ్రీలంక (66.67), భారత్ (48.15) తర్వాత స్థానాల్లో ఉన్నాయి. వచ్చే ఏడాది మార్చి నాటికి తొలి రెండు స్థానాల్లో నిలిచే టీమ్‌లు డబ్ల్యూటీసీ ఫైనల్‌లో తలపడ్డాయి. ఎవరు విజేతగా నిలిస్తే వారికే టెస్టు గద దక్కుతుంది.

# రికార్డు స్థాయిలో 110 కోట్ల వ్యూస్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ ఎడిషన్‌కు అభిమానుల్లో ఏమాత్రం ఆదరణ తగ్గలేదు. మొన్నటివరకూ ఎన్నికల హడావుడి ఉన్నా సరే.. తట్టుకొని మరీ అద్భుత గణాంకాలను నమోదు చేసింది. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక వ్యూయర్‌షిప్ ఈ సీజన్‌లో రావడం గమనార్హం. టీవీ, డిజిటల్ వ్యూస్‌లో భారీ పెరుగుదల కనిపించింది. రెండు ప్లాట్‌ఫామ్‌ల్లో 1.1 బిలియన్ వ్యూస్ వచ్చినట్లు జియో హాట్‌స్టార్ వెల్లడించింది. టీవీ వ్యూయర్‌షిప్ 50 కోట్ల మార్క్‌ను తాకింది. ఇటు డిజిటల్ విభాగంలో 15 శాతం వృద్ధి నమోదు చేసినట్లు జియో వెల్లడించింది. ఇందులో మ్యాచ్‌లను వీక్షించిన సమయం 7 శాతం పెరిగిందని తెలిపింది. ప్రాంతీయ భాషల్లోనూ 42 శాతం పెరగడం గమనార్హం. ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా మారడంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. "ఐపీఎల్ 2026 సీజన్‌ను అభిమానులు భారీగా ఆదరిస్తున్నారనేందుకు ఇదొక తార్కాణం. లీగ్ స్టేజ్‌లో ఇంకా మ్యాచులు ఉన్నాయి. ప్రతివారం పోటీల్లో తీవ్రత పెరుగుతోంది. ఫ్యాన్స్ పెద్దఎత్తున చూస్తున్నారు. ప్లేఆఫ్స్ రేసు ఆసక్తికరంగా మారుతున్న వేళ.. జియోస్టార్ ప్రతిదానిని అభిమానులకు చేరువ చేసేందుకు ప్రయత్నాలను కొనసాగిస్తూనే ఉంటుంది" అని జియోస్టార్ సేల్స్ హెడ్ అనుప్ గోవిందన్ వెల్లడించారు. ఇప్పుడు వెల్లడించిన డేటా 51వ మ్యాచ్ వరకు మాత్రమే. ప్రస్తుతం 58 మ్యాచులు ముగిశాయి. ఈ సీజన్ లీగ్ స్టేజ్‌లో ఇంకా 12 మ్యాచులు మాత్రమే మిగిలిఉన్నాయి.



## అదొక్కటే మిగిలింది.. జరిగేలా అనిపించడం లేదు: జస్‌ప్రీత్ బుమ్రా

ఐపీఎల్‌లో తొలిసారి సారథ్య బాధ్యతలు చేపట్టిన జస్‌ప్రీత్ బుమ్రా.. ముంబయి ఇండియన్స్‌ను గెలిపించాడు. ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన ముంబయి దెబ్బకు పంజాబ్ కింగ్స్ కష్టాల్లో పడింది. తిలక్ వర్మ విజృంభణతో 200+ టార్గెట్‌ను ముంబయి మరొక బంతి మిగిలిఉండగానే కొట్టేసింది. తన సారథ్యంలో తొలి విజయం నమోదు చేయడం ఆనందంగా ఉందన్న బుమ్రా.. కెరీర్‌లో వన్డే కెప్టెన్సీ మాత్రమే చేయాల్సి ఉందన్నాడు. అయితే, అది మాత్రం జరిగేలా అనిపించడం లేదంటూ సరదాగా వ్యాఖ్యానించాడు. 'విజయంతో ఐపీఎల్‌లో నా కెప్టెన్సీ మొదలైంది. ఈ మ్యాచ్‌లో ఇరు జట్లూ అద్భుతంగా ఆడాయి. మంచి ఆరంభం దక్కిన తర్వాత మిడిల్‌లో కాస్త వెనకబడినట్లు అనిపించినా.. చివరికి విజయం సాధించడం ఆనందంగా ఉంది. ప్రస్తుతండెత్ ఓవర్లలో బౌలింగ్ చేయడం చాలా కష్టమైన పని. గతంతో పోలిస్తే ఇప్పుడు పిచ్ చాలా పొడిగా ఉంది. బౌలర్లు లెంగ్త్‌కు కట్టుబడి బౌలింగ్ చేస్తేనే ఫలితం అనుకూలంగా వస్తుంది. మా ప్లాన్ కూడా అదే. తక్కువ పేస్‌తో బౌలింగ్ చేయాలని అనుకున్నాం. అలాగే చేయగలిగాం. ఈ మ్యాచ్‌లో కీలక మలుపు తిలక్ వర్మ-విల్ జాక్స్ భాగస్వామ్యంతోపాటు శార్దూల్ బౌలింగ్. ఈ విజయంలో క్రెడిట్ తిలక్, శార్దూల్‌కే చెందుతుంది. రికెల్టన్, జాక్స్ ఆటను తక్కువ చేయడం లేదు. విల్ జాక్స్ ఫినిషింగ్ బాగుంది. చిన్న కంట్రిబ్యూషన్ అయినా టీ20 గేమ్‌లో చాలా ప్రభావం చూపిస్తుంది. ప్రతిఒక్కరూ తమ పాత్రను పోషించడం బాగుంది. ఐపీఎల్‌లో తొలిసారి సారథ్యం చేశా. ఇంతకుముందు టెస్టులకు నాయకత్వం వహించా. అంతర్జాతీయ టీ20ల్లోనూ కెప్టెన్‌గా చేశా. కానీ, వన్డేల్లో మాత్రం అలాంటి అవకాశం రాలేదు. అది జరిగేలా అనిపించడం లేదు (నవ్వుతూ). ఏం అవుతుందో చూడాలి" అని బుమ్రా తెలిపాడు.



## ప్రతిసారీ నిరూపించుకోవాల్సిన పరిస్థితులు నాకొద్దు: విరాట్



భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పటికే అంతర్జాతీయ టీ20లు, టెస్టులకు వీడ్కోలు పలికిన కోహ్లీ వన్డేల్లోనే కొనసాగుతున్నాడు. వచ్చే వన్డే ప్రపంచకప్‌లో అతడికి చోటు దక్కుతుందా? లేదా? అనే దానిపై చర్చ సాగుతూనే ఉంటుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో టీమ్‌ఇండియా సెలక్షన్ కమిటీని ఉద్దేశించి పరోక్షంగా విరాట్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ప్రతిసారి తన నిబద్ధతను నిరూపించుకోవాలనే పరిస్థితులను కోరుకోవడం లేదని స్పష్టంచేశాడు. నా దృక్పథం చాలా స్పష్టం. జట్టుకు విలువ తీసుకొస్తానని అనుకుంటే భాగమవుతా. టీమ్‌కు ఉపయోగమని భావిస్తే నన్ను గుర్తించినట్లు అవుతుంది. అలా కాకుండా ప్రతిసారీ నిరూపించుకోవాలని అంటే మాత్రం.. అక్కడ ఉండలేను. నా సన్నద్ధత, నిబద్ధతపై అత్యంత నిజాయతీగా వ్యవహరిస్తా. గేమ్‌లో ఎలా ముందుకువెళ్లాలనే విషయంలో నిజాయతీతో ఉంటా. అందుకోసం కష్టపడతా. నాకు అంతటి శక్తినిచ్చిన దేవుడికి ఎప్పుడూ రుణపడి ఉంటా. కష్టపడే విషయంలో నేనెవరికీ తక్కువ కాదు. వన్డేల్లో 40 ఓవర్ల పాటు ఈ బౌండరీ నుంచి ఆ బౌండరీ లైన్ వరకూ పరుగు పెట్టమనండి. ఎలాంటి ఫిర్యాదు లేకుండా ఆ పని చేస్తా. అందుకుతగ్గట్టుగానే నా సన్నద్ధత ఉంటుంది. 50 ఓవర్లలో.. ప్రతి బంతి కూడా నాకు చివరిదే అన్నట్లుగా భావిస్తా. కెరీర్‌లో నేను ఇదే నా చివరి బంతి అనుకుంటా. నా బ్యాటింగ్ కూడా అదేవిధంగా ఉంటుంది. జట్టు కోసం నావల్ల ఏదైతే అది చేయడానికి సిద్ధంగా ఉంటా. ఇవన్నీ చేసినా.. నా స్థానం కోసం నిరూపించుకోవాలంటే మాత్రం అక్కడ ఉండలేను. ఆట కోసం ఏం చేయాలో నాకు తెలుసు. ఏదైనా సిరీస్‌కు రెండు లేదా మూడు వారాల ముందు సన్నద్ధత అయ్యే వ్యక్తిని కాను. ఏడాదం తా రెడీగా ఉంటా. నువ్వు రాబోయే సిరీస్ లో ఆడాలని చెబితే అందుకు సిద్ధమని చెబుతా. నా రోజువారీ దినచర్య అలానే ఉంటుంది. వర్కౌట్లు చేస్తా. మంచి ఆహా రం తీసుకుంటా. ఇదేదో కేవలం క్రికెట్ కోసం మాత్రమే కాదు. నా లైఫ్ స్టైల్ అలాంటిది. ఇప్పుడు మనం 2026 ఏడాది మధ్యలో ఉన్నాం. అయినా చాలా మంది 2027 వన్డే ప్రపంచ కప్‌లో ఆడ తావా?లేదా? అడుగుతుంటారు. ఆ ప్రశ్నకు నాకు సమాధానం తెలుసు. భారత్ తరఫున వరల్డ్ కప్‌లో ఆడటం ఎప్పుడూ అద్భుతమే. అది కేవలం నేను ఒక్కడినే తీసుకొనే నిర్ణయం కాదు అప్పుడు టెస్టులకు స్వర్ణయుగం "టెస్టు జట్టుకు నాయకత్వం వహించడం ఎప్పు డూ గర్వకారణమే. ఎన్నో విజయాలు సాధించాం. ఆ సమయం టెస్టులకు స్వర్ణ యుగం అనిపించింది. యువ క్రికెటర్లూ తమ అవకాశాల కోసం ఎదురు చూస్తూ ఉండేవారు. రిజర్వ్ బెంచ్ కూడా బలంగా ఉండేది. అప్పుడు జట్టులో ఉన్న ఆటగాళ్లకు, నాకు వయసులో పెద్దగా వ్యత్యాసం లేకపోవడమూ కలిసొచ్చింది. ప్రతిఒక్కరితో బాధ్యతలను పంచుకొనే వాడిని. అక్కడ సీనియర్లు, జూనియర్లు అనే గొడవే లేదు. మేమంతా స్నేహితుల్లా ఉండేవాళ్లం. నాయకత్వం చేపట్టినప్పుడు ఒకటే అనుకున్నా. మరో ఏడెనిమిదేళ్ల తర్వాత ఈ జట్టు గురించి ప్రతి ఒక్కరూ మాట్లాడుకోవాలని భావించాం. అందుకుతగినట్టుగానే విదేశాల్లో మేం అత్యుత్తమ విజ యాలు సాధించామని కోహ్లీ వెల్లడించాడు.

# వుదయం సినిమా

MOVIE TIME!

## రాక్షసపురం విజయం సాధించడం సంతోషంగా ఉంది: కె.ఎస్.రామారావు

**వుదయం సినిమా :** ప్రముఖ నిర్మాణ సంస్థ క్రియేటివ్ కమర్షియల్స్ అధినేత, సీనియర్ నిర్మాత కె.ఎస్.రామారావు తెలుగు ప్రేక్షకులకు అందించిన లేటెస్ట్ మూవీ 'రాక్షసపురం'. కన్నడలో సంచలన విజయం సాధించిన 'రాక్షసపుర' చిత్రానికి ఇది తెలుగు అనువాదం. ఈ రోజు (మే 15న) ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలకు వచ్చిన 'రాక్షసపురం' సినిమా మంచి విజయాన్ని సాధించింది. ఈ సందర్భంగా సక్సెస్ మీట్ ను హైదరాబాద్ లో నిర్వహించారు.



## ఇరుముడి అయ్యప్ప సాంగ్




**వుదయం సినిమా :** మాస్ మహారాజా రవితేజ హీరోగా, శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భక్తి నేపథ్య చిత్రం 'ఇరుముడి' నుంచి ఒక అదిరిపోయే క్రేజీ అప్‌డేట్ వచ్చింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ అయ్యప్ప పడిపూజలు, భజనలు జరిగినా ఖచ్చితంగా వినిపించే అత్యంత ప్రజాదరణ పొందిన ప్రైవేట్ భక్తి గీతం 'మల్లెపూల పల్లకి' (విల్లాలి వీరుడు.. వీర మణికంరుడు.. ఎక్కినాడు బంగారు పల్లకి) పాటను ఈ సినిమాలో రీమిక్స్ చేయబోతున్నారు. ఈ వార్తను చిత్ర సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ అధికారికంగా సోషల్ మీడియా వేదికగా ఖరారు చేశారు.అయ్యప్ప భక్తులకు ఎంతగానో ఇష్టమైన 'మల్లెపూల పల్లకి' భజన పాటను సినిమాలో పెట్టాలని అభిమానుల నుండి, భక్తుల నుండి భారీగా డిమాండ్ వచ్చింది. దీంతో చిత్ర యూనిట్ స్పందించి, ఈ ఐకానిక్ సాంగ్‌ను రీమిక్స్ రూపంలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సిద్ధమైంది. మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. ప్రకాష్ తన ఎక్స్ ఖాతాలో 'విల్లాలి వీరుడు.. వీర మణికంఠుడు' అంటూ పోస్ట్ పెట్టి ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. రవితేజ మార్క్ ఎనర్జీకి, ఈ పవర్‌ఫుల్ మాస్ డివోషనల్ సాంగ్ జతకావడంతో థియేటర్లలో ప్రేక్షకులకు, భక్తులకు గూస్‌బంప్స్ రావడం ఖాయమని సినీ వర్గాలు అంటున్నాయి. ఈ సినిమాలో ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా.. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుంది.

## పెద్ది నుంచి పవర్ ఫుల్ లుక్ రిలీజ్



**వుదయం సినిమా :** మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, బుచ్చి బాబు, వృద్ధి సినిమాస్ గౌర్ నాయుడుగా శివరాజ్ కుమార్ మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తన మచ్ అవైటెడ్ రస్టిక్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'తో బాక్సాఫీస్ తుఫాన్ సృష్టించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్సెస్‌లో చరణ్ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు పెంచాయి. ఇప్పుడు ఈ చిత్రానికి పాన్ ఇండియా స్థాయిలో మ్యాసివ్ ప్రమోషన్స్ ప్రారంభమవుతున్నాయి.బుచ్చిబాబు సానా దర్శకత్వంలో నిర్మాత వెంకట సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై 'పెద్ది'ని భారతీయ సినిమాకు కొత్త అనుభూతిని ఇచ్చే విజువల్ స్పెక్టకిల్‌గా రూపొందించారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న థియేట్రికల్ ట్రైలర్‌ను మే 18న ముంబైలో గ్రాండ్ ఈవెంట్‌లో విడుదల చేయనున్నారు.ఈలోగా మేకర్స్ మరో సర్ప్రైజ్ ఇచ్చారు. ఈ చిత్రంలో కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ ఓ కీలక పాత్ర చేస్తున్న సంగతి తెలిసిందే. ఆయనని గౌర్నాయుడుగా పరిచయం చేస్తూ పవర్ఫుల్ వీడియో రిలీజ్ చేశారు.ఈ వీడియోలో శివరాజ్ కుమార్ కుస్తీ బరిలో పవర్ ఫుల్ ప్రెజెన్స్ తో కనిపించడం అందరినీ ఆకట్టుకుంది. ఈ చిత్రంలో ఆయన పాత్ర ఎంత పవర్ ల్ గా ఉండబోతుందో ఈ వీడియో తెలియజేస్తోంది.ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

## స్లమ్ డాగ్ 33 టెంపుల్ రోడ్ పోస్ట్ ప్రొడక్షన్, రీ-రికార్డింగ్



**వుదయం సినిమా :**

విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్, జెబి మోహన్ పిక్చర్స్, పూరి కనెక్ట్స్, డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాధ్, పవర్ హౌస్ పెర్ఫార్మర్ విజయ్ సేతుపతి మోస్ట్ ఎవైటెడ్ పాన్‌ఇండియా మూవీ 'స్లమ్ డాగ్ 33 టెంపుల్ రోడ్'. ఈ చిత్రాన్ని పూరి కనెక్ట్స్ బ్యానర్ పై పూరి జగన్నాధ్, చార్మీ కౌర్, జెబి మోహన్ పిక్చర్స్ జెబి నారాయణరావు కొండ్రోల్లాతో కలిసి నిర్మిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రంకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్, రీరికార్డింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలలో అద్భుతమైన సంగీతాన్ని అందించిన జాతీయ అవార్డు గ్రహీత హర్షవర్ధన్ రామేశ్వర్, 'స్లమ్ డాగ్' 33 టెంపుల్ రోడ్ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. దర్శకుడు పూరి జగన్నాథ్ మ్యూజిక్ డైరెక్టర్‌తో కలిసి రికార్డింగ్ స్టూడియోలో కూర్చొని బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ పనులను పర్యవేక్షిస్తున్నారు. మేకర్స్ రిలీజ్ చేసిన ఫోటో సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. పూరి మార్క్ ఇంటెన్స్ ఎమోషన్స్, రాయాక్షన్‌కు తగ్గట్టుగా మ్యూజిక్ కూడా పవర్‌ఫుల్‌గా ఉండబోతుంది. ఇప్పటికే ఈ ఎక్స్‌ప్లోసివ్ కాంబోపై భారీ అంచనాలు నెలకొనగా, మేకర్స్ త్వరలోనే మరిన్ని స్ట్రైకింగ్ అప్‌డేట్స్ ఇవ్వబోతున్నారు.

## ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కాన్ఫరెన్స్




**వుదయం సినిమా :**

నిర్మాత, ప్రదర్శక మరియు పంపిణీ రంగాలకు చెందిన సభ్యుల సంయుక్త సమావేశం శుక్రవారం, 15052026న ఉదయం 11:00 గంటలకు, హైదరాబాద్‌లోని ఫిల్మ్ నగర్, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది. ఈ సమావేశంలో ప్రదర్శక రంగానికి సంబంధించిన 'శాతాల విధానం' పై చర్చించారు. ఈ సమస్యకు ఒక సముచిత పరిష్కారం కనుగొనేందుకు మరియు శాతాల వివాదాన్ని త్వరిత గతిన పరిష్కరించేందుకు గాను, ఒక ఉప కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ ఉప కమిటీ తన విధులను కింది ప్రముఖుల మార్గదర్శకత్వంలో నిర్వర్తిస్తుంది:

శ్రీ డి. సురేష్ బాబు, అధ్యక్షుడు (ఛైర్మన్)
శ్రీ అల్లు అరవింద్, సీనియర్ నిర్మాత
శ్రీ వి. వెంకటరమణ రెడ్డి (దిల్ రాజు), (మాజీ అధ్యక్షుడు)
డాక్టర్ కె. ఎల్. నారాయణ, సీనియర్ నిర్మాత
శ్రీ కె. అశోక్ కుమార్, గౌరవ కార్యదర్శి (కన్వీనర్)

తదనుగుణంగా, నిర్మాత, ప్రదర్శక మరియు పంపిణీ రంగాల సభ్యులతో కూడిన పై ఉప కమిటీకి కింది వారిని సభ్యులుగా నామినేట్ చేయాలని నిర్ణయించారు.

**నిర్మాత రంగం:**
1. శ్రీ వై. సురేందర్ రెడ్డి
2. శ్రీమతి వై. సుప్రియ
3. శ్రీ వై. రవి శంకర్
4. శ్రీ బి. బాపినీడు
5. శ్రీ చెరుకూరి సుధాకర్
6. శ్రీ జి. శ్రీనివాస్ కుమార్
7. శ్రీ టి. ప్రసన్న కుమార్

**ప్రదర్శక రంగం:**
1. శ్రీ వి. ప్రతాప్ రెడ్డి
2. శ్రీ టి. బాల్గోవింద్ రాజ్
3. శ్రీ కె. అనుపమ్ రెడ్డి
4. శ్రీ పి. శ్రీనివాస రావు
5. శ్రీ జి. వీరనారాయణ బాబు
6. శ్రీ కె. వంశీ కిషోర్ (చిన్ని)
7. శ్రీ ఎం. విజేందర్ రెడ్డి

**పంపిణీ రంగం:**
1. శ్రీ డి. విష్ణు మూర్తి
2. శ్రీ వి. వీరనాయుడు
3. శ్రీ ఎన్. సుధాకర్ రెడ్డి
4. శ్రీ ముత్యాల రామదాసు
5. శ్రీ ఎన్. నాగార్జున
6. శ్రీ బి. మధుసూదన్ రెడ్డి (ఠాగూర్ మధు)
7. శ్రీ ధీరజ్ మొగిలేని

## ప్రత్యేకత చాటుకున్న 'ఎం4ఎం' మూవీ



**వుదయం సినిమా :**
సక్సెస్‌ఫుల్‌గా థియేటర్‌లలో 2వ వారం
ప్రశంసలు అందుకుంటున్న జో శర్మ
త్వరలో ప్రముఖ OTTలో స్ట్రీమింగ్‌కు సిద్ధం

సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్ అంటేనే ఒక ప్రత్యేక క్రేజ్ ఉంటుంది. ఇప్పటివరకు రాని ఒక వినూత్నమైన 'సైకాలజికల్ క్రైమ్ థ్రిల్లర్' సబ్జెక్టుతో ప్రేక్షకుల ముందుకు వచ్చి, అందరినీ ఆకట్టుకుంటోంది 'ఎం4ఎం' (Motive for Murder). గత వారం విడుదలైన ఈ చిత్రం రెండవ వారం కూడా బాక్సాఫీస్ వద్ద పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతోంది. అంతేకాకుండా, IMDb, BookMyShow వంటి ప్లాట్‌ఫామ్‌లలో టాప్ రేటింగ్‌స్‌ను సొంతం చేసుకుంటోంది. సరికొత్త కాన్సెప్ట్, థ్రిల్లింగ్ స్క్రీన్‌ప్లే, ఉత్కంఠభరిత కథనంతో రూపొందిన ఈ సినిమా టాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. మోహన్ మీడియా క్రియేషన్స్ బ్యానర్‌పై, McWin Group USA సహకారంతో తెరకెక్కిన ఈ చిత్రానికి మోహన్ వడ్లపట్ల దర్శకత్వం వహించారు. డెబ్యూ డైరెక్టర్‌గా ఆయన చూపించిన మేకింగ్ స్టైల్, సస్పెన్స్‌ను నడిపించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా దర్శకుడు మోహన్ వడ్లపట్ల మాట్లాడుతూ, "ప్రేక్షకులు సినిమా కాన్సెప్ట్‌ను, స్క్రీన్‌ప్లేను ఆదరిస్తుండటం చాలా ఆనందంగా ఉంది. ప్రతి ఒక్కరి నుంచి వస్తున్న స్పందన మాకు మరింత ఉత్సాహాన్ని ఇస్తోంది" అని తెలిపారు.

## 'మహాకాళి' చిత్రీకరణ పూర్తి



**వుదయం సినిమా :**
ప్రశాంత్ వర్మ, ఆర్కేడీ స్టూడియోస్ 'మహాకాళి'లో చేసిన రోహిత్ సరాఫ్, హైదరాబాద్‌లో భారీ షెడ్యూల్ చిత్రీకరణ పూర్తి 'హనుమాన్' వరల్డ్ నుంచి వస్తున్న తదుపరి అధ్యాయం 'మహాకాళి'లోకి రోహిత్ సరాఫ్ ఎంట్రీ ఇచ్చారు. దర్శకుడు ప్రశాంత్ వర్మ, ఆర్కేడీ స్టూడియోస్ కలిసి రూపొందిస్తున్న ఈ భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌పై రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. తాజాగా రోహిత్ సరాఫ్ హైదరాబాద్‌లో జరిగిన ఇంటెన్స్ షూటింగ్ షెడ్యూల్‌ను పూర్తి చేశారు. రోహిత్ సరాఫ్ చేరికతో ఈ చిత్రానికి మరింత అప్పీల్ వచ్చింది. ముఖ్యంగా నార్త్ఇండియాలో యువతలో అతనికి ఉన్నఫాలోయింగ్ 'మహాకాళి' పాన్ ఇండియా రీచ్‌ను మరింత బలోపేతం చేయనుంది.ఈ చిత్రంలో అక్షయ్ ఖన్నా, భూమి శెట్టి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్స్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించాయి. పవర్‌ఫుల్, ఇంటెన్స్ లుక్స్‌తో సినిమాపై క్యూరియాసిటీ పెరిగింది. 'మహాకాళి' అత్యంత ఆసక్తికరమైన పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లలో ఒకటిగా నిలుస్తోంది.



## 'నాగబంధం' ఫస్ట్ లుక్ రిలీజ్

**వుదయం సినిమా :**
విరాట్ కర్ణా, అభిషేక్ నామా, నిక్ స్టూడియోస్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'నాగబంధం' నుంచి లీలావతిగా అనసూయ భరద్వాజ్ ఇంటెన్స్ ఫస్ట్ లుక్ రిలీజ్

అభిషేక్ నామా దర్శకత్వంలో, విరాట్ కర్ణా నటించిన 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' చిత్రం జూలై 3న థియేటర్లలో ఘనంగా విడుదల కాబోతున్న నేపథ్యంలో అంచనాలు భారీగా పెరుగుతున్నాయి. ప్రతీ అప్‌డేట్ తో ఈ చిత్రంపై బజ్ నెక్స్ట్ లెవల్ కి చేరుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్, గ్లింప్స్, సాంగ్స్ సినిమాపై మ్యాసీవ్ బజ్ క్రియేట్ చేశాయి. తాజాగా మేకర్స్ 'నాగబంధం' సినిమా నుంచి అనసూయ భరద్వాజ్ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. 'లీలావతి' పాత్రలో ఆమె లుక్ పవర్‌ఫుల్‌గా, మిస్టీరియస్‌గా కనిపిస్తోంది.సంప్రదాయ తెలుపు చీరలో, ట్రైబల్ జ్యువెలరీతో అనసూయ కనిపించిన తీరు పాత్రలోని తీవ్రతను ప్రతిబింబిస్తోంది. లీలావతి పాత్ర కథలో ఎంతో కీలకంగా ఉండబోతోందనే ఫీల్ ఈ పోస్టర్‌తోనే స్పష్టమవుతోంది. ఈ సినిమాలో నభా నటేష్, ఐశ్వర్యా మీనన్, రిషబ్ సాహ్నీ, జగపతి బాబు, గరుడ రామ్, మహేష్ మాంజ్రేకర్, జయప్రకాశ్, మురళీ శర్మ, బి.ఎస్. అవినాష్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.
ఎన్ఐకే స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్ నిర్మాణంలో వస్తున్న 'నాగబంధం' పౌరాణికం, చరిత్ర, యాక్షన్ అంశాల కలయికగా రూపొందుతోంది.
పాన్ ఇండియా స్థాయిలో 'నాగబంధం' చిత్రం జూలై 3న విడుదల కానుంది.

Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.